కవిత్వం

# సృష్టి

బివివి ప్రసాద్



# సృష్టి

బివివి ప్రసాద్

కవిత్వం

2023–2025

స్వేచ్ఛా ప్రచురణ

***Srishti***
*Telugu Poetry*
*by* ***BVV Prasad***



First Edition : November 2025

Cover Design : Ramana GV
Poet's Photo : Nalla Suryanarayana

Editing : A. Ganga Reddy,
Swathi Kumari,
and Poet

Poet's Address : B.V.V. Prasad
# 23-12-21, Kambhampati Street,
Sajjapuram, TANUKU - W.G.Dt 534 211
Mobile : 90320 75415
Email : prasadbvv1@gmail.com
Website : bvvprasad.blogspot.com

Publisher : Swecchaa Prachurana, Tanuku
Printed at : Trinity Academy, Bangalore
Copies : 300

For Copies : Aneka Books
# 30-5-26/1, Koka Chalapthirao Street,
Eluru Road, Vijayawada 520 002
Phone : 92472 53884

Price : Rs. **250**

# ఈ కవిత్వం..

ఈ కవిత్వం సాంస్కృతిక వినోదం కోసం కాదు. దుఃఖితుల తరఫున ఎవరిపైననో నెపం వేయటానికి కాదు. జీవితం దుఃఖమయమని తమకి తాముగా గ్రహించిన వారికోసం. దుఃఖవిముక్తి కోసం తమలో తాము పెనుగులాడుతున్న వారి కోసం.

జీవిత పరమావధి దుఃఖమా, ఆనందమా అనే విచికిత్సకు లోనైనవారితో జరిపే సంభాషణ ఈ కవిత్వం. అందం, ఆనందం వెలుపలి వస్తువులా, లోపలి సత్యమా అనే చూపుతో వెదికేవారికోసం ఈ కవిత్వం.

నిజానికి. ఇది, కవిత్వమో, కాదో తెలియదు. ఒక భయ, దుఃఖ కంపిత హృదయపు వెదుకులాట ఈ మాటలు. ఒకడు తన విముక్తి కోసం, అవగాహన కోసం, తాను వెదికే తన లోపలికాంతి కోసం తడుముకొంటూ, తనకి తాను బోధించుకొంటున్నవి. తనని తాను ఓదార్చుకొనే యత్నం ఇవి.

జాతులుగా వేరు విలువలకు చెందినా, హృదయంగా మనుషులు ఒకటనే నమ్మకంతో, తన పెనుగులాటలే ప్రతి హృదయంలో ఉంటాయని భావించి, సాటి మానవులతో పంచుకున్న కన్నీళ్ళు, ఓదార్పులు, సౌందర్యాలు, స్వప్నాలు, తెలియరాని గమ్యాలకి అన్వేషణలు.

ముప్పై, నలభై ఏళ్ళుగా ఏం రాసుకుంటున్నాడో అదే, భిన్నమైన ఛాయల్లో, భిన్నమైన కాంతుల్లో, గాఢతలో, లోతుల్లో మళ్ళీ రాస్తున్నాడు.

పుస్తకం ఎక్కడో ఒకచోట తెరవండి. కొన్ని పంక్తులు చదవండి. ఆగి, లోనికి చూసుకొన్నపుడు, వాటి సారంలో మీకు మీరు కనిపిస్తే, లేదా, అవి మీకు ఊరట కలిగించి వుంటే, ఇవి మీ కోసం రాసినవి. కనబడలేదా, ఇవి మీ కోసం కాకపోవచ్చును, లేదా చదివే సమయం వేరే ఉండవచ్చును.

అందరికీ శుభం కోరుతూ..

**7.11.2025** — బివివి ప్రసాద్

**తణుకు**

కవిత్వం ఒక వ్యక్తి ద్వారా పలికినా, అది కవిని ఆవరించిన వాతావరణం, సంవేదనల, స్పందనల ఫలితమే అవుతుంది. ఈ పుట్టుకనిచ్చి, ప్రేమతో కాచుకొన్న, అమ్మా, నాన్నలని, ఈ కవిత్వం ఇలా రావటానికి సానుకూలమైన అంశాలకి కారణమైన కుటుంబాన్నీ, బంధువులనీ, వ్యాపార కుటుంబాన్నీ, సన్నిహితులనీ, సహచరులనీ; పత్రికలలో, సాహిత్యలోకంలో, సోషల్ మీడియాలలో ఇతని వాక్యాల్ని ప్రేమించిన పరిచయస్తులు, స్నేహితులు, ఆత్మీయులనీ కృతజ్ఞత నిండిన మనసుతో తలచుకుంటూ..

# క్రమసంఖ్య

# సృష్టి

ఖాళీ మనసులో కొన్ని రంగులు ఒంపు
అవి ఆకాశమూ, గాలీ, నీరూ
కాంతీ, చీకటిలో వెన్నెలా

రంగులపై కొన్ని గీతలు గీయి
నదులూ, కొండలూ, మైదానాలూ
ఉదయాస్తమయ మేఘాలూ, పాలపుంతలూ

గీతలను కొంచెం కదిలించి చూడు
చెట్లూ, పిట్టలూ, చేపలూ
చీమలూ, ఏనుగులూ, మనుషులూ

కదలికలలో ఉద్వేగాలు కలుపు
చిక్కగా, లేతగా, తీవ్రంగా, తేలికగా
మంచీ, భయమూ, బాధా, ప్రేమా

ఇంతకన్నా ఊహించేదేమీ లేదు
నువ్వైనా, దేవుడైనా
మళ్ళీ మొదటికి రావలసిందే
నిద్రలోనో, మరణంలోనో, జ్ఞానం లోనో

రచనాకాలం : ఆగస్టు 2024
ప్రచురణ : మెహఫిల్, మన తెలంగాణ 16.12.2024

# రంగుల పిల్లలు

రంగులు అమాయకమైనవి,
నలుపు, తెలుపుల్లా కలలు రాలిపోయినవి కావు,
పసిపిల్లలు ఉల్లాసంగా మేల్కొన్నట్లు
ఉదయాన గగనంలో మేలుకొంటాయి

ఇంద్రధనువుల మీదుగా,
సీతాకోకల రెక్కల మీదుగా, పూలని చేరి,
నీ వైపు నవ్వుతూ దర్శనమిస్తాయి

రంగులు ఈ లోకం మీద నీ ఆశలు నిలిపేవి,
ఆశల మీద ఈ లోకాన్ని నిలిపేవి

ఎంత దుఃఖంలోనూ
ఎక్కడో ఆశ ఉంటుంది చూసావా
అస్తమయబింబం ఆకాశంలోకి విసిరే
చివరి నారింజకాంతిలా

అట్లా, నలుపు, తెలుపుల
దుఃఖానందాల కెరటాల మధ్య
రంగులు నీకు ఆశ కల్పిస్తాయి అమాయకంగా
ఇక్కడింకా ఏదో ఉందని

తెలియందేదో లోకంగా వికసించిన ఇక్కడికి
పసిపిల్లల్లా గునగునా నడుస్తూ

ఆరిందాల్లా వస్తాయి రంగులు,
అంతటినీ చక్కదిద్దే ఘనుల్లా

ఆడింది చాలు పడుకోండని
అమ్మా, నాన్నల వంటి
నలుపు, తెలుపులు పిలిచినపుడు,
బొమ్మల్లాంటి మనని విసిరేసి
ఏకైక మహాశాంతిలోకి జారిపోతాయి

రంగుల్ని నమ్ముకున్న మనం
ఏకైక శూన్యంలో తేలుతూవుంటాం

. . .

ఇప్పుడు కలల్లోకి పాకుతూ వచ్చిన రంగులు
నీతో ఏం మాట్లాడుతున్నాయి

17.7.2025 11.18 రాత్రి
వివిధ, ఆంధ్రజ్యోతి 20.10.2025

# అక్కడికి వెళుతూ..

1

ఎన్నో దుఃఖాలు ఈది, భయాలు దాటి
ఏళ్ళకి ఏళ్ళు నడిచి
ఈ ప్రశాంతమైన ఉదయానికి చేరుకున్నావు
ఈ క్షణం స్వచ్ఛ స్ఫటికంలా
నిలిచిపోతే బావుండుననిపిస్తుందా
ఇక మెల్లగా మంచులా చెదురుతుంది ప్రశాంతత

2

ఈ బస్సు పైన ఆకాశం
అలసట లేక హాయిగా ఎగురుతూవుంది,
కొండలు ఎప్పటిలా దయలోకి ముడుచుకొని
బంగారు ఎండ కాగుతున్నాయి
వాటి ముందు కదిలిన కలలన్నిటిలానే
నువ్వూ మాయమౌతావు

3

నీ జ్ఞాపకాలు ఈ గాలిలోకి ఇంకా ఆవిరికాకుండా
మిగిలిన అనుభవాల మేఘమాలలు
వాటిని వదిలేస్తే చాలు, జీవితంలో మునిగిపోతావు
కానీ, జీవితమంటే ప్రేమా, కాదా
ఇప్పటికీ తేల్చుకోలేదు కదా

4

తెలీనిభాషలో మాటలు నీ ప్రక్కన
పిట్టల కూతల్లానే కేవలం శబ్దాలు
అర్థం తెలీని మాటలు
అర్థాల నుండి విముక్తినిస్తాయి కాసేపు

అర్థం లేకపోవటంలోకి ఎగరలేక కదా
ఇదంతా ఇంత బరువు

5

ఆ కొండని చూస్తే దేవుడిని చూసినట్లు,
తిరిగితే తండ్రి చుట్టూ ఆడుకొంటున్నట్లు,
సృజించుకొన్న బంధమో, ఉద్వేగమో కావచ్చు,
కొండంత అద్దంలో నువ్వే కనబడటమూ కావచ్చు,
ఏ కారణమూ లేదనుకున్నా
దయలోకి కరిగిపోవటం కంటే ఏదీ అనుభవం

6

కారణాలు కూడా దాటాలి,
ఈ బస్సు చెట్లనీ, కొండల్నీ దాటుతూ
కనబడని మలుపులోకి పదేపదే మాయమైనట్లు
కనబడని ఆనందంలోకి తిరిగిరాకుండా తప్పిపోవాలి

(అరుణాచలం దారిలో..)

11.8.2023 7.13 ఉదయం
వివిధ, ఆంధ్రజ్యోతి 12.2.2024,
కవిత్వం 2024

# కాస్త ఆశలోకి..

1
జీవితంపై కాస్త ఆశ ఉండాలి
నీరెండ గుమ్మంలో వాలటం సంతోషాన్నివ్వాలి
పూలు ఆకాశంవైపు ఆశ్చర్యంగా విప్పారటం
పండుటాకులు గాలిలోకి రాలటం చాలనిపించాలి

2
సాలెగూటిలో ఇరుక్కున్నట్లు ఉంటుంది జీవితం
ప్రాతఃకాలపు పొగమంచును చూసావా
సాలెగూటిపై పొందికగా ముత్యాలు పేర్చుతుంది
అవి ఎండలోకి రంగులు చల్లుతూ మాయమవుతాయి
ఊరికే మంచుబిందువులా నిలిచి, మాయం కావాలి

3
పసిపాపకి 'స్వచ్ఛంగా నవ్వుతున్నాన'ని తెలీదు,
'సంతోషంగా ఉన్నా'నని కూడా
తెలియకపోవటంలోని హాయిని తేలికగా అనుభవిస్తుంది
తెలియటం కదా ఇంత దుఃఖానికి మొదలు

4
ఇంత ప్రపంచం వెనుక నీకొక హామీ ఉంది
చెట్ల ఆకుల వెనుక ఆకాశం ఉన్నట్లు,
ఆకాశం వెనుక తెలియరాని ఖాళీ ఉన్నట్లు
ఇన్ని అనుభవాల వెనుక జీవితం ఉంది
ఇంత జీవితం వెనుక అనంతం వుంది

5

మనమా బ్రతికేది, వెళ్ళిపోయేది
జీవితం తనని చూసుకుంటుంది నీలోంచి, నాలోంచి
నమ్మకం లేకపోతే నీలాకాశం కిందికి వెళ్ళి చూడు
విప్పారిన నేత్రంతో ఎవరో నిన్నే చూస్తున్నట్లు లేదూ

6.2.2024 5.00 ఉదయం
వీధి అరుగు, ఫిబ్రవరి 2024

# మోహం

జీవితమ్మీద ఇంత మోహమేమిటి అంటారు
ఏ రోజైనా వెళ్ళిపోయే విరక్తి ఉంది గనక అంటావు

ఆ దీపం వెలుతురు, బాటపై మనుషులు,
ఇళ్ళపై వెలుగునీడల దోబూచులాట
ఉండి ఉండి తగిలే గాలితెరలు
కురవలేక బేలగా నిలబడిన మబ్బులు
మానుష ప్రపంచపు వింత శబ్దాలు
చనిపోతే ఇక దొరకవు కదా అని కూడా

జీవించటం ఇంత అపురూపమైన సంగతా అంటారు

చనిపోతే అంతా చెరిగిపోతుంది,
ఇదంతా ఉంటుందో, లేదో తెలియకుండాపోతుంది
వెళ్ళిపోగల ప్రతి సంగతీ అపురూపమే అంటావు
ఉండటం మీద ఇష్టంతో కదా
ఇదంతా ఇక్కడుంది అని కూడా

ఇవాళ తెల్లవారింది
వెలుతురులో ప్రపంచం ఉత్సవం జరుపుకుంది

సౌఖ్యం, దుఃఖం, కలయిక, వియోగం
ప్రతిదీ ఒక ఉత్సవం, ఒక ప్రార్థన, ఒక దీవెన
గాఢనిద్రలో మెరిసే ఖాళీలో
మిగిలేదేమీ లేదు కదా అంటావు

నువు ప్రేమించేది దేనినీ చెప్పమంటారు

దేనిని ప్రేమిస్తున్నానో నాకూ తెలియదు
బహుశా, ఈ వెలుగునీడల కదలికల్లో
నన్ను నేనే పొందుతున్నాను, దాచుకొంటున్నాను
జీవితం ప్రియురాలి రూపంలో
నన్నే చూసుకుని ఆశ్చర్యపోతూ, ప్రేమిస్తున్నాను

ఇంతలో, తలుపు తెరిచిన చప్పుడయింది
తలుపు, తెరవటం, చప్పుడు, వినబడడం
మన అర్థాలకి అందని ఈ అనుభవసమూహం
మనని దేనికి తట్టి లేపాలని చూస్తుంది

16.7.2024 11.35 రాత్రి
వివిధ, ఆంధ్రజ్యోతి 19.8.2024

# నగ్నంగా

‘విలువలనీ, భయాలనీ విప్పుకొని
ఒక్కసారైనా నగ్నంగా దూకగలవా
ఇదే జీవితం అని గట్టిగా అనిపిస్తున్న
ప్రేమలోకో, అందంలోకో, అనుకంపనలోకో’
అడుగుతారు నీలోపలి నుండి

అవునంటావో, జాగ్రత్త పడతావో
అక్కడ వుంటావు ఇవాల్టి నువ్వు

వేల బంగారు ఉదయాలు
శిరసు మీదుగా ప్రవహించిపోయాయి,
వెన్నెలరాత్రులూ, మేఘబాలల ఆటలూ కూడా,
పూలు పూచాయి అనేకమార్లు,
పసిపిల్లలు నవ్వారు నీ కళ్ళలోకి

‘ఎప్పుడైనా బ్రతికావా కాసిని క్షణాలు,
జీవితంపై నిందలు మోపే ముందు’
అంటారు ఆ లోపలి మనిషి

‘జీవించటం ఎప్పటికీ సమస్య కాదు,
ప్రాణం నిలుపుకోవటం కావచ్చు గానీ
కొన్నిసార్లైనా  నిజంగా జీవిస్తే ప్రాణం పై ఆశ ఉండదు,
జీవించలేదా బ్రతికిన అందం లేదు’ అని నిట్టూరుస్తారు

నీ ద్వారా తనని తాను కావలించుకోవటం మినహా
జీవితానికి మరే గమ్యమూ, అర్థమూ లేదంటే
నమ్మగలవా, కనీసం వినగలవా

ఈ మాటలు అవతల పెట్టు
కంటి ముందున్న దృశ్యం లోపల ఏముందో పరిశీలించు,
వినిపించే శబ్దాల లోపలి ఏకాంతాన్ని గమనించు,
ఒక్క క్షణం నిన్ను విడిచి జీవితం నదిలోకి ప్రవేశించు

ఇంకా మనం ఉన్నామా..

19.3.2024 11.20 రాత్రి
బ్లాగ్ 21.10.2024

# చిన్న మెలకువ

పూలమీద గాలికి ఊగే రంగులు కదిలిస్తాయి
ఇంత ఆకాశంలో తేలే రంగులు కదిలించలేనపుడు,
ఇంత జీవితంలో మునిగే అనుభవాలు తాకలేనపుడు

పూలలోంచి కదిలింది ఆకాశమేనని,
రంగుల్లో ఊగింది జీవితమేనని
నీకపుడు తోచకపోవచ్చును

ఇదంతా ఒకటేనని, కదలాడే నీటిబుడగపై
తిరుగాడే బొమ్మలాంటిది ప్రపంచమని
గుర్తించలేకపోవచ్చును

గాలికి ఊగే రంగులు
నీ చేతన తలుపులు తట్టినపుడు
నీదైన ఏకాంతంలోకి మెలకువ వస్తుంది

ఇదంతా ఒకటో, కాదో చెప్పాలనిపించని
అనాసక్తతలోకి శాంతిస్తావు

5.1.2025 9.50 రాత్రి
బ్లాగ్ 6.9.2025

# కలలు కంటావు

కొన్ని కలలు కంటావు

ఉదయాన పూలపై వాలిన నీరెండవి అయినట్లు,
వానగాలిలో ఎంతకీ చలించని ఇంద్రధనువైనట్లు,
పక్షి ఎగిరిపోయినా ప్రతిధ్వనిస్తున్న కూతవైనట్లు,
సీతాకోకరంగులు సృష్టించే కొత్త శూన్యానివైనట్లు

ఊరికే కలలు గంటావు, అందుకోసమే పుట్టినట్లు,
అంతకన్నా అందమైన పనేమీ లేనట్లు,
చేయాల్సిందేమీ తోచనట్లు

కలల నుండి కలలకి, కలల్లోని కలల్లోకి,
కలల కెరటాల తాకిడి మెత్తగా తాకే మృదువైన తీరాల నుండి
విశాల మైదానాల్లోకి, మైదానాలపై ఆకాశాల్లోకి,
ఆకాశాలని దాచుకున్న అనంతశూన్యంలోకి,
అటునుండి కలల్లేని చోటికి మేలుకుంటావు

కలలు కనలేని కఠినమైన లోకం నుండి,
కలల అవసరంలేని లోకానికి వెళ్ళే దారిలో,
కలలే నీ బాల్యస్నేహితులు
కలలే నీ ప్రాణవాయువు
కలలే నీ జీవనసారం

2.4.2025 11.15 రాత్రి
బ్లాగ్ 10.10.2025

# కల

ఒక ఉదయం లేచేసరికి
పూవుగా మారిపోయి వుంటావు,
నీ రెక్కలపై మంచుబిందువులు
రంగులకలలు కంటూ వుంటాయి

మంచుబిందువులకి
ప్రాణం ఉంటుందని తెలిసి ఆశ్చర్యపోతావు,
వాటి కలలకి ప్రాణం ఉంటుందా అని
కనుగొనబోతూ వుండగానే
అవి పలుచని గాలిలోకి మాయమౌతాయి

పలుచని గాలితెరలు
సుతారంగా చిరునవ్వు నవ్వటం వినిపిస్తుంది,
నిజంగా విన్నానా అని చూడబోతే
తలలు తిప్పి ఏమీ జరగనట్లు సాగిపోతాయి

సూర్యకాంతి నీ ఆశ్చర్యంతో
కనులు కలిపి చూస్తుంది
కేరింతలు కొడుతూ తలవూపుతావా,
పక్షి రెక్కల చప్పుడు కాంతిని ఎగరేసుకుపోతుంది

మనకి ఎగిరే వీలుందా అని
ఇటు తిరిగి తల్లిని అడుగుతావు
మనకా అవసరం లేదంటుంది
భూసారంలోకి తనని అల్లుకున్న మొక్క

అతనికేం అవసరమై ఇటు వస్తున్నాడు
అంటూ వుండగానే,
అతని చేయి నిన్ను సమీపిస్తుంది
కలలోంచి ఉలికిపడి లేస్తావు

10.12.2024 10.00 రాత్రి
బ్లాగ్ 28.9.2025

# వేసవి మధ్యాహ్నం

ఎండ కాస్తున్నపుడు నీకొక కల మొదలైనట్లుంటుంది
లేదా, కలలో ఎండ కాస్తున్నట్లుంది

జీవితం నిన్ను గట్టిగా పిలుస్తుంది అపుడు
సీతాకోకరెక్కల్లో ఒదిగిన సంగీతంలానో,
ఇంద్రధనువులో ఒదిగిన సంధ్యాకాశంలానో,
కొలనుచంద్రునిలో ఒదిగిన శాంతిలానో కాక

అమ్మ నిన్ను ఒక్కసారి అరిచినట్లు,
మాష్టారు గట్టిగా పాఠం చెప్పినట్లు,
మిత్రుడు నీపై భళ్ళున నవ్వినట్లు
ఎండ ఒకసారి విరబూస్తుంది
ఏ పదకొండు దాటిన వేసవిరోజునో

ఉన్నట్లుండి మేలుకుంటావు
ఎండలో చిక్కబడుతున్న నీడల్లా
నీలో చిక్కబడుతున్న సందేహంలోకి,
ఇదంతా నిజమా,
అసలంటూ నిజమొకటుందా,
నిజమైనా నిజంగా ఉందా అంటూ

భళ్ళున పగిలిన అద్దంలాంటి ఎండ
మెరుస్తుంది, లోకాన్ని గుచ్చుతుంది,
మెత్తగా పాములా పడగ విప్పిన సందేహం
మెరుస్తున్న కళ్ళతో నీ కళ్ళలోకి చూస్తుంది

వేసవి పదకొండు మధ్యాహ్నం
ఇది కలా, నిజమా అని నిన్ను అడుగుతుంది

10.4.2025 10.26 రాత్రి
బ్లాగ్ 19.10.2025

# లొంగిపోవటం

ఒక అందమైన ఉద్వేగం, శబ్దం, దృశ్యం,
నిన్ను పూర్తిగా మార్చుతుంది,
నీలో మాయమవుతున్న దేనికో రూపుదిద్దుతుంది

పసిపాదాలతో మళ్ళీ
నడక మొదలు పెట్టాలని చూస్తావు
ఇంత భయావహ ప్రపంచంలో,
ఇదంతా అసంగతమని తెలుస్తుంది
ఇంతకన్నా దారి లేదని కూడా

రాలుతున్న పచ్చదనం,
వెలిసిపోయే పసుపురంగు శబ్దం,
జారగిలబడే ముదురెరుపు ప్రేమలు
ఏవీ నీతో చివరి వరకూ నడవవని తెలుసు,
వాటి చివరలకి నువు నిలబడవని కూడా

విసుగుపుట్టే రోజున
తెలివిలేని సినిమాకి వెళ్ళినట్టు
తీరికగా చేరతావు ఈ లోకంలోకి,
ఇది బాలేదు, అయినా వెళ్ళలేవు,
అట్లాగని ఉండాలన్న ఉబలాటం లేదు

తెలియనిదేదో ఉంది చూసావా
అక్కడ ఉన్నట్లుంది బ్రతుకు రహస్యం,
అది రమ్మని పిలుస్తుంది, కావాలని వినవు

నీకే ఇంత తెలివి వుంటే
లోకాన్ని కన్న తెలివికి ఎంత ఉండాలి

బోనులోని సింహం ఆకలితో లొంగినట్టు,
జీవితానికి లొంగిచూడు
తరువాతి పనులకి యజమానివి కావు గనక
చెప్పవలసిందేమీ లేదు

26.1.2025 00.25 రాత్రి
ఉదయిని 15.3.2025

# పుట్టినరోజున

ఇవాళ నీకు నువ్వే గుర్తుకువస్తుంటావు
ఉదయం పూలూ, చినుకులూ రాలినట్లు
ఒకనాడు ఇక్కడికి రాలావు
వాటికి కరిగి, మాయమైపోవటం తెలుసు
మరి నీ సంగతి అంటారెవరో

తొలిసారి చుట్టూ చూసి వుంటావు
కొంత ఆశ్చర్యంగా, కొంత భయంగా
వాటి నుండి బయటికి రాలేదు ఇప్పటికీ
బయటపడటం చాతకాలేదా, ఇష్టం లేదా
అని నవ్వుతారు నీలోంచి

ఋతువుల చివర మిగిలేవి
వెలితీ, దిగులూ అని తెలిసివచ్చినా
బతుకు మీద తీపి ఎందుకో అర్థం కాదు
ఆడుకుందాం రారమ్మని సూర్యకాంతి పిలుస్తుందా
నిన్నటి గాయాలు మరిచి ఎగురుతూ వెళతావు

కనులు తెరిచింది మొదలు
నిన్ను కనుగొనే మనిషి కోసం వెదికావు
కాలమింత గడిచినా ఇంకా తెలియరాలేదు
నువు మాత్రమే నిన్ను కనుగొనగలవని
మృదువుగా దగ్గరకు తీసుకోగలవని

బ్రతుకు ఒక నైరూప్య చిత్రం
అర్థాల ఇరుకు నుండి ఎంత విముక్తమైతే
అంత సారవంతం అవుతుంది
ఎంత స్వేచ్ఛలోకి మేలుకొంటే
అంత ఆర్ద్రతలోకి వికసిస్తుంది

ఆ చినుకుల్ని అలా రాలనీ, చూడకు వాటివంక
పూలని పాడుకోనీ రంగుల పాటలు, వినకు వాటిని
వాటి స్వేచ్ఛకి వాటిని వదిలి, నీ స్వేచ్ఛలో ఉండిపో
ఇపుడు చూడు, జీవితం తల్లి గర్భాలయం, కదూ..

21.11.2023 10.00 ఉదయం
సారంగ 15.11.2024

# గాలితెరల్లోంచి

గడ్డిపరక గడ్డిపరకలానే నటిస్తుంది చూడు,
నక్షత్రం నక్షత్రంలా నటించినట్లు
నువు నీలా నటించడానికి ఏం నొప్పి

ఇదంతా నువు అనుకునేంత అందమైంది కాదు
అనుకునేంత భయావహం కానట్లే
ఊరికే ఉండు, కాలువలో నిశ్శబ్దంగా పారే నీటిలా

బ్రతకాలని చూడకు, వెళ్ళాలని కూడా
ఉండటమే చాలు, అంతకన్నా నీ నుండి
ఈ గాలి కోరేదేమీ లేదనుకుంటాను

మనుషుల్నీ, వాళ్ళ భయాల్నీ , ధైర్యాల్నీ
ప్రేమించు తేలికగా, లేదా పట్టించుకోకు,
చిన్నపుడు ఆడి వదిలేసిన బొమ్మలకి
ఏమంత విలువ నివ్వకు

ఈ రాత్రి చూడు, ఎంత నల్లగా ఉందో
పగటి తెల్లగా కంటే చిక్కగా, చల్లగా
దీని గర్భం లోనైనా
నువ్వు నువ్వుగా దొరుకుతావా, చూడు

ప్రేమించడానికి వచ్చావు, మరే పనీ పెట్టుకోకు
ఆనందంగానో, గాయపడో చాతనైనట్టు పాడి, వెళ్ళు
పిట్టల్ని చూడు, వాటి కన్నా జ్ఞానివి కాలేవు

ఇదంతా ప్రేమాస్పదం, ఇదంతా నువ్వే గనక,
ఇదీ, నువ్వూ కల గనక,
వెళ్ళేవాటిని ప్రేమించాలి గనక
ఇక వెళ్ళనా, మరి..

21.7.2023 11.18 రాత్రి
వివిధ, ఆంధ్రజ్యోతి 14.8.2023

# అంతేనా!

జీవితం అల్లరిపిల్లాడి వంటిది
ఆనందించలేం, ప్రేమించకుండానూ ఉండలేం,
ఎంతకీ పగలని కొబ్బరికాయలా
దీని రహస్యాలు అర్థంకావు

ఆకాశం శాంతినిస్తుంది, నేల దుఃఖపెడుతుంది
అయినా నేలని అంటిపెట్టుకుని వుంటాం

తేలిపోయే మేఘాల్లాంటి, ఇంద్రధనువుల్లాంటి
కలలు చాలా కంటాం కానీ,
నిజం కావటం ఇష్టం ఉండదు,
నేలమీద నమ్మకం పోదు,
ఆకాశంపై నమ్మకం కలగదు,
లేకుంటే ఎప్పుడో పక్షిలా ఎగిరేవాళ్ళం

నేల దుఃఖదాయిని
అయినా నేల మేల్కొలిపే కరుణ ఇష్టం,
ఆకాశం సుఖ ప్రదాయిని
అయినా స్వేచ్ఛలోని ఒంటరితనం అయిష్టం

ఇలా కవ్విస్తుంది జీవితం
నిన్ను ఇష్టపడీ, పడనట్టు నటించే ప్రియమైన వ్యక్తిలా,
దీని మాయలో చిక్కుకుంటావు ఇష్టంగానే
సాలెగూటిలో చిక్కిన జీవిలా

జీవితం మోహపడి, దుఃఖపడాల్సిన వస్తువు కాదు,
అట్లా అని తప్పుకోతగింది కూడా కాదు,
ఖాళీ ఉనికిలో ఈ నాటకం కొంత సరదా

అంతేనా!

8.1.2025 11.52 రాత్రి
బ్లాగ్ 10.9.2025

# ఆవలితీరం నుండి..

సుఖంలానో, బాధలానో, భయంలానో
పురివిప్పినట్టు తెరుచుకునే రోజుల్ని
ఒక్కొక్కటిగా గడుపుతావు అనేకసార్లు,
పగటి దీపకాంతిలాంటి నువ్వు
చీకటి పడేకొద్దీ ప్రకాశిస్తావు నీ లోపలికి

జీవించటం అసౌకర్యమైన అనుభవం,
పీడకలలవేళ దేహం కూడా కదిలినట్లు
జీవితం నుండి మరణంలోకి
నిన్ను నువ్వు బ్రతిమాలుకుంటావు,
ఉనికి నుండి మాయంలోకి కలలు కంటావు

చాలా ఆశ్చర్యం ఇదంతా,
భయపడుతూ ఉల్లాసపడటం, కేరింతలు కొట్టడం,
భయంలోనే పిట్టలు పాడటం, లేళ్ళు గెంతటం,
పిల్లలు నవ్వటం, యవ్వనం ప్రేమించుకోవటం,
భయంలోనే సెలయేళ్ళు ప్రవహించటం,
సూర్యుడు కాంతిని విరజిమ్మటం

బహుశా, నల్లని చీకట్లోనో, గాఢనిద్రలోనో
భయావహ జీవితం రెక్కలు వాల్చి నిలుస్తుంది,
మరణం తర్వాత కడపటి స్వేచ్ఛ దొరుకుతుంది
ఇదంతా కానిది ఏమైనా ఉంటే దానికి

ఇది ఇవతలి తీరపు మర్మరధ్వని,
ఒకటే ఊరట ఏమంటే
ఆవలితీరం నుండి చూసినప్పుడు ఇదేమీ లేదు

4.10.2024 12.24 మధ్యాహ్నం
బ్లాగ్ 18.8.2025

# తయారుగా..

ఒకటే రోజులోకి కనులు తెరిచినా, మూసినా
మన పగళ్ళూ, రాత్రులూ ఒకటి కాదు
పగటి రంగులూ, చీకటి లోతులూ వేరువేరు

ఒక జీవితాన్ని జీవిస్తూ వెళతాం
మజిలీ వచ్చినవారు దిగిపోతారు
జీవితం కొనసాగుతుంది

నువు దిగిపోయే వ్యక్తివి కావు
కొనసాగే జీవితానివి అంటారు
సరిహద్దులు దాటిన కొందరు

నీకు ఈ లోకం వేరే,
ఇక్కడి బాధా, భయమూ, ఆకర్షణా వేరే
నీతో పుట్టి, నిశ్శబ్దంలో కలిసే నీదైన రాగానివి

చాలా ఏడుస్తావు, భయపడతావు చాలా,
దిగులులోకి ముడుచుకుంటావు పలుమార్లు
కానీ, కాలం పన్నిన వల ఉంది చూడు
నిన్ను బయట పడనీయదు, ఎగరనివ్వదు

జీవితం ఊపిరాడని అనుభవమని తోస్తుంది
లోకం ఎరవేసే సౌఖ్యాలన్నీ
పిల్లల ఆటల కన్నా తేలిక అనిపించినపుడు

బహుశా, అపుడు
పగలూ, రాత్రీ నీపై నుండి చెరిగిపోతాయి
నీటిపైన రాసింది చెరిగినట్లు,
మెలకువలో కల మునిగిపోయినట్లు

ఓర్చుకో అనటం మినహా
వారైనా చెప్పగలిగింది ఏముంది
నీ ప్రియుని రహస్య భాషణ
నువు మాత్రమే వినవలసి ఉంది

తయారుగా ఉన్నావా, లేదా
తనతో ఏకాంత సమాగమానికి

8.10.2024 11.40 రాత్రి
ఈమాట.కాం మే 2025

# ఆకాశం వైపు

చీకాకుల మునుగీతలోంచి
అప్రయత్నంగా తలయెత్తి
సాయంకాలపు ఆకాశాన్ని చూసావు

అమ్మమ్మ ఒడిలోంచి
ఆశ్చర్యంగా కన్నార్పక చూసిన ఆకాశాన్ని,
ఆరుబయట చాపలపై కథలు చెప్పుకుంటూ
కనులు మూసే ముందు తలనిమిరిన ఆకాశాన్ని,
ఆటల్లో కింద పడినపుడు
హఠాత్తుగా విశాలమైన ఆకాశాన్ని

ఆమె మౌనానికి అర్థం తెలియక
దిగులుగా కనులప్పగించినపుడు
కరుణతో కౌగలించుకున్న ఆకాశాన్ని,
మిత్రుడి సాయంతో జీవితం లోతులు
పట్టుకోవాలని చూసే మాటల మధ్య
మౌనంగా దర్శనమిచ్చిన ఆకాశాన్ని

చీకాకులెటూ పోవు, బలహీనతల్ని గిల్లుతూ వుంటాయి,
లేదా, బేలగా నీ వంక చూస్తుంటాయి,
భయాలు ఊది మంట రాజేస్తూవుంటాయి,
తప్పించుకునే దారికోసం వెదకమంటాయి

కానీ, ఆకాశం నిన్నేమీ చేయమనదు

ఊరికే నిన్ను చూస్తుంది,
నీ చూపుకోసమే చూస్తున్నట్లు, పిలుస్తున్నట్లు,
పోనీ, నేను రానా అని అడుగుతున్నట్లు,
ఎందుకా చీకాకులన్నీ ఇంటికి వచ్చేయి అన్నట్లు
దయగా, తల్లిలా చూస్తుంది

ఇప్పుడిక చీకాకులన్నీ
దొరికిన నీడల్లో కల్లా కాసేపు మాయమయాక,
నీ ముందు రెండు ప్రశ్నలు నిలుస్తాయి
పట్టుకొంటూ, పట్టుబడటమా,
విదిలించుకొని, ఎగిరిపోవటమా

మొదటిదే గెలుస్తుందని
రాసే నీకూ, చదివే మిత్రులకీ చెప్పనక్కరలేదు,
లేదంటే, నువు ఎందుకు రాసేవాడివి,
వారెందుకు చదివేవారు,
ఏనాడో మేఘాలపైకి ఎగిరిపోయేవారు

15.12.2024 10.23 రాత్రి
బ్లాగ్ 28.8.2025

# పొడి సాయంత్రం

సాయంత్రపు రంగులకాంతి
విరజిమ్ముతుంది సమానంగా
ఎడారిలోనూ, అడవిలోనూ,
నది మీదా, సమూహాల మీదా

ఎడారి రంగులకాంతిని పిలుస్తుంది,
అడవి తనలోకి ఒంపుకొంటుంది,
అలలనది ఆటలాడుతుంది తనతో,
సమూహం తనని అంటకుండా
ధూళి నిండిన పనుల్లో మునుగుతుంది

ఇంత అందమైన కాంతిని,
కాంతిని ఒంపే విశాలమైన గగనాన్ని కాదని
వీళ్ళేం చేస్తున్నారని విస్మయపడుతుంది సాయంత్రం

ప్రతి సాయంత్రం జీవితమొక ప్రేమలేఖ పంపిస్తుంది
అవని సమస్తానికీ, జీవితమెంత అందమైనదో చూడమని,
జనులు మాత్రం, సాయంత్రాలని గడియారాల్లో గుర్తుపడతారు

చూస్తూ ఉండగా చీకటి పడుతుంది
ఆకాశంలో కొంత వెన్నెల ప్రసరిస్తుంది,
చీకటిలో మునిగినవారిలోకి వెన్నెల ఏ మాత్రమూ ఇంకకపోగా
చివరి చీకటి మరికాస్త వేగంగా సమీపిస్తుంది

8.4.2025 00.12 రాత్రి
బ్లాగ్ 16.10.2025

# చీకటి

చీకటి కమ్ముతుంది, నక్షత్రాల కంబళి విప్పుకొని,
విశాల గగనం నుండి వీధుల్లోకి దిగుతుంది,
వీధుల్లోంచి గదుల్లోకి చొరబడుతుంది

చీకటిని ప్రేమగా పలకరిస్తాయి వీధుల్లో, గదుల్లో వెలిగే దీపాలు,
దీపాలలో వెలిగే హృదయాలు, హృదయాల్లో వెలిగే జీవనానందాలు

ఇక, చీకటి వరద పోటెత్తిన నదిలా కమ్ముతుంది నిన్నూ, నన్నూ,
మనం మిగుల్చుకున్న నేనునూ, నాదినీ

నల్లని చీకటి, దేహాన్ని అంటీ అంటని చీకటి,
చూపుల్ని కప్పీ, కప్పని చీకటి,
నీకు శాంతిని ఇచ్చీ, ఇవ్వని చీకటి,
నిండైన ఏకాంతాన్ని కానుక చేసే చీకటి

అప్పుడంటావు దేవుడితో
"దుఃఖ భూయిష్టమైన పగళ్ళు ఎందుకు తండ్రీ,
జీవితమంతా చీకటితో నింపు"
ఆయన నవ్వుతూ అంటారు
"నువు చూసే పగలు కూడా చీకటిలోనిదే,
కన్నా, ఈ చీకటి అంతకీ వెలుగు నువ్వు"

19.6.2025 10.45 రాత్రి
సంచిక.కాం 12.10.2025

# మరొక రాత్రి

మరొకసారి చీకటి పడుతుంది
నగరం నల్లటి కొలనులో
వేల దీపాలు కలువల్లా వెలుగుతాయి

నిద్రకింకా తలవంచని జీవితాలు
ఉద్వేగాల తెరచాపలెత్తి
చీకటి నదిలో ఈదుతుంటాయి

రాత్రి కోసం పగలు ఎదురుచూసినట్టు,
హృదయాలు విప్పటం కోసం
మనుషులు ఎదురుచూస్తుంటారు

ఎప్పటికీ తెల్లవారని రాత్రి లాంటి
ఎప్పటికీ కోల్పోని హృదయం కోసం
హృదయాలు వెదుకుతుంటాయి
చీకటిలో, చీకటి నీడల్లో,
నీడలపై వాలిన మసక కాంతుల్లో

పగటి ముసుగులు తొలగించుకొని
తమని తాము మృదువుగా తాకే రాత్రి కోసం,
తమని తాము పసిపిల్లల్లా
నగ్నంగా చూసుకొనే రాత్రి కోసం,
తమలోకి తాము మునిగి శాంతి పొందే నిద్ర కోసం

దీపాల కలువలతో వెలిగే రాత్రి వైపుగా
పగలంతా మనుషులు కష్టపడతారు

అప్పుడు మరొకసారి రాత్రి ప్రత్యక్షమవుతుంది
ఎడారి నడుమ విరబూసిన ఒయాసిస్సులా,
దుఃఖపు నిదురలో ప్రవేశించే స్వప్నదేవతలా,
పొడిబారే హృదయంలో పుష్పించే అశృబిందువులా

మరొకరాత్రి నిన్ను దీవించటానికి
చల్లగా, మృదువుగా నీవైపు చూపులు వాల్చి
మెత్తని పాదాలతో మెల్లగా కదులుతుంది

3.7.2025 11.13 రాత్రి

# వాన కురిసే రాత్రి

వాన కురిసే రాత్రి నువు ఒంటరివవుతావు,
సమీపంలో ఎవరున్నా, లేకున్నా
నీకు వానా, వానకి నువ్వూ మిగులుతారు

చీకటి కురిసే రాత్రులు కూడా ఒంటరివే గానీ,
చీకటిలో వాన కురిసిందా
కలతల్లేని, కలల అవసరంలేని
గాఢనిద్రలోకి జారుకుంటావు

వాన కురిసే వేళ
నీకు నువ్వు నిజంగా దక్కుతావు
నిన్నెటూ కదలనీయని వానలో,
నీ ఊహల్లోకి చొరబడే వానలో
నీకు అక్కర్లేని నువ్వు చెరిగిపోయి,
నీకు నువు కొత్తగా పరిచయమౌతావు

వాన కురవటమంటే జీవితం కురవటం గనక
వాన కురిసేవేళ నిన్ను నువు ప్రేమిస్తావు,
నీ జీవితాన్ని మోహిస్తావు,
ఎడతెగని వాన నిన్ను కాగితం పడవ చేసి
ఎటైనా తీసుకుపోతే బాగుండునని ఎదురుచూస్తావు

వాన కురిసే వేళ, భయపడుతూనైనా,
నోవా పడవకి దొరకకుండా
అవధుల్లేని జలధిలో కొట్టుకుపోవాలని కలలుగంటావు

వాన కురిసే వేళ
వాన ఒక్కటే, వానలాంటి కరుణ ఒక్కటే
సృష్టిలో మిగలాలని దేవతల్ని బ్రతిమాలుకుంటావు

23.3.2025 00.59 రాత్రి
బ్లాగ్ 7.10.2025

# వానతెరలు

కొన్ని వానతెరలూ, తడుస్తూనో, చూస్తూనో
కాసేపు పరుగాపి నిలబడిన ప్రపంచం,
వానలో నాని, మసకబారిన పగటి కాంతీ,
సమస్తాన్నీ కూర్చోబెట్టి
ఈ క్షణంలో జీవించటమెంత బావుంటుందో
విసుగులేకుండా బోధిస్తున్న వానచప్పుడు

ఇది కదా జీవితం అనిపిస్తుందపుడు,
వేడి ఆవిరులు తొలగి, చల్లదనం ఇంకుతున్నట్లు
దుఃఖభారం తొలగి, జీవించే ఆశ ఇంకుతూ వుంటుంది

వాన కురిసే క్షణాలు, క్షణాల్లా కురిసే వానచినుకులు
నీ నుండి తప్పిపోయి దిక్కుతోచక తిరుగుతున్న నిన్ను,
చల్లని గాలితెరలతో కప్పి, గుండెలకి హత్తుకొని,
భయపడుతున్నావా అని లాలనగా అడుగుతాయి

వానలేని ప్రపంచాన్ని ఊహించలేవు,
వాన కాలేని మనుషుల్ని ఊహించలేనట్టే

వాన కురిసే సమయంలో, నింగిపొరల్లో దాగిన,
నీ సోదరులుండే సుతిమెత్తని స్వర్గమేదో,
ఇంద్రధనువులోంచి లీలగా కనిపించకపోతుందా అని
బేలగా ఆకాశం వంక చూస్తావు

వాన కురుస్తూ వుంటుంది,
కలల్ని మెత్తబరుస్తూ వుంటుంది,
కలల కాంతిలో మునిగిన నువ్వు
వాన ఆగిందని గుర్తించటం ఇష్టం లేక
నీ కలల్లోకి తిరిగిరాలేనట్టు తప్పిపోతావు

16.3.2025 1.31 మధ్యాహ్నం
కవితా! దీపావళి సంచిక అక్టోబర్ 2025

# వేసవిరాత్రి వాన

వీధిలో నడుస్తూ అమ్మ
భుజంపై నిద్రపోయే నిన్ను పొదివి పట్టుకున్నట్లు
వేసవిరాత్రి ఉన్నట్లుండి వాన కురుస్తుంది

వాన నీటిని మాత్రమే ఒంపదు
నీటితో నిండిన గాలినీ, గాలితో నిండిన శబ్దాలనీ,
వాటి వెనక దాగిన ఆకాశాన్నీ, నిశ్శబ్దాన్ని కూడా

వాన కురిసినపుడు కరుణ కురిసినట్లుంటుంది
జీవితమ్మీద లాలస కురిసినట్లు,
జీవితేచ్ఛ విత్తనమ్మీద అగాథ నిశ్శబ్దమేదో కురిసినట్లు

వాన కురిసిన రాత్రి ఒంటరిగా మిగులుతావు,
చుట్టూ ఖాళీ స్థలం ఒంటరిగా మిగులుతుంది,
ఖాళీలో కలలు ఒంటరిగా మిగులుతాయి
వాన అంటుంది, ఈ క్షణం బ్రతుకు, ఇంతకన్నా ఏమీలేదు

వాన రాలే వేళల నీకేమీ పని వుండదు వానని ప్రేమించటం మినహా,
వానలో ఎంతకీ తడవని చీకటినీ,
చీకటిలో ఎంతకీ మునగని జీవితాన్నీ మోహించటం మినహా

లోపలికంటా కురిసే ఒక వాన చాలు
మానవ హృదయాలలోని ఇంత చీకటి చెరిపేయడానికి

10.4.2025 11.55 రాత్రి,
బ్లాగ్ 21.10.2025

# వానరాత్రి

ఈ వానరాత్రి రోడ్లపై ఎవరూ లేరు త్రాగినవారు మినహా,
వాళ్ళు తిరుగుబాటుదారులు కాదు
కనీసం, అయోమయంలో ఉన్నారు, ఏమిటీ ప్రపంచమని

వానచప్పుడు ఒడిలో వాలి, మనుషులు సుఖంగా నిద్రిస్తున్నారు,
తమవారనుకొంటున్నవారి మధ్య భద్రంగా,
ఎప్పటికీ ఇలానే ఉంటామని కలలు కంటూ

వానలో తడుస్తూ ప్రపంచం వెలుగుతుంది
మరింత దయతో, జీవన లాలసతో
మరింత దుఃఖంతో, రేపటి మీద ఆశతో
రోడ్లపై దీపాలు వెలుగుతున్నాయి, చినుకుల్లో తడుస్తూ, మెరుస్తూ

మిత్రుడు వెళ్ళవలసిన రైలు లేటుగా, టైముకే వచ్చి నిలబడింది,
కావలించుకొన్న మిత్రుడు
రాత్రిలో, వానలో, రైలులో కరిగిపోయాడు

ఈ వానరాత్రి ఒక్కడివీ నిలబడిపోయావు
దీనినంతా ప్రేమిస్తూ, దగ్గరకు తీసుకొంటూ
ఎవరూ లేరు ఇక్కడ; ఉన్నా, లేనట్లు ఉన్నారు
వానలో వీధిదీపంలా
వెలుగుతూ, ఆరుతూ నువ్వూ, ప్రపంచం

26.7.2024 11.27 రాత్రి
బ్లాగ్ 23.10.2024

# ఉండు

అర్థరాత్రి ఈ వానలాంటి
దయ నీ మీద కురుస్తున్నపుడు,
ఉదయాన మెలకువకి ముందుగానే
బంగారువాన కురిసేటపుడు
బ్రతికి ఉండటానికి లోటేమి

అనాది భయాల కౌగిలిలో
ఆదమరిచి నిద్రించే సాటివారిని చూసి
దుఃఖిత హృదయంతో నిలువునా నీరైనా గానీ
ఇక్కడ ప్రేమకి లోటేమిటి, అమాయకతకి లోటేమిటి

ఈ లోకపు చిటికెనవ్రేలు పట్టుకుని
ఇక్కడ ఉండటానికి భయమేమిటి, బాధేమిటి

మరొక పగటికాంతి ఆడే
పసిపిల్లల ఆట గమనించు,
మరొక రాత్రి పాడే ఏకాంత సంగీతం విను,
వినటానికి ఉండు, వినటంగా ఉండు
ఉండు మరి కాసేపు ఊరకనే..

17.7.2025 00.45 రాత్రి

# ఇవాళ్టి పని

ఇవాళ చాలా పని ఉంది

శరీరంలోకి ప్రవేశిస్తున్న
ఆకాశాన్ని ప్రశాంతంగా అనుభూతించాలి,
గాలినీ, వేడిమినీ, జలాలనీ, ధరణినీ
కోమలంగా, మెల్లగా అనుమతించాలి,
పసిపిల్లల్లా పలకరించాలి,
వాటి చూపుల్లోకి ఆశ్చర్యంతో బదులివ్వాలి

చాలా సున్నితమైన పని ఉంది మరి
. . .
రాత్రికి కూడా వీలు కాకపోవచ్చును

శరీరంలో ప్రవేశించిన
ఆకాశాన్నీ, పిల్లల్నీ నిద్రబుచ్చాలి
అవి కలల్లోకీ, సుషుప్తిలోకీ మెల్లగా ప్రాకటానికి
చాతనైనంత మెలకువగా సహాయం చేయాలి

31.8.2025 10.04 ఉదయం

# స్వగతం

తలుపు తీయటం, గడియ చప్పుడు చేయటం,
తలుపు మూయటం,
బయటా, లోపలా రాత్రి సమానంగా వ్యాపించటం,
రాత్రి లోపల నిశ్శబ్దం నిండటం,
నిశ్శబ్దం లోపల శబ్దాలు కువకువలాడటం
ప్రతిదీ ఆశ్చర్యం, అద్భుతం

గడియారం క్షణాలు లెక్కించటం,
ఫ్యాను గాలి వృత్తాలని లెక్కచూసుకోవటం,
దీపం విసుగులేక ఒకలానే కాంతి ధారపోయటం
ప్రతిదీ తపస్సు, ఎడతెగని ధ్యానం

మెలకువలో తేలు,
గాఢనిద్రలో మునుగు, కలల్లో ఈదు
ఈ రాత్రి ఇలానే గడుస్తుంది,
చీకటి ద్రవం పూర్తిగా ఒలికిపోయాక
ఖాళీ వెలుతురు ముఖం చూపుతుంది

ఇంతకన్నా ఏం కావాలి బ్రతికి ఉండటానికి,
బాధనీ, భయాన్నీ, బరువైన పిట్టలా ఎగిరే నవ్వునీ
అనుభవించటానికి, అనుభవాలని అనుభవించటానికి

మామూలుగా మొదలవుతావు,
సందడిగా జీవిస్తావు, వినబడకుండా వెళిపోతావు
జీవుల చరిత్ర ఇంతకన్నా ఏమిటి

కానీ, తలుపు తీయటం, వేయటం,
గడియ చప్పుడు చేయటం,
రాత్రిని నీ చుట్టూ బంధించటం,
చీకటిలో మాత్రమే కనిపించే దేనినో వెదకటం,
కాలాలకావల నక్షత్రాలుగా కాంతులీనుతాయి,
తరువాతి తరాల ప్రాణులతో
తెలియనిరాని సంభాషణలు జరుపుతాయి

25.12.2024 00.07 రాత్రి
బ్లాగ్ 3.9.2025

# కానిమ్మని..

మళ్ళీ మేలుకొంటావు,
ఈ కాంతీ, అలల్లా ఎగిసే రంగులూ, నీడలూ,
వాటిలోంచి దాగుడుమూతలాడే
జీవితమూ పలకరిస్తాయి
ఈ రోజైనా ప్రేమించగలవా మమ్మల్ని

ప్రతి మెలకువలోనూ జీవితం ఇదే చేస్తుంది,
ప్రతి నిద్రకి ముందూ ఇదే చెబుతావు
సంతోషం, ఇక చాలు, విడిచిపెట్టు అని

నిజంగా, ఈ లోకం అందమైనది,
దీని కాంతినృత్యం సంభ్రమాశ్చర్యాలనిస్తుంది
కానీ, ఇంత వినోదం, సముద్రపు లోతుల్లోని
గాఢమైన ఏకాంతాన్నీ, నిశ్శబ్దాన్నీ ఇవ్వలేదు

ఇక్కడ తిరిగావు, నవ్వావు,
గుండెలవిసేలా ఏడ్చావు కొన్నిసార్లు,
చాలా భయపడ్డావు అనేకమార్లు
ఇవన్నీ అవసరమా
ఖాళీ ఆకాశంలాంటి స్వేచ్ఛలోకి ఎగిరిపోకని
కలగన్నావు, దిగులు పడ్డావు

అయినా ప్రపంచం పిలుస్తుంది,
అమ్మ పిలిస్తే పరుగున వచ్చినట్టు
తటాలున దీనిలోకి మేలుకొంటావు

పక్షి కూత గాలిలో కలిసిపోతుంది,
వికసించిన పూవు భూమిలో కరిగిపోతుంది,
ఎగసిపడే అల సముద్రంలో మాయమౌతుంది,
ఆట ముగిశాక ఖాళీ తలుపు తట్టితీరుతుంది

సరే, ఇవాల్టికి కానిమ్మని
ప్రపంచంలోకి అడుగుపెడతావు

20.12.2024 11.57 రాత్రి
బ్లాగ్ 31.8.2025

# మెలకువొకటి

సున్నితమైన శబ్దమొకటి
రాయిలా బిగుసుకుపోతున్న నిన్ను
నీటిలా మార్చుతుంది
అమ్మ ఒడిలోని విశ్రాంతిలోకి తీసుకుపోతుంది

పూలపై వాలిన బంగారు కిరణం,
ఎగిరే పక్షి రెక్కల నుండి లీలగా తాకిన గాలి,
ఎవరో ఎవరిపైననో దయగా నవ్వు,
హోరు తరువాత వికసించే నిశ్శబ్దం
నిన్ను చేయి పట్టుకొని నీ దగ్గరికి చేర్చుతాయి

భారమవుతున్న జీవితాన్ని తలుచుకొని
ఏమీ లేదులే అంటావు శాంతంగా,
ఓడిపోయే భయం నుండి
బయటపడతావు తేలికగా కాసేపు

మరి కొంచెం సమయం అక్కడే ఉండమని
పసిపిల్లల్లా అడుగుతాయి ఈ అక్షరాలు
ఇందాక పరిచయమై అంతలో వెళిపోతున్న
మనిషిని చేయి వదలకుండా అడిగినట్టు

ఇదంతా చీకటేనేమో తెలియదు,
చీకటిని వెలిగించే వెలుతురు ఉందేమో కూడా
కానీ, ప్రేమ ఉంది చూసావా

ఆ సున్నితమైన శబ్దం గుర్తుకు తెచ్చినది,
అది ఉంది

అది మాత్రమే ఉందా చూడమంటుంది
మబ్బుల వెనుక మాయమయే ముందు
విశాల గగనంలో
ఒంటరిగా సంచరించే చందమామ

31.12.2024 10.20 రాత్రి
స్నేహ, ప్రజాశక్తి 24.8.2025

# దాగుడుమూతలు

నదులూ, పర్వతాలూ,
ఒళ్ళు విరుచుకునే ఆకాశమూ,
దానిలో ఈదే పగటి కాంతీ,
కాంతిలో ఆడే గాలిపిల్లలూ,
వీటిలో గీతలా సాగిపోతూనో,
చుక్కలా నిలబడి చూస్తూనో నువ్వు

ఇది కదా జీవితం,
ఇది కదా జీవించటమనిపించే క్షణాలు కొన్ని,
ఇంతలోనే ప్రేమికుల కౌగిలిలోకి
పరుగున వచ్చే పరాయి శబ్దంలా
లోపల దొలిచే విసుగుపురుగు

ఇంత అందమైన జీవితం, తేలికైన, హాయైన జీవితం
ఇంతలో బరువుగా, చీకటిగా ఎందుకు మారుతుందో
తెలియని అమాయకముఖంతో నువ్వు

రాత్రులు పొడిలా రాలుతాయి,
పగళ్ళు అద్దాల్లా పగులుతాయి,
రంగులూ, గీతలూ, లోతులూ చెదిరిపోతాయి,
కలుస్తూ, విడిపోతూ దిగ్భ్రమ కలిగిస్తాయి

ఏదీ జీవితం, ఇప్పుడెటు పోయిందని
అల్లాడుతావు ఒడ్డున పడిన చేపపిల్లలా

కలలోని అందమైన మోహాన్ని
మెలకువలో వెదకబోయినట్లు,
ఇంత చిక్కని గీతలవలలోంచి
బయటపడేందుకు తడుముకొంటావు

ఈ చిక్కని చీకటి తరువాత
వెలుతురు రాబోతూ ఉందని నమ్మినట్లు,
ఇంత వెదుకులాట తరువాత
శాంతి తప్పక దొరుకుతుందని నమ్ముతావు

11.2.2025 00.39 రాత్రి
బ్లాగ్ 20.9.2025

# పగలూ, రాత్రులు

పగలెంత ఇష్టమో, రాత్రి అంతిష్టం
పగటి నీడలూ, రాత్రి వెలుతురులూ ఎంత ఇష్టమో
పగటిలో తేలే, రాత్రిలో మునిగే
రేఖలూ, రూపాలూ, రంగులూ అంతిష్టం

ఈ జీవితం, ఈ అనుభవం ఇష్టం,
జీవితానికి భయపడటం, వద్దనుకోవటం ఇష్టం,
విడిచిపెట్టేంత దూరం వెళ్ళి, వెనుదిరిగి,
పరుగున వచ్చి, గాఢంగా కావలించుకోవటం ఇష్టం

జీవితాన్ని హత్తుకొని కన్నీరు ఒంపటం,
చేదుచేదుగా దిగమ్రింగటం,
పక్షి కూతలోకో, సంధ్యవర్ణాల్లోకో, పలకరింపులోకో,
జీవుల కనుపాపల్లోకో నిన్ను కరిగించుకోవటం,
మాయ చేసి అమ్మ అన్నం తినిపించినట్లు,
మాయ చేసి జీవితం నిన్ను లొంగదీసుకోవటం ఇష్టం

సత్యమేదైనా ఉంటే, దానికి
నువు ఉన్నా తగువు లేదు, లేకున్నా తగువు లేదు,
ఉంటే ఉన్నావని తెలీదు, లేకుంటే లేవని తెలీదు,
నువ్వే సత్యమైనా మార్పు లేదు

ఉన్నవి నువ్వూ, అనుభవమూ, జీవితమూ,
ఈ ఆటనెవరు తట్టిలేపారో తెలీదు,
ఎలా ముగుస్తుందో కూడా

కాసేపు జీవితాన్ని ఓర్చుకోవాలి, లేదా ప్రేమించాలి
లేదు, ప్రేమిస్తున్నావు, ఇంతకన్నా ఏం లేదు..

4.3.2025 11.23 రాత్రి

# నీపై రోజులు

కొన్ని రోజులు దయగా ఉంటాయి నీపట్ల,
బంగారుకాంతిలానో, నీటిపొరపై మిలమిలలలానో,
మరికొన్ని అగ్నిలానో, పొగలానో, బూడిదలానో..
ఇదంతా వెలుగు నీడల ఆట

తల్లి చుట్టూ దాగుడుమూతలు ఆడే బిడ్డల్లా
నీ చుట్టూ దాగుడుమూతలు ఆడతాయి
పగళ్ళూ, రాత్రులూ, ఆనందాలూ, దుఃఖాలూ

నువు కదిలిపోయినట్టుంటావు, కదలవు,
ఏడ్చినట్టూ, నవ్వినట్టూ తోస్తుంది
ఏమీ చేయవు, చేయలేవు

ఉత్త ప్రశాంతత నీవైనట్లు,
ఉత్త ఖాళీ నీవైనట్లు,
అర్థంలేనితనం నీవైనట్లు

వెర్రివాడిపై కురిసే ఎండలా, నీడలా,
వానలా, వెన్నెలలా, మంచుతెరల్లా
జీవితం నీపై కురుస్తూ వుంటుంది

రోజుల పెట్టెల్లో దాచిన అనుభవాలు ఒంపుతుంది,
రోజుల గదుల్లోని పనులు నీతో చేయిస్తుంది

ఇంతా చేసి ఇది జీవితం,
అనుభవాల అనుభవం,
నక్షత్రాల సమూహం,
నక్షత్రాలు ఈదే నల్లని కాంతిసముద్రం

దయగల రోజులూ, దయలేని రోజులూ
గడిచిపోతాయి నువు కావాలన్నా, వద్దన్నా

ఇక మిగిలేదల్లా నువ్వు,
విశాలమైన మైదానంలో
గొల్లబాలుని పిల్లనగ్రోవి పాటలా
తెరలు తెరలుగా వ్యాపించే,
ఎప్పటికీ వ్యాపిస్తూ ఉండే నువ్వు

2.4.2025 00.05 రాత్రి
బ్లాగ్ 11.10.2025

# ఈ క్షణమిలా..

ఈ క్షణం అద్భుతం
ఎండ వాలే, వాన కురిసే, వెన్నెల జారే ఒక క్షణం
దీని కోసమే పుట్టావు, పెరిగావు
ఏడ్చావు, నవ్వావు, భయాన్ని దాటావు,
మనుషుల్ని అల్లుకొన్నావు చుట్టూ,
కావాలనుకొన్నవి పొందావు, పొందినవి కోల్పోయావు

తీరా, ఈ క్షణం నీ కనుల ముందు నిలిచి
ఏమి ఆజ్ఞ అన్నపుడు కనులు మూసుకొన్నావు

నీ దోషమేమీ కాదు, దీని కాంతి అటువంటిది
సౌందర్యం, జీవనహేల అలాంటివి

భరింపరాని మహోధృత వేగంతో, వత్తిడితో
ఈ క్షణం నిన్ను ప్రేమించినపుడు
కనులు మూసుకొంటావు
జ్ఞాపకాల్లోకో, కలల్లోకో తప్పుకొంటావు

అప్పుడు వచ్చిన కవి
పదాలలో నింపి దానిని నీ ముందు పెడతాడు
చిత్రకారుడు రంగుల్లో, గీతల్లో ఒంపి
నీ కళ్ళ ముందు పరుస్తాడు

అప్పుడంటావు కదా,
అవును ఇదే నేను చూసింది

వాళ్ళు ఎంత అద్భుతంగా పట్టుకొన్నారు అని

నీపై వీస్తున్న లేతగాలివంటి క్షణం
ఇప్పుడు కూడా నన్ను పట్టుకోలేకపోయావని నవ్వుతుంది

వాళ్ళూ అంతే,
నాలో కరిగి, నేనై పోతే
ఆ పిచ్చిపనుల్లో కాలయాపన చేసేవారు కారు
అని జాలిపడుతూ మాయమవుతుంది

22.10.2024 00.22 రాత్రి
కవిసంధ్య, నవంబర్ 2024

# ఇలా మొదలై..

జీవితం సంతోషంగా గడవాలి,
విందు భోజనం ముగించినట్లు
తృప్తిగా ఇక్కడి నుండి వెళ్ళాలి
ఇంతకన్నా ఏముంటుంది నీలాంటి వారికి

పగలు ఉత్సవంలా గడవాలి,
రాత్రి నిండారా నిద్రలోకి జారుకోవాలి
పక్షి ఎగిరితే రెక్కలపై నీరెండ ఎగిరినట్లు,
చినుకుపై కాంతి పసిబిడ్డ నవ్వులా జారినట్లు
రోజు తేలికగా గడిస్తే చాలు

కాస్త నవ్వు మొహాలు, ప్రేమించే, దయగల మనుషులు
ఎదురైనపుడు పలకరించినా, పలికినా చాలు
ఇంతకన్నా ఏముంటుంది జీవనానందమంటే

ఉభయ సంధ్యలలో పురివిప్పే ఆకాశం
పగలంతా కాంతి దీవెనలతో,
రాత్రంతా నక్షత్రాల చల్లని చూపులతో
కనిపెట్టుకుంటే చాలు,
నిన్ను కాచుకొంటున్న తల్లి నేలని
తండ్రిలా కావలించుకుంటే చాలు

గాలికి జీవుల తలల్లా ఊగే చెట్ల పచ్చదనమూ,
జీవులకళ్ళలో నీలిగగనంలా ఊగే అమాయకత్వమూ,

చల్లగా తారల గుంపుల్లా సాగే సెలయేళ్లు,
దివాస్వప్నాల్లా పరుగులెత్తే ఋతువులూ చాలు

ఇంతకన్నా ఏం కోరికలుంటాయి
ప్రాణిగా ఆకృతి దాల్చే పంచమహాభూతాలకి
వాటి వెనక దాగే అకారణ జీవనానందానికి

కానీ, నీ చిన్ని కలకు దూరంగా ఎక్కడో ఉంటావు
కారణమెవరో తెలీదు, కారణమే కారణమా తెలియదు

జీవితం ఉండాల్సినట్టు ఉండదు,
నువు ఉన్నచోట ఉండలేవు,
తెలిసిన ప్రశ్నల వెనక దాగిన
తెలియని జవాబుల్ని కనిపెట్టలేవు

ఆనందంగా పుట్టి, దుఃఖంగానో, భయంగానో జీవించి
మరొక ప్రశ్నగా మరణిస్తావు
ఆ నక్షత్రాలు పూర్వులు విడిచిన ప్రశ్నలా
ఎవరు ఎవరికి చెప్పగలరు

13.11.2024 11.04 రాత్రి
కవితా ఏప్రిల్ 2025

# క్షణం పుట్టి..

ఇంత దీర్ఘమైంది కాదనుకుందాం జీవితం

ఇన్ని నలుపూ, తెలుపూ, రంగుల రోజులు
ఇన్ని ఋతువులు, వర్షాలు,
అడవులు, నదులు, కొండలు,
జీవుల వేదనలు, ఉత్సవాలు
మనుషుల ఊహలు, సంవేదనలు
ఇంత పెద్దది కాదనుకుందాం

జీవితం మరీ క్షణిక మనుకుందాం

ఒక చూపై పుట్టి
పూవు పూయటం చూసి, మాయమౌతాం
వినటమై పుట్టి పక్షి కూత విని, నిశ్శబ్దంలో కలుస్తాం
స్పర్శగా పుట్టి సెలయేటి తడి తాకి, చిట్లిపోతాం
వాసన ప్రాణిగానో, రుచి జీవిగానో పుట్టి
అనుభవం తెలుస్తూ, అదృశ్యమౌతాం

జ్ఞాపకం లేదు, ఎదురుచూపు లేదు
భయం, వెలితి, కలగనటం లేవు
క్షణ మాత్రపు జన్మ, అనుభవం, ముగింపు

ప్రాణమున్న అలల్లా దేహస్పృహ లేకుండా
సముద్రంలో హాయిగా ఈదే చేపలు

తెలియక వలలో చిక్కుకుపోయినట్లు
ఇంత ఖేద పడుతున్నాం గానీ

జీవితం నిజంగా పెద్దదీ, సృష్టికంటే బరువైనదా
చాలా చిన్నదీ, ఊహకంటే తేలికైనదా

1.11.2024 11.18 రాత్రి<br>స్నేహ, ప్రజాశక్తి 17.11.2024,<br>కవిత 2024

# హృదయం నుండి..

జీవితానికి భయపడుతున్న బిడ్డకి
మార్దవంగా చెప్పావు

జీవితం అంతిమంగా దైవస్వరూపం
మరొకటి కాదు, ధైర్యంగా ఉండు

ఈ నిముషానికి శరణాగతి చెందు
నడవలేని బిడ్డని తల్లి ఎత్తుకున్నట్లు
జీవితమే నిన్ను మోస్తుంది

దుఃఖం, భయం శిక్షలు కావు, శిక్షణ
చేయవలసిన ఉదాత్త కార్యాలకీ
పొందదగిన ఉదాత్త అనుభవాలకీ

జీవితానుభవంలో ఖాళీ అనంతం
అనుభవాలు చీమల్లాంటివి
వాటిని చూస్తూ బెంగటిలవద్దు

చాలా మాటలు చెప్పాక, అడిగావు
ఉపయోగపడతాయా
ఆమె అంది.. ఏదో ఒకరోజు

లోతైన మెలకువ విత్తనం లాంటిది
నిశ్శబ్దంగా మొలకెత్తుతుంది
ఎండ పడే కాలానికి నీడ నిచ్చే వృక్షమౌతుంది

ప్రేమ కావాలి
ఇదంతా ప్రేమ అనే మెలకువ కావాలి
ఇంతకన్నా అక్షరాలకి పనేముంది

జీవితం అందమైందో, కాదో చెప్పగలవారు లేరు
ప్రపంచం నిజంగా ఉన్నదో, లేదో
తెలిసినవారు లేరు

కలలో ఉన్నవేళ 'ఇది కల సుమా' అని
ఎవరు ఎవరికి తెలియజెబుతారు

ఒక మాట పలకాలని తోచినపుడు
పదాల లోపలి నిశ్శబ్దాన్నంతా గుమ్మరించగలిగితే
పలికినా పలకనివాడివి,
విన్నా నిశ్శబ్దాన్ని విన్నవాడివి

బిడ్డని, మాటలతో తాకావా, హృదయంతోనా
మాటలదేముంది హృదయం పనిచేస్తుంది
హృదయం మాత్రమే..

8.12.2024 11.28 రాత్రి
వివిధ, ఆంధ్రజ్యోతి 28.4.2025

# దుఃఖపు కోట

పలుచని ప్రేమ, పలుచని దయ
పలుచని భయం, పలుచని కోపం
పలుచని నీరు, పలుచని గాలి
పలుచని ఆకాశం, పలుచని మెలకువ

ఇంతకన్నా ఏం కావాలంటావు
జీవితం కాంతివస్త్రాలు దాల్చి
నీ ముందు నిలిచి, ఏం కావాలని అడిగితే

ఇంత చిక్కదనం గాయపరుస్తుంది,
హతాశుడిని చేస్తుంది,
ఉక్కపోసి, వెళ్ళేదారి వెదకమంటుంది

పూలమీది రంగుల్లా పుట్టాల్సినవాడివి,
సీతాకోక రెక్కల నిశ్శబ్దంలా,
ఇంద్రధనువులోని చెమ్మగాలిలా,
అడవిచెట్ల నీడల్లా ఉండాల్సినవాడివి
ఇలా ఎందుకున్నావని దుఃఖపడతావు

నిజంగా నీకేమీ తెలియదు,
తెలుసుననే పసిబాలుడి మాటలు
తెలిసి మాట్లాడుతున్నవి కాదు,
తెలియటమనే పంజరంలో
ఎలా ఇరుక్కున్నావో తెలియదు

ఇదంతా ఇలా కాదు,
మరోలా ఉంటే బావుండునని
బాల్యం నుండి ఇప్పటి వరకూ
దేహంలా ఎదగటం రాని
కల ఒకటి తలపై ఎగురుతూనే వుంది

ఇలా కాదు, మరోలా ఉండాలనిపించటమే
దుఃఖపుకోటకు ప్రాకారమేమో తెలియదు

22.12.2024 10.55 రాత్రి
ఈమాట.కాం ఏప్రిల్ 2025

# ఉన్నట్లుండి

ఉన్నట్లుండి ప్రేమ కమ్ముతుంది,
కొన్నిసార్లు దుఃఖం కమ్మినట్లు,
మోహమో, భయమో కమ్మినట్లు

అప్పుడు నువ్వు నువ్వు కాదు
తుపానులో ఊగే వృక్షానివి,
సముద్రంలో విరిగిపడే అలవి,
ఏకధారగా కురిసే వెన్నెలవి,
నిద్రించే పక్షి రెక్కల్లోని నిశ్శబ్దానివి

ఉన్నట్లుండి
నువ్వు నువ్వు కాకుండా పోతావు చూడు
అప్పుడు నీకు నువ్వు దొరుకుతావు,
సముద్రగర్భంలో ముత్యం దొరికినట్లు,
ఊహల ఖాళీలో నీకు నువ్వు ఎదురైనట్లు

ఉన్నట్లుండి జీవితానికి తలుపులు తెరుస్తావు,
సందేహపడి మూసేలోగా
అది కొన్ని కాంతులు ప్రవేశపెడుతుంది,
ప్రియురాలికి జారవిడిచే ప్రేమలేఖల్లా

కాంతుల్లో తలపోస్తావు
ఇదంతా కల్పన, పిచ్చివాని ఊహ,
పిల్లల ఆటల్లో తేలే ఆనందం,
పగలూ, రాత్రులుగా పొంగే అలల సందడి

మిగిలిన మాటలేమైనా ఉంటే
నీ కలల్లో నువు పూరించుకోవాలి,
మిగిలిన నిశ్శబ్దమేమైనా ఉంటే
దానితో నిన్ను నింపుకోవాలి

24.1.2025 11.57 రాత్రి
బ్లాగ్ 15.7.2025

# ఉద్వేగాల నుండి

ఉద్వేగాలు అడవిలో వృక్షాలు,
వృక్షాలలోంచి జారే కిరణాలు,
కిరణాలలో మిలమిలలాడే సెలయేళ్ళు,
సెలయేళ్ళలో దప్పిక తీర్చుకునే
కీటకాలు, మృగాలు, పక్షులు

ఎప్పుడూ ఏదో ఒకటిగా ఉండాలనిపిస్తుంది
వృక్షంలానో, కిరణంలానో, సెలయేటిలానో,
కీటకంలానో, మృగంలానో, పక్షిలానో

అడవిలోని ఏదో ఒకటై ఉన్నపుడు
అడవివి అయినట్లుంటుంది,
నువు ఎన్నో అయినట్లూ, నీకు ఎన్నో ఉన్నట్లూ
కానీ, ఇది ఎప్పటికీ నిండదు
ఎప్పటికీ ఒకలా ఉండదు

చెట్లు ఎండుతాయి, చీకట్లు వాలుతాయి,
సెలయేళ్ళు పొడిబారతాయి, జీవులు వెళ్ళిపోతాయి
ఏదీ మిగలని విషాదం భయపెడుతుంది,
భయపడీ, భయపడీ
ఇక పడలేక అడవిని వదిలేస్తావు చూడు

అపుడు మెలకువ వస్తుంది,
నువు అడవివి కావని, కాలేవని,

అడవిలో తిరుగాడే నిశ్శబ్దానివని,
అడవినీ, నిశ్శబ్దాన్నీ అలముకొన్న ఆకాశానివని,
ఆకాశాన్ని ప్రశాంతంగా కలగనే అనంతానివని

25.2.2025 00.30 రాత్రి
బ్లాగ్ 24.9.2025

# దయ నుండి

దయ ఉద్వేగాలకి తల్లి,
దయకి తల్లి జీవనానందం
ఇక్కడికి రాగలిగితే అహం నీరౌతుంది,
చీకటి కరిగి తెల్లవారుతుంది

చాలా కోరుకుంటాం, భయపడతాం
దిక్కులు తిరుగుతాం, లుంగలు చుట్టుకుంటాం

చిక్కులు పడిన అడవి చీకట్లలోకి
సూర్యకిరణం వాలకపోతుందా అని
ఎదురు చూస్తాం, వేసట పడతాం,
వాగునీటి చప్పుడులోకి చెవినీ, తలనీ అర్పిస్తాం
నీటి తడిలాంటి, సడిలాంటి దయ మినహా
ఏదీ నిన్నూ, లోకాన్నీ కాపాడలేదని
నిలువునా నీరైన క్షణాల్లో తెప్పరిల్లుతాం

ముందుగా శబ్దముందని వారంటారు గానీ,
ముందుగా దయ వుందని,
దయ నుండి ఆకాశం పుట్టిందని,
దయగల ఆకాశం నుండి సమస్తం పుట్టాయని తోస్తుంది

అనాది జీవితం, అనంతంగా సాగే జీవితం
నీలోని దయ నుండి పుట్టిందని
లేదూ, దయ నుండి నువు పుట్టావని తట్టినపుడు

ఇంత పెద్ద ప్రపంచం
పొగమంచులో తేలే పగటికలలా
ఒక్క సూర్యకిరణంతో మాయమవుతుంది

దయగల పక్షి కూత విన్నావా,
ఇక మిగిలిన పగలంతా
నిన్ను నువ్వు ధారాళంగా ఒంపుకొంటావు

4.3.2025 00.54 రాత్రి
బ్లాగ్ 30.9.2025

# జీవనోద్వేగం

ఉద్వేగాల గట్లు తెగినపుడు నువ్వొక జీవితం చూస్తావు
లెక్కలలో ఇరుక్కున్న జీవితం దాటి,
అది కూడా జీవితం కాదు, జాగ్రత్తల జీవితానికి వైద్యం

నీ అంతట నీవుగా, నీవు నీవులా
నెమ్మదిగా విరబూసే జీవితమొకటుంది,
పూలలానే, చెట్లలానే, గాలీ, వానా, ఆకాశంలానే
నీ సమయం తీసుకుని, తొందరేమీ లేకుండా

లోకం నుండి తీసుకునే, లోకానికి ఇచ్చే జీవితానుభవం ఒకటుంది,
కొందరు దానిని నేర్చుకొని వస్తారు,
కొందరు కళ్ళ ముందు నేర్చుకుంటారు,
కొందరు నేర్చుకోవటం నేర్చుకుంటూ..

ఇంద్రధనువులో మొదటి, చివరి రంగులలా
జీవితం నిండా మొదటి, మధ్య, చివరి మనుషులు,
పలు ఉద్వేగాలు, సంయమనాలు, అనుభవాలు

నువు వీరిలో ఎక్కడో ఒకచోట ఉంటావు,
అమావాస్య రాత్రి విరబూసే తారల్లో ఒకటిగా,
జీవితమంటే ఉద్వేగమా, జీవితమంటే ప్రశాంతతా
తేల్చుకునే సంరంభంలో వెలుగుతూ, ఆరుతూ

17.9.2025 11.48 రాత్రి

# ఇంత విశ్వం

ఇంత విశ్వం నీ ఉద్వేగాలతో పక్వమౌతుంది,
ఉద్వేగాల వైపు సమస్తశక్తులూ మోహరిస్తుంది,
నువు పండితే విశ్వం పండుతుంది,
దీనికోసం కదా నీపై జీవితపు వల పన్నుతుంది

ఉద్వేగపడాలి
దుఃఖంగా, భయంగా, మోహంగా, కరుణగా
ఉద్వేగపడాలి చీకట్లకీ, వెలుతురులకీ మధ్య,
మెలకువకీ, మరణానికీ, ఆశకీ, నిస్సత్తువకీ మధ్య

ఇంత విశ్వం, నిన్ను జీవితంలా చిలికి,
నీ నుండి శాంతి అనే వెన్న తీస్తుంది,
నిండుదనంలో విడిచిపెడుతుంది

ఇంత విశ్వం, నీ ముఖంలో ముఖం పెట్టి
అమాయకమైన నేత్రాలు తెరిచే ఆవులా,
తన అమాయకత్వంలో
మునిగిపొమ్మని బ్రతిమాలుతుంది

18.7.2025 1.00 రాత్రి

# క్షణికం

ఇవాళ ఉన్న ప్రేమ రేపు ఉండకపోవచ్చు,
నిన్నటి కోపం ఇవాళ మిగలనట్లే
జీవితం క్షణమాత్రం కదా, ఇక ఉద్వేగాలెంత

ఈ క్షణంలోకి నిన్ను కోల్పోవటంలో దాగివుంది
జీవితంలోని అందమంతా,
కొనసాగించాలనిపిస్తుంది చూడూ
అప్పుడు మొదలవుంది జీవనవిషాదం

ఇంద్రధనువు వెళ్ళిపోయాక గగనం వెలిసిపోదు
తనతో నిండి వుంటుంది హాయిగా,
నింగిలో నుండి వచ్చావు కదా
ఉండలేవా చూడు నీతో నిండిపోయి

ఏకాంతం జీవన రహస్యం
ఎవరూ లేనపుడు, ఏ చప్పుడూ కానపుడు,
అద్దంలోని మనిషి ఒకడే ఎదురైనపుడు
ప్రేమించు తనని కూడా,
ఎదురుచూపుల వేదనంతా ఆవిరైపోయి
తేలికైనకాంతి చొరబడుతుంది లోపలికి

నిన్ను నువు ప్రేమించాలి, క్షమించాలి,
హృదయానికి దగ్గరగా తీసుకోవాలి,
ఉనికి నిన్ను ప్రార్థించేది ఈ లాలన కోసమే,

మిగిలిన ప్రపంచం బ్రతిమాలినా నీతో ఉండదు,
దాని పని దానికి ఉంది

ఒంటరితనం శాపం కాదు, వరం,
ఇది అర్థమైతే లోకం అందంగా మారుతుంది

జీవితాన్ని నిజంగా ప్రేమించిన వాళ్ళు
తమ ముద్రలు ఇక్కడ మిగలాలనుకోరు,
రేపటి కాంతి కోసం తమ రాత్రిని ఖాళీ చేస్తారు
ఏమి మిగలాలి ఇక్కడ, ఎంతకాలం

నువు ఏడవలేదు, నవ్వలేదు
నీలోంచి ఎవరో వాటిని చూసారు, చూపించారు
నువు ఉండేది లేదు, వారు వెళ్ళేది లేదు

ఇంత అద్భుతమైన లోకం
ఒక్క మృత్యువుతో మాయమవుతుంది
తరువాత మిగిలేది ఏమిటి! ఎవరికి!

12.4.2024 11.00 రాత్రి
బ్లాగ్ 10.8.2025

# ఆగటం

ఆగటం మినహా వేరే దారి వుండదు,
ఉద్వేగాలని ఆపటం మినహా

రాలిపోయే ఎండుటాకు మరో క్షణం ఆగినట్లు,
వికసించే పూలరేకులు ఆలోచనలో పడినట్లు
లోపల్నించి రాలే మాటలని, ఉద్వేగాలని
కాసేపు ఆగమనటం మినహా,
భద్రమైన నిర్ణయం కనబడదు

ఇక్కడ ఇలా వుంటుంది,
నీకేమీ తెలియదు కొన్నిసార్లు, ఆగిపోవటం మినహా

ఆగిపోయిన క్షణాలు
జీవితాన్ని కదలనీయక పోవచ్చును,
ఆగలేకపోయే క్షణాల మలుపుల కంటే
ఆగటం సరైనది కావచ్చును

ఎక్కడ ఆగాలో, కూడదో, నీ స్వంత నిర్ణయమో,
ఏ శక్తుల ఆటనో తెలియకపోవచ్చును

ఏమైనా, ఆగటం మినహా
ఆగి, ఇవాళ రాత్రి చంద్రుడెపుడు ఉదయించాడో,
ఎంత నిశ్శబ్దాన్ని వెన్నెల లోకానికి కానుక చేసిందో,

లోకపు దుఃఖమో, నాటకమో
నీలో ఎంత పలికిందో చూసుకోవటం మినహా,
ఇవాళ పని లేకపోవచ్చును

ఆగిన క్షణాల్లో, నువు జీవితానికి అతి దగ్గరగా
చలించే గ్రహంలా వుండవచ్చును
ఆగిన క్షణాలు నిన్ను మిగల్చకపోవచ్చును,
నిన్ను మాత్రమే నీకు మిగల్చవచ్చును

అప్పుడపుడు ఆగటం బావుంటుంది,
సెలయేరు ఆగి కోనేరు అయినట్లు,
చంద్రుడు ఆగి కోనేటిలో చూసుకున్నట్లు

తుమ్మెద ఆగి పూలరేకులు చూసినట్లు,
పూలు వికాసం ఆపి తుమ్మెదని పిలిచినట్లు,
సాయంత్రపు గగనంలో చివరి రంగులు ఆగి
ఇంకెవరైనా చూసే వారున్నారా అని అడిగినట్లు

ఊరికే ఆగటం బావుంటుంది
ఆగి, జీవితం లాంటి నిన్నూ, నీలాంటి జీవితాన్నీ
మనసారా కావలించుకోవడం బావుంటుంది

9.3.2025 11.40 రాత్రి
బ్లాగ్ 3.10.2025

# దుఃఖమూలం

చాలా రాత్రులు ప్రార్థించావు
నిదురించే ముందు దైవాన్ని
ఇది కడపటి నిద్ర కావాలని,

మరుసటి ఉదయాలు
మెలకువ వస్తూనే తెలుస్తుంది,
దైవానికి నీ ప్రార్థన చేరలేదని
జీవితంలో ఏదో బాధించి కాదు,
జీవితమే బాధనిపించి

ఇలాగే గడిచాయి వేల రోజులు
అదే వెలుతురు, చీకటి, అవే రంగులు, నీడలు
పాతబడిన ఆకాశం
పాత ఉద్యోగుల్లా వచ్చి, వెళ్ళే ఋతువులు,
పాతబడిన మనుషులు,
మీట నొక్కినట్టు వెలిగి, ఆరే ప్రేమలు, ఉద్వేగాలు

ఇంతే కదా జీవితమన్నావు, జీవితంతో చాలాసార్లు,
అమ్మా, ఎందుకు కన్నావని బిడ్డ అన్నట్లు
ఏనాడూ జవాబు రాలేదు,
జవాబు లేకపోవటమే జవాబని తెలియలేదు

రైలు వచ్చే సమయం సమీపించాక తెలుస్తుంది,
ఇప్పటి వరకూ పాదాలుంచిన ఊరు ఎంత అందమైనదో,
వీడ్కోలు చెప్పే ఆత్మీయులెంత విలువైనవారో

చెబుతావు ఇపుడందరికీ
జీవితం అద్భుతం, ప్రేమించండి,
జీవులు అమాయకులు, ప్రేమనివ్వండని

గగనంలో తేలిన ఇంద్రధనువు
గగనంలోనే మునిగినట్లు,
జీవితంలోంచి తేలిన నువ్వు
జీవితంలోనే మునుగుతావు

విడిగా ఉన్నదెక్కడ,
ఇది తెలియక కదా ఇంత దుఃఖం,
ఇంతకీ, ఇది ఎవరి దుఃఖం

8.12.2024 10.56 రాత్రి
సారంగ 15.3.2025

# చాలాసార్లు

చాలాసార్లు అనుకున్నావు
మెలకువలో బస్సు దిగి వెళ్ళిపోయినట్లు,
కలలో ఇంద్రధనువు దిగి వెళ్ళిపోయినట్లు
జీవితం దిగి వెళ్ళిపోవాలని

సాధ్యం కాలేదు గనుకనే
మళ్ళీ పగలూ, సూర్యుడూ, పిట్టలూ

మనుషుల్లాంటి జంతువులూ,
జంతువుల్లాంటి మనుషులూ
యంత్రం లాంటి జీవితమూ,
జీవితం లాంటి యంత్రమూ

సాధ్యం కాలేదు గనుకనే
మళ్ళీ బంధాలూ, ఆశలూ, ఉత్సాహాలూ,
బంధాలూ, నిరాశలూ,  నిరుత్సాహాలూ

సెలయేళ్ళు ఎప్పట్లానే ప్రవహిస్తాయి
మొక్కల్లోంచి ఆకులు ప్రవహించినట్లు,
పూలు ఎప్పట్లానే విరబూస్తాయి
సూర్యుడు గగనంలో విరబూసినట్లు,

పిల్లలు నవ్వుతారు ఎప్పట్లానే
దైవం నీలోంచీ, నాలోంచీ నవ్వినట్లు,

జీవితం ఎప్పట్లానే కొనసాగుతుంది
పిట్టపాట గాలి అలలపై కాగితం పడవైనట్లు

చాలాసార్లు అనుకున్నావు
కాలానికి చివరి చుక్క పెట్టాలని,
స్థలాన్ని చెరిపేయాలని

సాధ్యం కాలేదు గనుకనే
ఇంత దుఃఖం, బహుశా, ఆనందం

9.7.2025 11.51 రాత్రి
బ్లాగ్ 31.10.2025

# ఒక రాత్రి

దుఃఖం ముసిరినపుడు
పిల్లల నవ్వుల కోసం వెదుకుతావు,
నవ్వుల్లోంచి జీవితోత్సాహం మెరుస్తుందేమోనని

జీవితం ఉత్సవమో, శాపమో
ఇన్నేళ్ళు గడిచినా అర్థం కాలేదు,
జీవితంపై మిగిలింది ప్రేమో, భయమో
ఈ వెలుగునీడల్లో తెలియరాలేదు

నిద్రపోయినా రోజు గడుస్తుందంటూ
చాలాసార్లు ఊరడించుకుంటావు నిన్ను

జీవించటం భూమికంటే భారమైన పనా,
ఆకాశం కంటే తేలికైన ఆటా,
కలలోని మనుషులు వివరించలేరు

గాలి నిదురిస్తూ వీచినట్లు,
ఎండ నిదురిస్తూ కాంతి పరిచినట్లు
జీవితం నిదురిస్తూ నిన్ను కలగన్నదనుకొంటాను

ఈ చలిరాత్రి రెక్కలు విప్పి
చీకటిలోని ధాత్రిపై నిశ్శబ్దంగా ఎగురుతోంది
అదృశ్యదేవతలు నీ జీవితంపై ఎగురుతున్నట్లు

చీకటిలోంచి ఒంటరి పక్షిపాట వినవస్తుంది
పాట చుట్టూ తేలుతున్న నిశ్శబ్దంలో
నీకు నువ్వు దొరికినట్లు తోస్తుంది

ఈ రాత్రిలో అలలాగా తేలుతున్న నీ మెలకువ
తెల్లవారేసరికి ఏ తీరం చేరనుంది

21.1.2025 11.46 రాత్రి
బ్లాగ్ 12.9.2025

# దుఃఖం తర్వాత

దుఃఖపు తుపాను వెళ్ళిపోయాక
పగటికాంతిని మరింత ప్రేమిస్తావు,
పిల్లల నవ్వులకి లోతైన అర్థం తోస్తుంది,
జీవులకి, జీవితమంటే
ఎందుకింత మోహమో అర్థమైనట్లుంటుంది

పూలు వికసించటం, గాలితెరలు ఎగరటం,
నీరు సరళంగా ప్రవహిస్తూ సంభాషించటం,
పిట్టలూ, ఇంద్రధనువులూ గాలిలో ఈదటం,
నేలమీది జీవులు తీరికగా ధ్వనులు చేయటం,
వాటికి అర్థాలుండటం కొత్తగా ఉంటుంది,
నీరెండలోకి లోకం మొదటిసారి తెరచుకొన్నట్లుంటుంది

దుఃఖం తర్వాత, వ్యక్తి ధూళి అయిన తర్వాత,
నీటికడవలా భళ్ళున విడిన తర్వాత,
భద్రవలయాలు మసకబారిన తర్వాత,
నింగీ, నేలా కంపించిన తర్వాత

నీకు నువు కొత్తగా పరిచయమౌతావు
తలారా స్నానం చేసినట్లు, కొత్త బట్టలు కట్టినట్లు,
పండుగపూట గడుపుతున్నట్లు
నీపై లాలస వంటిదేదో కలుగుతుంది

గాఢమైన దుఃఖం తర్వాత మళ్ళీ పుడతావు,

లోపలి జీవితేచ్ఛ నిన్ను మళ్ళీ ప్రసవిస్తుంది,
గతం బీటల్లోంచి చిమ్మే జీవధార అనుభవానికొస్తుంది,
భవిత తెగిన గాలిపటమై స్వేచ్ఛలోకి ఊపిరితీస్తావు

గాఢమైన దుఃఖం తర్వాత
భయం నుండి ప్రేమలోకి
ఉలికిపాటున మెలకువొస్తుంది

5.2.2025 11.18 రాత్రి
బ్లాగ్ 18.9.2025

# నువ్వూ, అనంతం

సుఖంలో అనుభూతుల కోసం,
దుఃఖంలో ఉద్వేగాల కోసం వెదుకుతావు
వెలుతురులో నీడల కోసం,
చీకటిలో కాంతి కోసం వెదికినట్లు

అనుభూతులు మసక చీకటివెలుతురు
ఉద్వేగాలు పగటి కాంతి, నల్లని చీకటి

సంధ్యవేళ చీకటికీ, వెలుతురుకీ
చెందకుండా నిలబడినట్లు,
జీవించేవేళ దుఃఖానికీ, సుఖానికీ
చెందకుండా నిలబడి ఉంటావు

ఊరికే నిలబడ్డావని తెలీదు
కొండలకి నిలబడి ఉన్నామని తెలీనట్లు,
ఊరికే కాంక్షకి పుట్టావని తెలీదు
వానకి పుట్టానని ఇంద్రధనువుకి తెలీనట్లు,
అద్దానికి పుట్టానని ప్రతిబింబానికి తెలీనట్లు

ఈ పగలు గడుస్తుంది, రాత్రి గడుస్తుంది,
ఈ జన్మ గడుస్తుంది, మృత్యువు గడుస్తుంది
పుట్టావనీ, ఏడ్చావనీ, నవ్వావనీ, వెళ్ళావనీ
జీవితానికి తెలీదు, అనంతానికి తెలీదు

ఈ క్షణంలో కంటికి కనిపించే దానిని
కోరికల్లేకుండా ప్రేమించరాదూ,
సృష్టి రహస్యం తాళం విడినట్లు విడుతుంది,
పిచ్చివాడా, నువ్వూ, ప్రేమా ఒకే అర్థం కదా

20.9.2025 11.34 రాత్రి

# అర్థం

సంతోషంలో ఇదంతా అర్థవంతంగా తోస్తుంది,
సంతోషంలోకి నిను కోల్పోవటంతో సహా,
అర్థాల మీద ఆసక్తి ఉండదపుడు,
దుఃఖంలో ఇదంతా అర్థంలేని దవుతుంది,
దుఃఖంలోకి జారిపోతూ అర్థాలు వెదుకుతావు

ఆకాశం నీలంలోనో, నల్లని నిశ్శబ్దంలోనో ఉంటుంది,
ఉదయాస్తమయాల్లో రంగుల సీతాకోకలు ఎగిరినా,
నిలిచేవి మెరిసే నీలమూ, మెరిసే నలుపూ
దిగులూ, దుఃఖ సమయాల్లా,
సంతోషంలో మైమరిచేది తక్కువ

జీవితం దుఃఖమయమన్నారు గానీ
దుఃఖం జీవితమయమని తోస్తుంది,
స్వేచ్ఛ తెరచాప యెత్తి దుఃఖసముద్రంపై
ఆనందతీరాలకి సాగిపోవాలనిపిస్తుంది

పదాల అర్థాలే దాటలేవు,
శబ్దాలు దాటడానికి ఇంకెంత ప్రయాణించాలి
ఇక, వాక్యం చివరి నిశ్శబ్దం చేరటానికీ..

11.7.2025 10.35 రాత్రి

# చాలదా

ఎవరో, ఎపుడో, అకారణంగా
చూపే రవంత ప్రేమ చాలును,
ప్రేమ జ్ఞాపకం చాలును
ఇంత బరువైన జీవితంలో
క్షణం ఆగి ఊపిరి తీసుకోవడానికి

ప్రశ్నలతో మేలుకొన్న పేలవమైన ఉదయం వేళ
తటాలున బంగారుకిరణం
నిన్ను ఈ క్షణంలోకి తట్టడం చాలును
ఇంత సారహీనమైన జీవితం వెలగటానికి

యుగాల మానవగాథల బరువు
జీవితం నీపై మోపే వేళల
పసివాని చిరునవ్వూ,
గాలికి కదిలే గడ్డిపరకల మర్మరధ్వనీ,
దారినపోయే మనిషి కళ్ళలో
క్షణం వెలిగే కరుణా, స్నేహమూ చాలును
ఊరకనే తేలిక కావడానికి

భూమి ఇంకా ఎడారి కాలేదు,
సముద్రం ఎండిపోలేదు,
వెన్నెల మసకగానైనా కనిపిస్తూవుంది
ఎందుకు బ్రతకకూడదు

4.4.2025 11.05 రాత్రి

# అపురూపం

కొన్ని క్షణాలు నవ్వుతావు చూసావా,
ఆ క్షణాల కోసమే బ్రతికుంటావు
అనేకసార్లు మృత్యువును దాటి

ఇంత విశ్వం నిన్ను కలగని ఎదురుచూసింది
ఆ నవ్వు కోసమే కావచ్చు,
ఉదయాలు బంగారాన్ని వెదజల్లింది
నీ ప్రశాంతమైన చూపు కోసమే కావచ్చు,
పూలు పలురంగుల్లో దోబూచి ఆడింది
నీ కళ్ళలోని ఆశ్చర్యం కోసమే కావచ్చు

జీవుల కళ్ళలో జాలిపుట్టించే అమాయకత్వమూ,
మనుషుల్లోంచి వ్యక్తమయే
పక్షిరెక్కల చప్పుడులాంటి మెత్తని ప్రేమా,
ఎవరో కవి నీ లోపల కూర్చున్నట్లు పలికే మాటలూ,
ఏ స్వాప్నికుడో పలికించే వాయిద్యపు ధ్వనులూ
నువు ఉండటం కోసం ఎదురుచూసినవే కావచ్చు

రోజులకేమి
శిశిరపత్రాల కన్నా వేగంగా రాలిపోతాయి,
మాటలకేముంది
నీటిబుడగల కన్నా వేగంగా చిట్లిపోతాయి,
అనుభవాలకేముంది
ఇదే కోరుకున్నది అనేలోగా వెలిసిపోతాయి

కన్నా, ఈ నిమిషాన బ్రతికున్నావు చూడు,
ఇది కాలాల కావలి నుండి, గోళాల కావలి నుండి
తెలియని ఎవరో గాఢంగా కోరుకున్న కల

ఈ ఉదయం గడ్డిపరకపై వాలిన
మంచుబిందువుని చూసావా,
దానిలో ఆడుకుంటున్న రంగుల్నీ..
ఆ తెలియనివానికి ఆ బిందువుపై,
ఆ బిందువువంటి నీపై ఎంత ప్రేమ

29.10.2024 00.09 రాత్రి
బ్లాగ్ 29.9.2025

# కనికరం

కాస్త కనికరం చాలు
పొడిపొడిగా చీకటి రాలే రాత్రులవేళల

పగలు కురిసి, కొత్త గాయాలు చేర్చి
మరింత బరువైన నిన్ను మిగిల్చేవేళల
ఒక కుక్క పిల్లయినా కావచ్చు
నీలో కాస్త కనికరం కలిగిస్తే చాలు

జీవితం అమాయకమైనది,
జీవులు మరింత అమాయకులు,
మాయకంబళిలో ఊపిరాడని జీవితాలివి
ఎవరు పన్నారో ఈ వల
తెలిసినవారెవరూ కనిపించరు

కాస్త కనికరం చాలు
నిన్ను నేనూ, నన్ను నువ్వూ
క్షమించటానికి, ప్రేమించటానికి
కనికరం దేవునికి దగ్గర దారి

ఈ రాత్రి వెలుగుతుంది
నక్షత్రాలతో, చంద్రరేఖతో
అమ్మ ఒడిలా విశ్రాంతి నిచ్చే చీకటితో

రాత్రి లోపల నువ్వూ వెలుగుతావు
కాస్త దయతో, ప్రేమతో

వెలుతురు వస్తుందంటే
ఒంటరితనపు భయం కమ్ముతుంది

పగలెంత కఠినంగా ఉండనీ
పగటి చివర రాత్రి వస్తుంది, నిద్ర పడుతుంది
కలల సంగీతం అణిగాక
దైవం నిన్ను గుండెలపై పెట్టుకుని
లాలనగా, రేపు బ్రతికే ధైర్యం ఇస్తుంది

మరి కాసేపు బ్రతికి ఉండు,
జీవితంపై కాస్త కనికరం చూపు,
దైవంపై కాస్త దయ దాల్చి ఓర్పు వహించు

10.7.2024 11.20 రాత్రి
బ్లాగ్ 27.10.2024

# గాలినీడ

ఒక మనిషి చిరునవ్వు కనులారా చూడటం కోసం
ఊర్లు దాటి, చలిగాలులు దాటి, రాత్రులు దాటి వెళతావు

కేవలం చిరునవ్వు,
కనబడగానే విచ్చుకొనే కంటివెలుగు,
నీ కోసం తడబడే మాటలు

అప్పుడేదో ఉంటుంది కదా
విలువలు, నీతులు మోపే భారాల కన్నా
అందం, అపురూపం, సున్నితమైనది

జీవితం వెలుగుతుంది,
ప్రాణం నిండుతుంది,
ఇక చాలనిపిస్తుంది ఏదైనా
ఒక ప్రేమ తునక కోసం
ఇంత తహతహలాడుతావు జీవితమంతా

నిన్ను కోల్పోయే అనుభవం కోసం కదా
ఇంత వేసట, వెదుకులాట, ఎదురుచూపు
కన్నా, ఎపుడైనా నిజంగా నువ్వు ఉన్నావా

ప్రేమ సుడిగాలిలో పట్టుకోల్పోయి ఎగిరే
ఎండుటాకువి నువ్వు, గాలినీడవి

29.10.2025 01.18 రాత్రి

# కొంచెం మిగిలినా..

ఈ లోకంలో కరుణ మిగిలి ఉన్నందుకు ధన్యవాదాలు
ఉదయపు కిరణాలలో కాంతీ, గాలిలో శాంతీ,
మధ్యాహ్నపు ఎండలో నీడలూ,
సాయంత్రపు దిగుల్లో గగనం నిండా రంగులూ
మిగిలినందుకు ధన్యవాదాలు

పిల్లలింకా అమాయకంగా
కన్నార్పక చూస్తున్నందుకు ధన్యవాదాలు

చీకటి మూగిన వేళల నింగిలో మూగగా వెలిగే తారలూ,
జీవులు భయంలో మునిగినపుడు
కొనవూపిరిలా మెరిసే ఆశలూ,
స్పర్శలో అరుదుగా తాకే ఆర్ద్రతా
ఈ లోకంలో మిగిలినందుకు ధన్యవాదాలు

కొంచెం ప్రేమ మిగిలినా చాలు,
కఠినమైన చలివేళల వెచ్చని ఊపిరి చాలు,
ద్వేషాలూ, అపనమ్మకాల మధ్య తడిచూపు చాలు

ఈ లోకం మరిన్ని యేళ్ళు బతుకుతుంది,
ఒక మనిషి మరికొన్ని రోజులు బ్రతుకుతాడు,
నీరెండ మరికొన్ని క్షణాలు లోకాన్ని దీవించి వెళుతుంది

15.9.2024 11.24 రాత్రి
బ్లాగ్ 14.8.2025

# కాస్త అమాయకత్వం

కాస్తంత అమాయకత్వం కోసం తడుముకుంటావు
ముసురురోజుల్లో ఎండ కోసం వెదికినట్లు,
చలిరాత్రి సెగడు కోసమూ,
వేసవి సాయంత్రం గాలితెర కోసమూ తడిమినట్లు

పసిపిల్లల నవ్వులాంటి నవ్వు కోసం,
పిల్లల కళ్ళలోని ఆశ్చర్యం కోసం,
వారి మాటల్లోని తేటదనం కోసం,
వారిలో తొణికిసలాడే జీవనానందం కోసం

నీ సాటి ప్రపంచంలోకి,
పెద్దదయి, వడిలిపోతున్న ప్రపంచపు
ముఖాలలోకి తేరిపార చూస్తావు

జీవితం గుహలో దారి తెలియక తిరుగుతూ,
కూలబడిన ముఖాల్లోకి,
సూర్యుని కోసం కాంతి వాలినచోట గాక,
సూర్యుని వైపు చూడాలని తెలియని కళ్ళలోకి,
అమాయకత్వాన్ని
అమాయకంగా వదులుకున్న హృదయాల్లోకి

బరువైన జీవితం, నీరు నింపుకొనే కడవలా బరువెక్కే,
ఉదయాన కనులు తెరిచే దుఃఖంలా నిరాశ కమ్మే,
ఏకాంతపుసుడిలోకి జారే నిస్పృహ నిండిన జీవితం

నీ చుట్టూ ముసిరినవేళ కూడా
కాస్త అమాయకత్వం కోసం వెదుకుతుంటావు

నీ కెక్కడో నమ్మకం, కాస్త అమాయకత్వం చాలు
ఇంత దుఃఖం నుండి ప్రపంచాన్ని బయటపడేస్తుందని,
గుహలోకి సుదూరకిరణంలా దారి చూపిస్తుందని

8.7.2025 10.24 రాత్రి
బ్లాగ్ 30.10.2025

# ఇతరుల సంతోషం

ఇతరులలో సహజమైన సంతోషం
కెరటంలా విరిగిపడటం చూసినపుడు,
కాసేపు, నిన్ను నువు కోల్పోతావు,
లేదా, నిన్ను నువు పొందుతావు

సంతోషం జీవిత పరమావధి అని
కెరటం చివరి జల్లులు చెబుతాయి,
ఊరికే సంతోషంగా ఉండటం బావుంటుంది
ఉన్నతోన్నత గమ్యాలు చేరటం కన్నా,
సంపదా, జ్ఞానం, కీర్తీ సేకరించటం కన్నా

ఒకనాడు దేవుని ముందు నిలుస్తావనుకొందాం,
పుణ్య, పాపాల లెక్కలటుంచి,
ఎంత సంతోషించా, వెంత దుఃఖించావని
యథాలాపంగా అడిగాడనుకొందాం

యథాలాపం కాదు,
తన సృష్టిని నువ్వెంత మెచ్చావో, నొచ్చావో
తెలుసుకునే యత్నమనుకుందాం,
ఆ పెద్దప్రాణంపై గౌరవంతో
ఆహా, జీవిత మద్భుతమని చెప్పావనుకుందాం

నువు చెప్పింది నిజమో, కాదో నీకు తెలీదు,
నీకో జీవితముండటం నిజమో, కాదో తెలీదు,
ఇదంతా అసలుందో, లేదో తెలీదు

కానీ, ఇతర్ల సంతోషంలోకి
అదాటున మునిగే క్షణాలుంటాయి చూసావా,
ఇతర్ల దుఃఖంలో, అప్రయత్నంగా
మునిగే సమయాలుంటాయి చూసావా

అపుడు జీవన సారమేదో
నీ ప్రక్క నుండి వెళ్ళిపోయే ఓడలా
అంటీ, అంటక తాకుతుంది
భారమైన తీరం
నిను మృదువుగా అనంతంలోకి నెడుతుంది,
దూరపు ఆనంద సముద్రం
తన లోనికి, లోనికి పిలుస్తుంది

5.3.2025 00.29 రాత్రి
బ్లాగ్ 1.10.2025

# నిష్కపట స్వప్నం

ఎవరైనా ఇద్దరు మనుషులు
నిష్కపటంగా ప్రేమించుకోవటం చూస్తే
కనులు చెమ్మగిలుతాయి

ఎవరైనా నిష్కపటంగా ఒక జీవిని ప్రేమించటం చూస్తే
ముఖం ప్రసన్న మవుతుంది
ఒక జీవి నిష్కపటంగా జీవనానందంలో మునిగితే
హృదయం సారవంతమౌతుంది

ఎవరికి ఎవరిపైనైనా దయ, కృతజ్ఞత, క్షమ కలిగితే
అది చూడటం కోసం పుట్టినట్లు వుంటుంది,

ఆ క్షణంలో, పుట్టుక మూలంలోకి,
భూమిలోకి, తారల్లోకి ప్రయాణించినట్లు,
తెలియరాని సరిహద్దుల ఆవలికి విస్తరించినట్లుంటుంది

ఉన్నట్లుండి పనులు పక్కన పెట్టేస్తావు, భయాలు మరిచిపోతావు,
కట్టుబాట్లు గాలికి వదిలేస్తావు, బాధ్యతల్ని చూసి దయగా నవ్వుతావు

క్షణాల తర్వాత విధిగా మర్యాదలు తొడుక్కుంటావు కానీ,
నిర్మలమైన నీ ప్రేమా, స్వేచ్ఛా స్వప్నమూ ఫలిస్తున్నాయని
నీ లోపలి తరువాతి తరాల మనుషులు గుర్తిస్తారు

10.12.2024 10.26 రాత్రి
బ్లాగ్ 22.8.2025

# అనంతం ప్రేమ

మనుషులిద్దరు అకలుషంగా కౌగలించుకుంటారు చూసావా
అపుడు వాళ్ళు రెండు చేపలు, రెండు చీమలు, ఇద్దరు పిల్లలు,
రెండు పక్షుల ముక్కులు, నీరెండలోని పొడవాటి జంట నీడలు

కౌగిలిలో కనులు మూసుకొని గాఢమైన నిట్టూర్పు విడిచినపుడు
గ్రహగోళాలకి విస్తరించిన ఒక జీవితం,
మరణాన్ని దాటిన మెలకువ

అనంతం ఎక్కడో లేదు
ప్రేమ రూపంలో తిరుగుతోంది మన చుట్టూ, కన్నబిడ్డలా
అహం ముసుగు వేసుకుని తప్పించుకోవాలని చూస్తామా,
దుఃఖం ముసుగు వేసుకుని మన కోసం ఎదురుచూస్తుంది

అకలుషంగా ఇద్దరం సమీపించినపుడు
ఇదిగో, ఇక్కడే ఉన్నానంటూ
ఆకాశం తెర తొలగించి మన ముందు వాలుతుంది

18.12.2024 11.02 రాత్రి
బ్లాగ్ 1.9.2025

# ఇలాగైతే తెలీదు

చాలారోజులు
మనుషుల తలలు చూస్తూ గడిపాక
తటాలున గుర్తొస్తుంది,

ప్రణాళికలు చిట్లిన విరామంలోనో,
కలలల్లోంచి సందేహాల మంచులోకి తప్పినపుడో,
నీ మనుషుల నుండి ఊహించని నిశ్శబ్దాల్లో,
గొంతుల్లో, చూపుల్లో, తప్పించుకోడాల్లోనో

నీ చుట్టూ పెద్ద ప్రపంచం ఉందని,
తల వాల్చితే నీడలు కనిపిస్తాయని,
ఎత్తితే చెట్లు నీతో నివసిస్తున్నాయని,
వాటిపై పక్షులు వాలుతూ, ఎగురుతూ,
దూరాలకి మాయమవుతున్నాయని

వాటిపై గగనంలో ఎండ అనేదొకటి
పగలంతా చాప పరిచి నిద్రపోతుందని,
అది చాప చుట్టాక నల్లని నేల ఒకటి
చుక్కలతో శుభ్రంగా తళతళ్లాడుతుందని

నీ అయిదారుడుగుల ఎత్తు జీవితం నుండి
క్రిందికో, పైకో చూసినపుడు తప్ప తెలీదు

నువు బ్రతకాల్సిన జీవితంలో
నూరో వంతైనా బ్రతకటం లేదని,

నీ విశాలమైన గదిలో ఒక మూలన కూర్చొని
ఊపిరి ఆడడం లేదంటున్నావని

తరాలుగా ఊడలు దించిన
భయాలు, మొరటుదనాలు
నీ జీవితం నీది కాకుండా చేసాయని

నీ అంతట నువు అడవిలోనో,
నక్షత్రాల గుంపుల్లోనో తప్పిపోతే తప్ప తెలీదు
వానలోకో, ఎడారిలోకో
నిన్ను విడిచిపెట్టుకొంటే తప్ప తెలీదు

13.11.2024 11.42 రాత్రి
కవితా సెప్టెంబర్ 2025

# దేవుడి నీడ

నగ్నశిశువులాంటి జీవితాన్ని మినహా దేనినీ నమ్మలేదు
మనుషుల్ని నమ్మినట్టూ, నమ్మి గాయపడినట్టూ
నిన్ను భ్రమింపచేయబోయావు గానీ

జీవితానుభవాన్ని మినహా దేనినీ నమ్మలేకపోయావు
అలల్లాంటి అనుభవాలని కాదు,
సముద్రంలాంటి జీవితానుభవాన్ని

కనుకనే బహుశా, ఇంకా ఇక్కడ ఉన్నావు,
ఇంకా ఇప్పుడు ఉన్నావు,
ఈ రాత్రిలోకి మేలుకొని,
రాత్రికి పహరా కాస్తున్న నక్షత్రాలకి
పహరా కాస్తున్నావు,

దేవుడు అప్పగించిన జీవితాన్ని ప్రేమించే బాధ్యతని
ఈ రాత్రికి తప్పక శిరసా వహిస్తున్నావు,
వేరేదారిలేదు గనుక
సమస్తాన్నీ దేవుడి నీడలా ప్రేమిస్తూ ఉన్నావు

8.8.2025 11.50 రాత్రి

# అనంతం

ఈ భూలోకమింత విశాలమైనది
దీనిపై రెక్కలు వాల్చే కాంతిపక్షి మరింత విశాలం
కాంతిశిశువుని గుండెలకి హత్తుకునే నీలాకాశం మరింత విశాలం

ఇక్కడి కాంతిలో రంగులు చేపల్లా ఈదుతాయి,
గాలిలో శబ్దాలు పక్షుల్లా ఎగురుతాయి,
స్పర్శల్లో లోకాలు మేలుకుంటాయి, అస్తమిస్తాయి,
జీవితాలు సముద్రాల్లా ఘూర్ణిల్లుతాయి, కలల్లా మాయమవుతాయి

ఈ మెలకువ ఇంత అల్పమైనది
దీనిలో దీర్ఘకాలం ప్రయాణించిన
ఓడలాంటి జీవితం మృత్యుతీరం తాకగానే
ఒక్క గెంతులో మాయమవుతుంది

ఈ మృత్యువు ఇంత విశాలమైనది
శబ్దాల పక్షులూ, రంగుల చేపలూ
సంచరించిన జాడైనా లేని
పరమ చల్లనిశాంతి గుండెలకి హత్తుకుంటుంది

జీవన్మరణాల జీవితమింత విశాలం,
ఆద్యంతాలు తెలియని అనంతం
నిన్నెందుకో ఇక్కడ కొంతకాలం కలగంది,
తనని నీలో చూసుకొంది

8.8.2025 11.20 రాత్రి

# అమాయకత్వం

భూమి పుట్టినప్పటి అదే గాలి
ఇన్ని తరాలుగా అలానే వీస్తోంది
అమాయకంగా, దయగా,
అదే అమాయకమైన కాంతి,
అమాయకమైన పచ్చదనం

కాలం మరీ అమాయకురాలు
ఇదంతా ప్రేమమయమని
నమ్మకంగా చెబుతూ సాగిపోతోంది

ఒకానొక కాలంలో, ఒకానొక చోట
పుట్టావు, జీవించావు, సెలవు తీసుకొంటావు
కొత్త కథల్లోకి మేలుకొంటూ
ప్రపంచం నిన్నెక్కడో మరిచిపోతుంది

దీనినంతా ప్రేమించాలా, విడిచిపెట్టాలా
తెలియదు నీకు,
గాలిలో గిరికీలు కొట్టే పక్షిలా
ఇక్కడిక్కడే తిరుగుతావు,
గాలిలో ఎగరాలో, నేలపై వాలాలో తెలియక,
జీవించాలో, మరణించవచ్చునో అర్థంకాక

పగటికీ, రాత్రికీ ఒకటే సందేహం,
ఇక్కడే ఉండాలా, ఇక వెళ్ళిపోవాలా అని,
ఉండలేక, వెళ్ళలేక వలయంగా తిరుగుతాయి

ఉత్త అమాయకత్వం తప్ప
జీవించటానికి అర్థమేముంది,
నీ చేతుల్లో లేని పుట్టుక, వీడ్కోలు,
నీ చేతుల్లో లేని కన్నీళ్ళు, చిరునవ్వులు

19.3.2025 00.29 రాత్రి
బ్లాగ్ 5.10.2025

# వీడ్కోలు ప్రేమలేఖ

అమాయకపు స్వర్గం నుండి
జారిపోతున్నా హాయిగానే వుంటుంది

ఆ హాయి లౌక్యానిది కాదు,
అమాయకత్వానిది,
ఈ సంగతి లౌకిక పాతాళంలో
చిక్కుకున్నాక కానీ తెలిసిరాదు

ఏం ఉపయోగం,
అప్పటికే ఈ లోకపు డొల్లలలో
ఒకటిగా మిగులుతాము,
అమాయకమైన కాలం
మనని చూసుకుని దుఃఖపడుతుంది

25.6.2024 10.20 రాత్రి
బ్లాగ్ 11.8.2025

# బదులు తీర్చటం..

ఈ లోకంలో ఏమన్నా బ్రతికితే చిన్నపుడు బ్రతుకుతాం
మిగిలిన జీవితమంతా బదులు చెల్లిస్తాం

ఆడా, మగా తెలియని పసిదనం తర్వాత ఏముందిక్కడ
రాత్రి చుక్కల పందిరీ,
పగటి వెలుతురు సందడీ మినహా
రేపటి ఆలోచన లేని రోజులు గడిచాక ఏముందిక్కడ

కాసిని శైశవక్షణాలు అనుభవించినందుకు
ఇంత బదులు తీర్చటం అవసరమా అని అడుగుతావు దేవుడిని
ఉండీ లేనివాడిని, లేకుండటంలో దాగినవాడిని
జవాబు రాదు

బ్రతికావు కదా కాసిని రోజులో, నిముషాలో
శుభ్రమైన పసిదనంలో, స్వేచ్ఛలో
భయరహిత క్షణాల్లో, ఏదీ గుర్తుండని కాంతిలో
చెల్లించి వెళిపోవా మిగిలిన బరువైన రోజుల్ని
నిన్ను నువ్వే బ్రతిమాలుకుంటావు

బదులుగా,
ఇక రావు ఇక్కడికి అనటం కన్నా
ఏ వరం ఇవ్వగలడు దైవమైనా

17.9.2024 11.58 రాత్రి
బ్లాగ్ 15.8.2025

# అమాయకం

కళ్ళలో కాస్త తడి ఉండటం వల్ల,
నమ్మకం మొక్క ఇంకా పచ్చగా ఉండటం వల్ల,
లోతులన్నీ తెరిచి ముఖం మెరిసేలా నవ్వటం వల్ల

అమాయకుడివి కావచ్చును,
నీతో ఆడుకోవచ్చని లోకం సరదాపడవచ్చును,
ఎలా బ్రతుకుతాడోనని జాలిచూపవచ్చును

ఎంత తెలివైనవారూ, రేబవలు గెలుపుపై స్వారీ చేసేవారూ
నవ్వుతూనే బ్రతికింది లేదు, తృప్తిగా వెళిపోయింది లేదు,
గుండె నిండుగా గాలి పీల్చి ఇదిగో, బ్రతుకుతున్నానన్నది లేదు

ఎవరికి నచ్చినట్టు వారు ఇక్కడ, ఎవరికి చాతనైనట్టు వారు
ఇలానే బ్రతకాలన్న శాస్త్రం లేదు,
ఉన్నా, మృతభావాలకి విలువ లేదు

ఎంత గతాన్ని తలిస్తే అంతగా,
ఎంత భవితని ఊహిస్తే అంతగా ఊపిరాడదని తోచాక

ఈ నిముషంలో హృదయంతో జీవించటం కన్నా
పచ్చటి ఆకుల్ని లోనికి పిలిచే కిటికీ ఏదీ లోకంలో..

10.12.2024 11.30 రాత్రి
బ్లాగ్ 26.8.2025

# కదిలితే మాత్రం..

మనుషుల బలాలకీ, బలహీనతలకీ,
కదిలిపోతున్నావు కరుణలోకో, విసుగులోకో,
పాపం, పిచ్చి జాతి, ప్రపంచం నాదనుకుంటుంది,
విశ్వాన్ని జయిస్తున్నానని భ్రమిస్తుంది

చాలా పెద్దది కదా ఇదంతా, చాలా లోతు, వైవిధ్యం, అనూహ్యం,
దీనిలోకి వస్తారో, జారిపడతారో కూడా తెలీదు,
కానీ, ఎంత గర్వం, ఏనుగు ముందు చీమ ఛాతీ చూపినట్లు
జీవితం నా అదుపులో ఉందని తలపోస్తారు

ఇంత తెలివిలేని జాతిలో పుట్టి
ఉదయాన్నో, అస్తమయాన్నో చూస్తావు,
సీతాకోక ఖాళీలోకి ఎగరటాన్నో,
వాన రంగుల్లో ఒళ్ళు విరుచుకోవటాన్నో,
పిల్లలు ఏమీ పట్టనట్లు నవ్వటాన్నో కూడా

ఇదంతా నిన్ను కదిలిస్తుంది, నీతో కదులుతుంది,
కదిలి, కదిలించి, అమ్మ బిడ్డతో దోబూచి ఆడినట్లు
ఇదంతా లేదు కదా, నిన్ను వదిలిందే లేదు
అని నవ్వుతుంది తెలియరానిది

అంతవరకూ కదిలితే కదులు, ఊరుకుంటే ఊరుకో,
ఏమైందిప్పుడు, ఏమీ కావటానికి వీలులేని చోట

6.10.2024 11.05 రాత్రి
బ్లాగ్ 19.8.2025

# అడ్డు వస్తున్నది

ఇక్కడి నుండి ఎగరేసుకుపోయేవి ఏవో,
ఇక్కడ బంధించేవి ఏవో స్పష్టంగా తెలుసు కనుక
ప్రేమ అంత భయం, ప్రేమలేమి అంతవసరం

సందేహించటానికి, దాగొనడానికి,
భయపడటానికి, తలపడటానికి,
ఎవరో కావాలి నీకన్నా బలంగా,
ఇక్కడ పని ఉంటుంది అపుడు,
ఉండాల్సిన కారణం దొరుకుతుంది

కాస్త ప్రేమించావా, దయ చూపావా,
క్షమించావా, వదిలేశావా,
చేతులు ఖాళీ అవుతాయి,
బరువులు తొలగిపోయాక,
ఇక ఎగురుదామా అని వినవస్తుంది

ఇదంతా వెలుగునీడల ఆట,
చెట్లు అలానే ఉంటాయి
నీడలు సంధ్యలలో దీర్ఘమౌతూ
మధ్యాహ్నాలు దాక్కుంటాయి చూసావా,
అలానే భయాలు, ఆశలు, సందిగ్ధాలు

క్షమించతగనిది ఏమీ కనిపించపుడు
పసిదనంలోకి జారిపోతావని భయం,
పసిదనంలోంచి అనంతం ఎత్తుకుపోతుందని

చిటికెడు ప్రపంచాన్ని చుట్టుకొన్న అనంతాకాశం
కనులు తెరిచింది మొదలు చెబుతూనే ఉంది

నీకు తెలిసిన జీవితం చాలా చిన్నది,
నీ జీవితం చాలా పెద్దదని,
వినడానికి అడ్డు వస్తున్నది ఏది
అది ఎప్పుడు దారి ఇస్తుంది

31.12.2024 10.52 రాత్రి
బ్లాగ్ 5.9.2025

# కనుల ముందు జీవితం

మన తెలివితక్కువ లెక్కలని,
అనుభవాలని, ఊహలని, అలవాట్లని ప్రక్కకు నెట్టి
జీవితం ముందు నిలిచే సందర్భాలుంటాయి

ఆ క్షణాల్లో నీలిగగనంలో బిందువులా కనబడిన పక్షి
క్షణాల్లో మన కిటికీ రెక్కపై వాలుతుంది
కాదనుకున్నవి, కాకపోవచ్చనుకున్నవి
కనుల ముందు నిలబడతాయి ఏమి సెలవంటూ

జీవించటం చాలా కష్టం, చాలా తేలిక కూడా
టీ కప్పులో లేచే ఆవిరిలాంటిది జీవితం
జీవితం చాలా భయం, చాలా ప్రేమాస్పదం కూడా
ఆకుల మీది చీకటిపై పచ్చదనం పరిచే ఉదయకాంతి జీవితం
చాలా చేదు జీవితం, చాలా లోతైన ఇష్టం కూడా
వలలోంచి తప్పుకొని నదిలోకి జారే చేపపిల్ల జీవితం

చూస్తూ ఉండగా బాధల్లో మునుగుతాం, బరువులతో ఈదుతాం
చూస్తూ ఉండగా నవ్వుల్లో వాలుతాం, కాంతిలో తేలుతాం

ఇంతా చేసి, వలలో చిక్కుకుంటాం,
వల నీటిలో మునిగి ఉందని, నీరు భూమిపై ఈదుతుందని,
భూమి ఆకాశంలాంటి జీవితంలో
చల్లగా మునుగుతూ, తేలుతూ ఆడుకుంటుందని ఎప్పటికో మేలుకుంటాం

15.5.2025 00.16 రాత్రి, బ్లాగ్ 28.10.2025

# అతనిది

దెబ్బ తగలక ముందు ఒకలా ఉంటావు,
మాసిపోయాక కూడా అలానే,
తగిలిన సమయాన అతని పిలుపు వినబడుతుంది లీలగానైనా,
మిగిలినదంతా డొల్ల ప్రపంచం

అతను పిలుస్తారు గుమ్మంలో నుండి తల్లిలా,
ఆటల్లో వినబడదు, విన్నా పట్టదు

చాలా రాత్రులు చూస్తావు, పగళ్ళు కూడా,
ఒకటో తరగతిలోని లోకమే విశ్రాంతి కాలంలోనూ,
పుట్టినట్లే వెళ్ళిపోతావు వేల జీవితాల్లో ఒకటిగా

ఇదేమీ నిష్ఫలం కాదు కానీ,
సరస్తీరంలో బతకడానికీ, సరస్సులో మునగటానికీ,
కొంచెం తేడా ఉండవచ్చు, లేకపోవచ్చు కూడా

దెబ్బలు తగిలితే ఆగవద్దు అనటం కన్నా,
ఆయన కూడా ఏమీ చెప్పకపోవచ్చు

ఒక కలగనటానికి వచ్చావు
కంటావా, కనుమూస్తావా నీ స్వేచ్ఛ,
తరువాత కూడా మిగిలి ఉండటం అతనిది

24.9.2024 11.55 రాత్రి
బ్లాగ్ 16.8.2025

# అనుభవం

అనుభవానికి దగ్గరగా జరుగుతావు
జీవితం చాలా గడిచాక, చివరి మలుపు తిరిగి
ముగింపు దూరాన కనబడుతున్నపుడు

కలలూ, ఆశలూ కొన్ని ఫలిస్తాయి, చాలా ఫలించనట్లే
గడిచిన కాలమంతా గుప్పిటలోకి తీసుకుని
దీనిలో సారమేమైనా ఉందా అని వెదుకుతావు

గడిచిన ఊహలనీ, ఆందోళనలనీ తడుముకొని చూస్తావు
చాలా సంగతులకి అర్థం ఉండదు,
చాలా ఊహలు ఏ ఫలితం చూపకనే ఆవిరయాయి
ఎండమావులలోని నీటిలా,
మరోసారి గడిచిన కాలాన్ని జీవించే అవకాశం వస్తే
చాలా పనులు చేయవు, చాలా అనుభవాలు కోరుకోవు

ఉదయపు కాంతి దీవించిన అనుభవం,
తాజాగాలులు తాకుతూ వెళ్ళిన అనుభవం,
పూలు విప్పారుతూ ఆశ్చర్యపరిచిన అనుభవం,
పక్షి కూత గాలిలోకి పలుచని వల విసిరిన అనుభవం

వీటికన్నా అపురూపమైనవి లేవని
భయాల, గర్వాల, దుఃఖాల తర్వాత తెలుస్తుంది

చివరిమలుపులో తెలియవస్తుంది
సూర్యకాంతీ, నక్షత్రాలూ నిన్నెంత ప్రేమించాయో,

కన్నతల్లి నీలో ఎన్ని పగళ్ళనీ, రాత్రుల్నీ కలగన్నదో,
తల్లినీ, జీవితానుభవాన్నీ ఎంత నిర్లక్ష్యం చేసావో

9.4.2025 00.34 రాత్రి
బ్లాగ్ 17.10.2025

# తెలియదు..

నువు ఇవ్వటానికి పుట్టావు, తీసుకోవటానికి కాదు
ఇది అర్థమయేసరికి
జీవితం చివరి అంచుకి జరుగుతుంది

అట్లాగని తీసుకోలేదని కాదు,
తీసుకున్నట్లు తెలియలేదు
ఇది కూడా జీవితం చివరి అంచున తెలుస్తుంది

ఈ అనుభవం ఇలాంటిది
తీసుకునేవాళ్లకి తెలీదు,
ఇచ్చేవాళ్ళకి తెలియకుండా పోదు

భూమి నుండి సారం తీసుకున్న చెట్టుకి
భూమి ప్రేమ తెలీదు,
చెట్టు నుండి ఫలం తీసుకున్న మనిషికి
చెట్టు ప్రేమ తెలీదు

ప్రేమ ఎప్పటికీ
తెలియరాని విషయంలా దాగొని ఉంటుంది
ప్రేమ అంతే, అమాయకురాలు,
పొందేవాళ్ళు అంతకన్నా అమాయకులు

ప్రపంచం ఎందుకు పుట్టిందో,
సూర్యుడెందుకు రోజూ ఉదయిస్తాడో,
నీరెందుకు పంచుకొంటూ, పరుగులు పెడుతుందో

పాడే పక్షులకీ, పరుగులు తీసే జీవులకీ,
నిలబడి నిదానంగా చూసే చెట్లకీ,
వాటన్నిటిపై పారాడే ఎండలకీ, వానలకీ తెలీదు

ఉత్త ప్రేమ ఇలా వెలుగుతుందని
ప్రేమలో మునిగిన సృష్టికి తెలీదు,
ఇలా ప్రేమించటం మినహా ఏం చెయ్యాలో
దీనిని సృష్టించిన దైవానికి తెలీదు

13.5.2025 00.05 రాత్రి
బ్లాగ్ 27.10.2025

# నువ్వు నువ్వులా

నువ్వు నువ్వులా ఉండగలిగే క్షణాల ముందు
మిగిలిన నీ జీవితమంతా గడ్డిపోచ అని తెలుస్తుందా

దయ వలనో, దోషాలు ఒప్పుకునే ధైర్యం వలనో
కళ్ళలో నీళ్ళు తిరిగినపుడు
నీకు నువ్వు మాత్రమే మిగిలే క్షణాల్లో
ఎంత ప్రేమాస్పదుడిగా ఉంటావో తెలుస్తుందా

జీవితం వడ్డించిన విస్తరి కానీ, ముళ్ళబాట కానీ
నిటారుగా నిలిచి బలమైన నిట్టూర్పు వదిలినపుడు
ఏయే గగనతలాలకి విస్తరిస్తావో గమనించావా

పదేపదే పాడుతున్న పదాల సారం ఒకటే
'ప్రేమించు బ్రతికి ఉండటాన్ని'
ప్రేమించు పంచరంగుల ప్రపంచాన్ని,
పచ్చదనంగా పక్వమయే సూర్యకాంతిని,
వెన్నెలలోని వేదననీ, క్షమనీ, లాలననీ

ఏమంత సమయం కాదు
ఇక్కడ నడిచేది, నవ్వేది, ఏడ్చేది,
వెళ్ళాక పాదముద్రలు మిగిలేది లేదు

నీ కనికరం నీ సంపద, నీ నింద నీ లేమి
నీ చివరి చిరునవ్వు లోకానికి కానుక,
నీ చివరి దిగులు శాపం

ఏమంత సమయం లేదు
ఈలోపల ఊరికే ప్రేమించు
లోకం సంగతి లోకం చూసుకుంటుంది
ప్రేమిస్తావా లోకాన్ని దాటి బతుకుతావు

22.3.2024 11.49 రాత్రి
బ్లాగ్ 23.10.2024

# బందిఖానా

నిన్ను నువు మెచ్చే పనులు పదులు చేసావు,
క్షమించలేనివి వందలు చేసావు,
జీవితం ఊబిలో చిక్కుకున్నాక
ఎవరైనా ఇంతకన్నా ఏం చేస్తారు

ఎగురుదామనిపిస్తుంది, రెక్కలుండవు,
ఈదాలనిపిస్తుంది, మొప్పలుండవు,
చెట్టులా ఎదగాలి, గాలికి ఊగాలనిపిస్తుంది,
వేర్లుండవు, కొమ్మలూ, ఆకులుండవు

నిన్ను నువు కాపాడుకొనే భయాన్ని పెట్టి,
సంతోషపరచే బాధ్యత పెట్టి,
ఎవరో విశ్వంలో గింజలా పాతారు

ఊబిలోంచి వెలికి రాబోయే ప్రతి కదలికా
ఇంకా ఊబిలోకి దించుతుంది,
ఇంత పెద్ద ప్రపంచం ఇంకా నిజమై కనిపిస్తుంది,
నిజంగా తెలీదు, ఇదేమిటో, ఏం జరుగుతుందో

కాలంతో ఉక్కపోత పెరుగుతుంది,
వేడిగాలితో బరువెక్కిన మేఘం
ఎప్పుడో కుండపోతగా కురుస్తుందేమో తెలీదు

కురిసీ, కురిసీ మేఘం నీరై, గాలై, ఆకాశమై
లేకుండా పోతుందేమో తెలీదు,

లేనిదేదో ఉండటం కలలోంచి
ఉలికిపడి లేస్తుందేమో తెలీదు

27.2.2025 11.03 రాత్రి
బ్లాగ్ 25.9.2025

# విషాదం

చాలాసార్లు ఇతరుల సంతోషం చల్లార్చావు
ఉత్సవసమయాల్లో పసివాడిలా ఏడ్చి,
చాలాసార్లు వాళ్ళని కాంతివంతం చేసావు
ఉత్సవసమయాల్లో పసివాడిలా నవ్వి

ఏడుపూ, నవ్వూ తేలికగా చూడగలరు,
లోపలి పసిదనం ఎవరు చూస్తారని వెదికావు,
నువు ఒంటరివని అనుకోలేవు కాని,
వారికి ఒంటరితనం భయమంటావు

నిజంగా లోకం లేదు,
వేల కాంతివత్సరాలకి వికసించినట్లు
కనిపించే సృష్టి ఉత్త గాలిబుడగ,
మెలకువతో చిట్లిపోయే కల అని
ఎవరో చెప్పగా విన్నావు, నమ్మావు, కలగన్నావు కానీ
ఈ బుడగ చాలా ఇష్టం, బుడగ చిట్లిన ఖాళీ భయం

ఉత్త పసివాని చేష్ట మినహా
గోడకి రెండువైపులా ఒకేసారి ఉండబోయే
అలజడికి అర్థమేమైనా ఉందా

ఇదంతా అందమైనదో, కాదో తెలీదు,
ఇదంతా ఉన్నదనో, లేనిదనో,
నీకు తెలుసో, లేదో తెలీదు

ఖాళీ ఆకాశంలో ఊదే గాలిలా
ఖాళీ ఆత్మలో ఊహిస్తావు లోకాన్ని

దీనికి ముగింపు తెలీదు,
ఇతరుల్ని ఎక్కువ ప్రేమించావు,
వాళ్ళు ఉండాలని, ఉన్నారని, ఉంటారని
తెలియని లోతుల్లో తలపోశావు,
దుఃఖపు తేనెపట్టు పిండి
జీవితం చప్పరించాలని చూసావు

ఇతరులు లేరనేంత ప్రేమ నీపై నీకు లేకపోవటమూ,
ఇతరులు నువ్వే అనేంత ప్రేమ వారిపై లేకపోవటమూ
జీవితం లోతుల్లోని బలమైన విషాదం

11.2.2025 11.24 రాత్రి

# ఆ ఒక్కటీ..

ఒక్కటి మాత్రం చాతకాలేదు నీకు
ఆ నిముషంలో సంతోషంగా ఉండటం,
ఇతరుల్ని సంతోషంగా ఉండనీయటం

అలాగని, బుద్ధిహీనుడివీ, స్వార్థపరుడివీ కావు
నువు వదలలేని గాయాల భారం,
నిన్ను వదలలేని కలల తేలికదనం
నిన్ను ఈ నిముషంలో ఉండనీయలేదు

ఈ క్షణంలోకి ప్రవహించటమెలానో,
క్షణాన్ని నీలో ప్రవహింపనీయటమెలానో
సృష్టిలో ఇంతకాలమున్నా చాతకాలేదు
బడిలో చివరిబల్ల విద్యార్థిలా,
ప్రవాహంలో తోచక నిలిచిన ఎండిన చెట్టులా
జీవితాన్ని చూస్తున్నావు

ఆ ఒక్కటీ నేర్చుకుంటే చాలని
ఒడ్డున కూర్చుని ఈతలోని ఆనందాన్ని
వర్ణించినట్టు వర్ణించావు

అలాగని, మర్యాదస్తుడివీ, పిరికివాడివీ కావు
నువ్వు వదలలేని ఆలోచనల భారం,
నిన్ను వదలలేని అనుభూతుల తేలికదనం
నిన్ను ఈ నిముషంలో బ్రతకనీయలేదు

రాత్రి వెన్నెలలో పక్షి కూత కరిగిపోయినట్లు,
చీకటిలో ఇంత విశాలదృశ్యం భద్రంగా నిద్రపోయినట్లు,
ఉదయాకాశం కాంతిలోకి ఒళ్ళు విరుచుకున్నట్లు,
దుఃఖితులని చూసి దయాకమలం వికసించినట్లు

సహజంగా, సరళంగా, జీవితం కోనేటిలో
నీ బిందువులోని ఆకాశాన్ని కరిగించటమెలానో
నీకిప్పటికి చాతకాలేదు

27.3.2025 11.52 రాత్రి
బ్లాగ్ 8.10.2025

# అశక్తుడు..

రెండు తలుపుల్లో ఒకటి తెరుస్తావు, ఒకటి మూసి వుంచుతావు
సగం ఆకాశం రమ్మంటుంది, సగం గది ఉండమంటుంది
ఎటూ తేల్చుకోలేక గుమ్మంలో నిలబడతావు

నిలబడే ఉంటావు, పుట్టింది మొదలు
అనుభవాల కెరటాల్లో మునిగి, తేలి,
ఇక్కడి నుండి వెళ్ళిపోయేవరకూ

ఎన్ని చీకటి రాత్రులు తడిమాయి,
ఎన్ని పగటి కాంతులు పిలిచాయి
తమలో కరిగిపొమ్మని, కరిగి నీరైపొమ్మని,
కాంతిలా మారిపొమ్మని, శాంతిలా మిగిలిపొమ్మని

పాదాలలో పాదుకొన్న భయం
కదలనివ్వలేదు, ప్రేమలోకి ఎగరనివ్వలేదు
గాలి జాలిగా తిరిగింది వలయాలుగా నీ చుట్టూ,
గుమ్మంలో ఉండగానే కాలం ఒలికిపోయింది

వట్టి చేతులతో, వట్టిపోయిన చూపులతో
ఎవరికోసమో ఎదురుచూస్తూ ఉన్నచోట నిలుచుండి పోయావు

ఉన్నచోటును విడిచి
లోనికి వెళ్ళలేకపోయావు, బయటికి రాలేకపోయావు

23.2.2025 00.11 రాత్రి
బ్లాగ్ 23.9.2025

# ఉన్నావు కదా..

నిన్ను చూస్తే నీకు నమస్కరించాలనిపిస్తుంది
ఉన్నతుడివని కాదు, అధముడివనీ కాదు,
పరమ సామాన్యుడిలా ఉండగలిగావనీ కాదు,
నువు ఉన్నావు గనుక గౌరవం తోస్తుంది

ఉండటమనే జీవనానందం నీలోంచి ఉబుకుతోంది గనుక,
ఊయలలో పసిబిడ్డ ఉన్నట్లు, ఉండి లోకాన్ని చూసి నవ్వినట్లు,
ఉండటంలో పసిబిడ్డలా ఉన్నందుకు,
లోకం ఉండటం చూసి నవ్వుతున్నందుకు,

నిన్ను చూస్తే నీకు కొంచెం
వాత్సల్యం కలుగుతుంది, దయ కలుగుతుంది,
లోకమ్మీద ఆశ కలుగుతుంది,
రేపటి కాంతి మీద నమ్మకం కలుగుతోంది

కాంతివంతమైన వెన్నెల, గాలిలో చల్లదనం,
ఆకాశమంతా పరుచుకున్న నిశ్శబ్దం,
నీడల కింద చప్పుడు చేయక తిరిగే
నీ మెల్లని చూపులు, నీ లోపలి కోనేటినీటి జ్ఞాపకం..

ఈ క్షణంలో నువు ఉండటాన్ని
పసిబిడ్డ తండ్రిని కౌగలించుకున్నట్లు
కౌగలించుకుని నిదురలోకి జారబోతున్నాయి

10.8.2025 11.19 రాత్రి

# ఊరట

ఒక పిట్ట ఉత్తరాకాశపు అంచులో తేలి,
నీ మీదుగా లెక్కలేకుండా ఎగిరి,
దక్షిణాకాశపు అంచులో మునిగినట్లు

ఈ లోకంలోకి ఒక కాలంలో తేలి,
లోకం మీదుగా లెక్కలేకుండా ఎగిరి,
ఒక కాలంలో మునిగిపోవటం కన్నా
ఇక్కడ బ్రతికి, వెళ్ళటానికి
అర్థాలూ, పరమార్థాలూ ఏముంటాయి

ఇన్ని రంగుల ప్రపంచం,
ఇన్ని వెలుగుచీకట్ల, మిలమిలల,
దాగుడుమూతల ప్రపంచం కన్నా
ప్రాణంగా ప్రేమించాల్సిన అనుభవమేముంటుంది

ఊరికే పుడతాం మంచులో జారిపడినట్లు,
అదాటున నీటిలోకి మునిగినట్లు,
కలలోనో, ఊహలోనో గాలిలోకి తేలినట్లు,
నీరెండవేళ తేయాకు తోటలో రికామీగా తిరిగినట్లు,

సౌందర్యవతి ముఖాన్ని చంద్రోదయానికి అర్పించినట్లు,
చేప గగనాన్ని పలకరించి నదిలో మునిగినట్లు,
భూమి సారం పూలరేకులుగా విప్పారి
గాలిని మృదువుగా తాకి సెలవు తీసుకున్నట్లు,

తటాలున లోపలినుండి చిరునవ్వు మెరిసి
జీవితమేమీ కారుమేఘం కాదులే
భయపడకని హామీ ఇచ్చి మాయమైనట్లు

మన ప్రమేయం లేకుండా వచ్చినంత
తేలికగా వెళ్ళిపోతాం, ఏముంటుంది
లోపలి దిగులంతా శీతలగాలికి ఇచ్చి వేసి
రాత్రి గర్భంలోకి ముడుచుకుపోతే చాలు,

అయితే తెల్లవారుతుంది, లేదూ, తెల్లవారదు
అంతకన్నా ఏముంటుంది

22.11.2024 10.34 రాత్రి
కవిసంధ్య సెప్టెంబర్ 2025

# నువ్వూ - ప్రపంచమూ

నువ్వనుకుంటావు ఇది చేసానని
పని అనుకుంటుంది ఇతనితో చేయించానని,
ఇది నేను పొందాననుకుంటావా
ఇతని ద్వారా ఉనికిలోకి వచ్చానంటుంది అనుభవం,

నీకు స్వంతమయేవి ముందుగా నిన్ను స్వంతం చేసుకుంటాయి,
యజమాని ముందు ప్రేమ నటించే బానిసలా
నీ ముందు అణగివుండి, లొంగదీసుకుంటాయి

నువు తలక్రిందులుగా లోకంలోకి జారాననుకొంటావు గానీ
నీలోకి లోకం తలక్రిందులుగా చొరబడింది

లోకాన్ని నువ్వూ, నిన్ను లోకమూ చేయగలిగిందేమీ లేదు,
ఒకేచోట తిరుగాడే గాలిదీ, కాంతిదీ
వేరువేరు ప్రపంచాలైనట్లు, ఒకదాని నొకటి ఏమీ చేయలేనట్లు,

నీదీ, ప్రపంచానిదీ వేరువేరు ఉనికి
ఇది తెలిసాక, మాష్టారిని చూసిన పిల్లల్లా
ఒకరితో ఒకరు ఆడుకోవడం మాని,
ఎవరి స్థలంలో వాళ్ళు బుద్ధిగా కూర్చుంటారు
నువ్వూ, ప్రపంచమూ

13.2.2025 11.12 రాత్రి
బ్లాగ్ 21.9.2025

# లెక్కచేయటం

ప్రపంచం చాలా చెబుతుంది
ఇలా బ్రతకాలి, అలా కాదని,
అవి అంతగా లెక్క చేయనవసరంలేదు

తోచినట్టు బ్రతుకు, అనుభవించు,
మాట్లాడు, పని చెయ్యి,
నువ్వు నీలా ఉండగలిగితే చాలు

ఏది చేస్తున్నపుడు నిన్ను ప్రేమిస్తావో అది నువ్వు,
ఏది అనుభవిస్తున్నపుడు
నీకు దగ్గరగా తోస్తావో అది నువ్వు

జీవితం మరీ క్రూరం కాదు
మతగ్రంథాలు భయపెట్టినట్లు,
రాజశాసనాలు నిలదీసినట్లు

అది కొండవాగుల్లోని నీటిలా స్వచ్ఛం, సరళం,
తెలికాంతిలా శుభ్రం, ఆశావహం

నిజానికి, జీవితాన్ని నువు రక్షించటం లేదు,
తానే నిన్ను రక్షించుకుంటుంది
ఈ రహస్యం తెలిస్తే చాలు,
పదబంధ ప్రహేళిక నింపి పేజీ త్రిప్పవచ్చును

26.1.2025 11.36 రాత్రి

# లోపలికి

కొలతలకి లొంగకు, లెక్కల నుండి ఎగిరిపో
లొంగనట్టు కనబడటానికి కూడా..
అప్పుడు మేలుకొంటావు
నిశ్శబ్ద, రహస్య, ప్రశాంత తటాకం ఒడ్డున

సీతాకోకలు
నిన్ను పట్టించుకోకుండా ఎగురుతుంటాయి,
పిట్టల పాటలు దూరాలకి పిలుస్తుంటాయి,
తటాకంలోని నీటి తడి
జన్మల మాతృప్రేమలా తాకుతుంది,
ఇక నిన్ను పూర్తిగా మాయం చేయగల
ప్రియురాలి కోసం ఎదురుచూస్తావు

కలలు కంటే తప్పేమిటి
లోకం కల అయినపుడు
ఆదర్శాలూ, విజయాలూ, విరామాలూ
కళ్ళ ముందు కరిగిపోతున్నపుడు

కలలు రాలిపోతే గాయాలెందుకు
ఒక సూర్యోదయం
నువు లేని రోజున కూడా జరగబోతున్నపుడు,
గాలి వీయబోతున్నపుడు,
మనుషులు ఎప్పటిలానే ఈదబోతున్నపుడు

ఇదంతా బావుంది, బావోలేదు కూడా,
ఇదంతా ఉన్నట్లుంది, లేదేమో కూడా
కొంచెం తడిగా ఉండటం మినహా
ఇక్కడ వేరేదీ చేయదగింది లేనట్లుంది

బహుశా, అతను ఉన్నాడు,
ఇంత ప్రపంచం అతనికి
రాలుతున్న ఎండుటాకు పాటి కాకపోవచ్చు,
అప్పుడు నీ బరువుకి అర్థమేమిటి

బహుశా, అతనే నీలా ఉన్నాడు
ఇప్పుడు నువు చేయవలసింది
ఏమైనా మిగిలి ఉందా ఇక్కడ

24.9.2024 11.00 రాత్రి
కవితా ఫిబ్రవరి 2025

# అంతే..

దేనినీ నమ్మకు, అర్థం, అనుమానించమని కాదు,
నమ్మటంలానే అనుమానించటం ఒక బలహీనత
ఊరికే ఉండు ఏమీ తెలియనట్లు
నిజంగా తెలియదు నీకైనా, నాకైనా

ఊరికే ఉండడం కన్నా
క్షేమమైన దారేదీ లేదనుకుంటా ఇక్కడ,
క్షేమం అంత అవసరమా అని ప్రశ్న,
జవాబు తెలిస్తే వేయిలోకాలకి ఒకేసారి తెరుచుకుంటావు

స్వేచ్ఛలోకి వెళ్ళటం ఉన్మాదమా అంటావు భయంగా,
దయా, స్వేచ్ఛా ఏకమైన లోతుల్లో
ఆరోగ్యముంది నిజంగా అని వింటావు

ఎలా వెళ్ళాలి అంటావు జాగ్రత్తగా,
దూకెయ్యి అని వినవస్తుంది,
వెనుదిరుగుతావు, నీపై జాలిపడుతూ

ఈ అద్భుతమైన రాత్రిలానే
రేపటి అద్భుతమైన ఉదయం
నీ కోసం ఎదురుచూస్తుంది
ఎప్పటిలానే నమ్మకంతో, దయగా

20.9.2023 11.22 ఉదయం
ఈమాట.కాం నవంబర్ 2023

# ఉండటం

దీనికి అర్థముందని నమ్మటం నుండి బయటపడాలి
ఆర్థాలకి అర్థమేమిటి, ఈ నమ్మకాలకి మొదలేమిటి

చివరికి మంచి గెలుస్తుందనే చిన్నప్పటి భ్రమ వదిలించుకోవాలి,
ఏ చివర, ఎవరికి మంచి, ఎంతకాలం గెలుస్తుంది

ఈ కథకి ముగింపు ఉంటుందనే ఉద్వేగం నుండి తెప్పరిల్లాలి,
మగతనిద్రల్లోని కలలు ఎక్కడ ముగిశాయి

తలపై బుడగలా ఎగురుతోంది గగనం
మన తలల్లోని ఊహల్లాంటివి ఎందరిలో, ఎన్నిటిని చూసింది

కాంతినీ, చీకటినీ విరజిమ్మి, రంగుల్ని శూన్యంలో ఆరబోసి,
చివరికి ఏమీ కాకపోవటంలో విశ్రమిస్తోంది

ఊరికే ఉంటే చాలనుకొంటాను
ఆకు కింద నీడ ఉన్నట్లు,
ఎండలో రంగులు ఉన్నట్లు,
చీకటిలో నలుపు ఉన్నట్లు

ఈ అక్షరాల వలలోంచి బయటకు వెళ్ళాక
ఏది మనసుకి తగులుతుంది, లేదా తగలటం లేదు

28.7.2024 11.21 ఉదయం
పాలపిట్ట, నవంబర్ 2024

# జాగ్రత్త

మనకు తెలిసినదాని కన్నా
మరికాస్త మంచు కురిస్తేనో, నీరు కదిలితేనో, గాలి వీస్తేనో,
కూలిపోయే చీమల పుట్ట యుగాలుగా నిర్మించిన నాగరికత

అపుడు కూడా ఏ మొక్క నుండో లేత చిగురు
సూర్యకాంతిలోకి తెరుచుకుంటుంది చూడు,
ఏ ప్రాణికో పుట్టిన పసిజీవం
మృదువుగా గాలిలోకి చలిస్తుంది చూడు,
అక్కడ దాగి వుంటుంది జీవితం మనవైపు నవ్వే చిరునవ్వు,
మృత్యువు లోపలి కరుణ

లోకమేమీ డొల్ల కాదు, మనుషుల్లా,
చెట్లూ, పుట్టలూ, ఆకాశమూ, మబ్బులూ,
కెరటాలు హోరూ, దుఃఖితుల కన్నీరూ చెబుతాయి

బిడ్డా, జాగ్రత్త, జీవితం గాజు కన్నా అల్పం,
పూల కన్నా ప్రార్థనా స్థలం,
ఎగిరే సీతాకోక రంగుల కన్నా ప్రేమాస్పదం

జాగ్రత్త కన్నా,
జీవితం నీ ప్రేమకోసం ఏడుస్తున్న నీ తప్పిపోయిన శిశువు

27.9.2024 11.17 రాత్రి
బ్లాగ్ 17.8.2025

# మిగులుతావు..

జీవితోత్సవం ప్రక్క నుండి దూసుకుపోతుంది
దూసుకుపోయే రైలులా,
పగళ్ళూ, రాత్రులూ దూసుకుపోతాయి

పూలూ, వర్షాలూ, పిట్టలూ, మనుషులూ,
నవ్వులూ, ఏడ్పులూ, భయాలూ, ప్రేమలూ,
ఇరుకు గుహలూ,  విశాలాకాశాలూ,
చలిగాలులూ, ఉక్కపోతలూ, ప్రక్కనుండి దూసుకుపోతాయి,
నీమీది నుండి వెళుతున్నట్లు వెళ్ళిపోతాయి

నీకు నువ్వు తప్పిపోతావపుడు
తేరుకొని చూస్తే, వెళ్ళేవి వెళ్ళగా నీకు నువు మిగులుతావు,
ప్రక్క నుండి దూసుకుపోయిన రైలు
కూతతో సహా చుక్కలా మాయమౌతుంది

నీకు నువ్వే మిగులుతావు ఎడారిలో నీటిచెలమలా,
చీకటిలో దూరంగా ఒంటరి దీపంలా,
మేఘాలు వెళిపోయాక తీరికగా రాలే చినుకులా,
పీడకల చివర వ్రేలాడే నీ స్వప్నబింబంలా

జీవితోత్సవం
దూరపు ఆకాశంలో ఉల్కలా రాలి అదృశ్యమవుతుంది,
ఎప్పటి నిన్ను, ఎప్పటి నీకు, ఎప్పటికీ విడిచిపెడుతూ

12.8.2025  10.28  రాత్రి

# చూస్తూ ఉండగా..

చూస్తూ ఉండగా కాలం చివరికొస్తుంది,
పలు సంధ్యలు పూలలా రాలిపోతాయి,
పలు చందమామలు ఉదయాల్లో కరిగిపోతాయి,
పలు వర్షాలు కురిసి, కురిసి
వెలిసిపోతాయి గోడలమీది చిత్రపటాల్లా

ప్రేమ నిండిన స్పర్శలు, కాంతి నిండిన నవ్వులు,
తడి నిండిన బంధాలు
చూస్తూ ఉండగా పొడిబారిపోతాయి,
శరదృతువులోని నిండైన నదులు
గ్రీష్మంలో ఒడిలిన దేహంలా చిక్కిపోతాయి,
నదులు కలలాగా మిగులుతాయి,
నదిచుట్టూ మొలకెత్తిన జీవితాలు కలలవుతాయి

కాలం చివరికొస్తుంది, కలలు చివరికొస్తాయి,
దుఃఖాలు చివరికొస్తాయి, బ్రతుకు భయం చివరికొస్తుంది

ఇక మిగిలింది విస్తరించిన ఆకాశం,
ఆకాశంగా విస్తరించిన అనంతం,
అనంతంగా విస్తరించిన అనూహ్యం,
అనూహ్యంలోంచి పిలిచే చివరి బిందువు

చూస్తూ ఉండగా
సాయంత్రపు కాంతి మరుగుపడుతుంది,

స్పర్శలు, నవ్వులు, బంధాలు మరుగుపడతాయి,
స్వర్గమో, నరకమో తెలీని
ప్రపంచానుభవం ముగింపుకొస్తుంది

చూస్తూ ఉండగా, గాఢమైన దిగులులోంచి
కాంతివంతమైన మృత్యుపుష్పం
నీ ముందు దయగా విచ్చుకుంటుంది

30.7.2025 00.01 రాత్రి

# జీవితానుభవం

జీవితానుభవం రెండు ఆకాశాల మధ్య
అలవోకగా తప్పించుకునే దేవకన్య
ఇది జీవితమంటావు, తప్పుకుంటుంది,
జీవితం కాదంటావు, తప్పుకుంటుంది
సులువుగా, నవ్వుతూ

జీవితానుభవం ఇలాంటిదని చెప్పలేవు,
అలాగని దానికోసం వెదకటం మానలేవు
ఉదయాస్తమయాలు రంగులలో పలకరిస్తాయి
ఇవాళైనా తెలుస్తుందా అని ఒకటి,
ఇవాళైనా తెలిసిందా అని మరొకటి

జీవితానుభవం
మసకచీకటిలో దాగిన ప్రియమైన వ్యక్తిలా
నిను కవ్వించి మాయమవుతుంది,
చీకటి నీడల్లోకి చేతులు చాపి పట్టుకోబోతావా
ఖాళీ ఆకాశం తగులుతుంది

జీవితం దుఃఖం, జీవితం ఆనందం
జీవితం భయం, జీవితం ప్రేమ

ఇష్టదైవంపై మోజు పడిన భక్తుడిలా
జీవితంపై మోజుపడి తల్లడిల్లుతావు

బహుశా, ఇంతా చేసి,
నిన్ను నువ్వు పట్టుకోబోతావు,
నీ నీడని కౌగలించుకోబోతావు,
నీలోకి నిన్ను చెరిపేసుకోబోతావు

నీలోపలి శూన్యంలోకి
నిన్ను విసిరేసుకోవటమెలానో
తెలియక వెర్రిగా చూస్తావు

27.3.2025 00.48 రాత్రి<br>బ్లాగ్ 9.10.2025

# ఒకటే జీవితం

జీవితమంతా ఒకటే
దీనిని విశ్వంగా, భూమిగా విడదీయవచ్చును

కొండలుగా, నదులు, అడవులు, నగరాలుగా,
ఉదయమూ, పవలూ, సాయంత్రమూ, రాత్రులుగా,
వాసంత, గ్రీష్మ, వర్ష, శారద, హేమంత, శిశిరాలుగా
బాల్య, కౌమార, యవ్వన, వృద్ధాప్యాలుగా
అనేక రేఖలతో, కొలతలతో, ఛాయలతో
నువు జీవితాన్ని గ్రహించి ఉండవచ్చును

భయాల, కోరికల, అనుభవాల లోంచి
తెలుసుకొంటూ, మరిచిపోతూ ఉండవచ్చును
ఇదంతా ఒకటే, సాగుతున్న గానం ఒకటే,
కవిత ఒకటే, నాట్యం, నటన ఒకటే,
రంగుల్లో విరజిమ్మే తెల్లనికాంతి ఒకటే,
కాంతి పరుచుకున్న స్థలం ఒకటే

జీవితం ఒకటని తెలియకపోతే తప్పేమీ కాదు,
తెలియటం ఒప్పూ కాదు,
తప్పు, ఒప్పుల కావల వెలిగే జీవనానందం ఒకటే

నువు జీవితం భాగానివి కాదు, జీవితానివి
ఇంతకన్నా ఈ రాత్రికి చెప్పేదేం లేదు

26.4.2025 11.51 రాత్రి

# ఉత్త ప్రేమ

ఇంత ప్రపంచంలో ఒక భాగం కాక,
ప్రపంచం నువ్వే అయిన అనుభవానికి వస్తావు

మసక చీకటిలోనో, మగత నిదురలోనో,
మైకమో, మైథునమో, ధ్యానమో నీ నుండి నిన్ను రాల్చిన క్షణంలోనో
ప్రపంచం గాలిలో దూదిపింజలా ఎగురుతుంది,
బరువైన జీవితం కొలనులో ప్రతిబింబమై తేలుతుంది,
గాయపడిన హృదయం వేకువలో నాటిన కాంతిలా మొలకెత్తుతుంది

చాలా చూసావు, ఏడ్చావు నిజంగా,
చాలా నవ్వావు నిజంగానో, నటనగానో
కానీ విలవిలలాడావు, ఒడ్డుకి దొరికిన చేపలా అల్లల్లాడావు

ఇంత ప్రపంచంలో ఒక భాగం కాక,
ప్రపంచం నువ్వయిన అనుభవముంది చూసావా

దాని ముందు నీ దుఃఖమంతా
పూవు విచ్చుకోక ముందు దానిలో దాగిన చీకటి,
సీతాకోక రంగుల ఆటలకి ముందు దాగిన చిక్కని ఏకాంతం,
మధురగానానికి ముందు సవరించుకునే కంఠధ్వని

జీవితం ఉత్త ప్రేమ,
దుఃఖమంతా రహస్యం రాల్చిన ఎండుటాకులు

20.4.2025 11.09 రాత్రి, బ్లాగ్ 23.10.2025

# చేతన చివరల..

నీ జీవితం చాలా చిన్నది, ప్రపంచం చాలా పెద్దదని కదా
లోపలి స్వరం బాల్యం నుండీ చెబుతున్నది, నువు నమ్మినది

ఉన్నట్లుండి ఒకమాట వినవస్తుంది,
నీ లోపలి నుండో, వెలుపలగా తోచే లోపలి నుండో,
ఈ ప్రపంచం చాలా చిన్నది, నువు చాలా పెద్ద అని

అప్పుడు మొదలుపెడతావు
ఆశతో, దుఃఖంతో, దుఃఖంతో, ఆశతో
నిరంతరాయమైన వెదుకులాట
జీవితం ఎంతయినా గడవనీ,
మతిలేనివాడని లోకం నవ్వనీ, ఎంత దుఃఖం, భయం ఒలకనీ,
రహస్యం కోసం తహతహలాడుతావు

ఇంతాచేసి, ఇన్ని జీవులని వదలని ఆశా, భయమే నిన్నూ నడిపిస్తాయి,
నువు నమ్మిన శిఖరాలకి, వారిని వారి శిఖరాలు నడిపినట్లు

జీవితం, నిజంగా చిన్నదా, పెద్దదా
నీ జీవితం ఒకటే ఉన్నదా, లేనిదా
నీ తలపై ఎగిరే నక్షత్రాలను, సూర్యుని
నువు మాత్రమే చూస్తున్నావా, ఇతరులూ ఉన్నారా

ఎక్కడి నుండి ఎక్కడికి
ఎవరు ఇక్కడ, ఇప్పుడు, ఇలా..

21.10.2025 11.21 రాత్రి

# అసంపూర్ణం

వెలుగు, నీడలు కదా కావలసింది,
మధ్యలో అర్థాల గొడవేమిటి అంటుందామె

నిజమే, అర్థాలు బరువు, వెలుగు, నీడలు తేలిక
తేలికగా ఉండొచ్చు గదా అని బ్రతిమాలుతుంది

తేలికగా ఎందుకుండలేవు,
బరువైపోయి ఏం సాధిస్తావని
ఆకాశం పర్వతాన్ని అనాదిగా అడుగుతూనే ఉంది

జవాబు దొరికితే పర్వతం అక్కడుంటుందా,
మేఘంలా ఎగిరి, ఆకాశంలో కలిసిపోదా

ఆమె ప్రశ్న యుగాలుగా అర్థం గాక కదా
నువు ఆమె కాలేక మిగిలిపోతున్నది

11.7.2025 10.54 రాత్రి

# ఆటలో పడి..

కుదురుగా ఉన్న సృష్టి
తనని ఖాళీ అద్దంలో చూసుకుంది,
అందంగా లేననిపించి
ఇద్దరిగా మారింది ఆమె, అతను

తాను నిండుగా లేననిపించి,
ఒకటి కావాలని చూసింది,
వారి మధ్య ప్రేమగా మారింది

అప్పుడు మొదలుపెట్టింది ఆట
ఇసుకగూడు కట్టడంలో మునిగి
స్థలకాలాలు మరచిపోయిన పిల్లల్లా

ప్రేమలోని అనంతమైన ఛాయల్ని
ఊహించటంలో మునిగి
బయటికి రాలేదు ఇప్పటికీ

ఎంత నవ్విందో,
ఎన్నింతలు ఏడ్చిందో తెలియదు కానీ,
ఇసుక గూటిని విడిచి
ఇప్పట్లో తాను రావాలనుకున్నా రాలేదు

18.12.2024 10.22 రాత్రి
బ్లాగ్ 29.8.2025

# వెనుదిరిగి చూసినపుడు

వీడ్కోలు తరువాత, ఎవరో పిలిచినట్లు
ఇద్దరూ ఒకేసారి వెనుదిరిగి చూస్తారు

అపుడు వారిమధ్య తొలకరివానల మట్టివాసనలు వీస్తాయి,
పూవులింకా వికసించక ముందరి
ఉదయకాంతులు పారాడుతాయి

అనాదికాలపు దయ అలలా హృదయాల్ని తాకుతుంది,
నల్లరేగడి నేలలోంచి కొంచెం పచ్చదనం
ఆకాశంవైపు తొంగి చూస్తుంది

వారు తొలిసారి కలిసిందే మళ్ళీ కలవటానికనే భావం
కిటికీలు తెరిచినప్పటి కాంతిలా లోపలికి దుముకుతుంది

తరువాత ఏమైనా కానీ, చివరికేమైనా కానీ,
మనుషులిద్దరు తొలిసారి
వెనుకకు తిరిగి చూసుకొన్నపుడు

వారు మామూలు మనుషులు కారు,
మామూలు ప్రాణులు కారు,
వారి మధ్య పాలపుంతలు
కలగనే సఖ్యత ఏదో ఒకసారి వెలిగి ఆరుతుంది

20.12.2024 11.07 రాత్రి
బ్లాగ్ 30.8.2025

# ఇంతేనా

ఇంత విశ్వంలో ఇద్దరే ఉన్నారనుకుందాం
అతను. ఆమె.
ఈ ఊహకి జీవం రావటానికి
అతను లేక ఆమెను నేనుగా ఊహించుదాం

మెత్తని భూమీ, పచ్చదనం
చల్లని నీరూ, నల్లదనం
తేలిన ఆకాశం, తేలుతున్న నీలిమా
చిక్కబడుతున్న రాత్రీ, చుక్కల్లో దాగే కాంతీ

కాస్త ఆకలీ, కాస్త ఆహారం
కాస్త కోరికా, కాస్త సౌఖ్యం
కాస్త భయం, కాస్త మరపూ

ఏమీ తోచని పగటిభాగంలో
గాలిలో వారూ, వారిలో గాలీ
ఏమీ అవసరం కాని రాత్రిభాగంలో
చీకటిలో వారూ, వారిలో చీకటీ

రోజులు గడుస్తాయి
నెలలు, ఏడాదులు, వయసులు
పుట్టడం తెలీకుండా పుట్టినట్లే
వెళ్ళటం తెలీకుండా వెళ్ళిపోతారు

భూమి ఉందో, లేదో తెలీదు
నీరు ఉందో, లేదో తెలీదు
ఆకాశమూ, చుక్కలూ తెలీదు
జీవితం ఉందో, లేదో తెలీదు

అలాంటిదొకటి గడిచిందని తెలీదు
ఉత్త ఖాళీ, ఖాళీ కూడా తెలీదు

కదా.. ఇప్పుడేం చేద్దాం

30.8.2024 10.48 రాత్రి
ఈ మాట.కాం నవంబర్ 2024

# ఇక్కడి అందం

ఇక్కడ అందమేమైనా ఉంటే
ఆమె, అతను కలుసుకోవటం,
ఆమె అతనిలో, అతను ఆమెలో కరిగిపోవటం,
ఒకటే ఆనందబిందువుగా మొలకెత్తడం

ఇది దేహాల కథలా కనిపిస్తుంది కానీ
అంత తేలిక కాదు, అంత బరువూ కాదు,
కనరాని ఒకే కాంతి
వెలుతురూ, చీకటిలా విడిపోయిన వ్యథ

దేహాల కన్నా లోపల,
హృదయాల కన్నా లోపల, ఉనికి కన్నా లోపల
ఒకే ఆనందం తనని రెండు చేసుకొన్న ఆట,
రెండైన నిండైన దుఃఖంతో ఒకటి కావాలనే క్రీడ

ఎంత అందం, ఎంత దుఃఖం ఈ ఆటలో
పగటిలోకి రాత్రి విరిగిపడిన దుఃఖాలు,
రాత్రిలోకి పగలు చొరబడిన ఆనందాలు
ఇది దేహాల కథలా తేలుతుంది కానీ
లోతులు తెలియరాని సముద్రం,
రంగుల లోకాలకి అందని కాంతిబిందువు

ఇక్కడ అందమేమైనా ఉంటే అది
అతను ఆమెనీ, ఆమె అతన్నీ తొలిసారి చూడటం,

చూసినంతనే పురాతన సంగీతం గాలిలో మేల్కొనటం,
ఉదయపు కాంతిలో ఏవో లోకాలు దర్శనమీయటం

ఇక్కడ అందమేమైనా ఉంటే, దుఃఖమేమైనా ఉంటే
ఏకైక సృష్టి అతనుగా, ఆమెగా విడివడి
ఎదురుపడటం, ఆశ్చర్యపడటం..

16.7.2025 00.10 రాత్రి

# ఒకరికొకరు

అతని ముఖంలోకి చూసేటపుడు,
ఆమె ముఖంలో ప్రత్యూష కాంతి ఉంటుంది,
నిర్మలమైన చల్లని గాలులుంటాయి,
అర్ధరాత్రి కురిసే వెన్నెల ఉంటుంది,
మెల్లగా పూలలా రాలే చినుకులుంటాయి

ఆమె ముఖంలోకి చూసేటపుడు,
అతని ముఖంలో చలిమంట వెలుగుంటుంది,
చల్లనిగాలుల పూతరేకుల శబ్దాలుంటాయి,
వెన్నెలలో వినిపించి, ఆగే పిట్టపాట ఉంటుంది,
చినుకుల్లో మాయమయే ఇంద్రధనువులుంటాయి

ఆమె అతని ముఖంలోకి నమ్మకంగా చూసినపుడు,
అతను ఆమె ముఖంలోకి దేహం విడిచి దుమికినపుడు,
వారిలో పాలపుంతల విశాలత్వం ప్రతిఫలిస్తుంది,
కాలాల కావలి నిశ్శబ్దం మేలుకొంటుంది

వారొకరికరం చాలనుకున్నపుడు, జీవితం ఫలవంతమౌతుంది,
కొత్త ఆశలు లోకంలోకి కాంతులీనుతూ ప్రవేశిస్తాయి

ఒకరి ముఖంలో ఒకరేమి చూసారో,
వారిని వెలిగించిన దేవతలు చెప్పలేక నవ్వుకుంటూ వెనుదిరుగుతారు,
నీటిబుడగపై తిరుగాడే రంగుల ప్రపంచం
వారిని దీవించి కాలగర్భంలో కలుస్తుంది

14.9.2025 10.50 రాత్రి

# అద్వైతం

ఎంత స్వేచ్ఛగా, ఎంతగా హృదయం లోంచి..
ఇవే కదా మౌలిక ప్రశ్నలు అంటుందామె
అవునంటావు, చేతులు మృదువుగా పట్టుకొంటూ
కాలం మీ మధ్యకు రావటానికి జంకుతూ వుంటుంది

సాంద్రమైన, స్వచ్ఛమైన ఒక్క జీవితానుభవం చాలదా
బ్రతుకంతా వెలగటానికి అంటుంది,
చాలునంటావు, ఆమెను ఆశ్చర్యంగా గమనిస్తూ
నీలోని లోభి వెలుతుర్లో కరిగిపోతూ వుంటాడు

నువు నా ప్రక్కనే ఉన్నావు, ఇంతకన్నా ఏమీ వద్దు అంటుంది
భుజంపై తలవాల్చి, కనులు మూస్తూ,
మాటలు రాక ఉండిపోతావు,
నీపై నీకే ఎన్నడూ లేని గౌరవంలోకి కనులు తెరుస్తూ

మీరు ఇద్దరు, మీ చుట్టూ ఒక ప్రపంచం
నేలతో, గాలితో, ఆకాశంతో వెలుగుతూ, తేలుతూ,
మౌనంలోకి మిమ్మల్ని జారవిడుస్తూ

ఇద్దరూ ఒక్కరే, ప్రపంచం ఎప్పుడో పక్షిలా ఎగిరిపోయింది,
తెలియరాని గగనంలో కరిగిపోతోంది
బహుశా, ఒకనాటికి ప్రపంచం తాను ఎన్నడూ లేనేలేనని
తెలుసుకుంటుంది, నీలోంచి, ఆమెలోంచి

16.7.2024 9.49 రాత్రి
ఉదయిని.కాం 1.12.2024

# ప్రేమ ఉంటే..

ప్రేమ ఉంటే పెద్దగా చెప్పటానికేమీ ఉండదు
మాటలన్నీ మంచుముక్కల్లా ప్రేమలో కరిగిపోతాయి

పూలరంగులు వెలుగుతాయి,
నక్షత్రాలు అనంతాన్ని విరబూస్తాయి,
స్పర్శ జీవితాన్ని సారవంతం చేస్తుంది

ప్రేమ ఉంటే ఇదంతా బాగుంటుంది
బాగోనిది చూపులకి అందకుండా తప్పుకుంటుంది

ఇంతా చేసి, సూర్యోదయంలోకి కనులు తెరిచినపుడు
ఇవాళైనా ప్రేమలోకి తెరుచుకుంటానా అని
ఊరికే దిగులు పడతావు

జీవుల చూపుల సారం ప్రేమ కోసం ఎదురుచూపు,
భయాలూ, కోరికలూ ప్రేమ దక్కక చేసే వెర్రి పనులు

ఈ రాత్రి ఆమె అతన్ని ప్రేమిస్తే,
ఈ పగలు అతను ఆమెని మోహిస్తే
అంతకన్నా ఉదయాస్తమయాలకి అర్థమేమిటి

కాలం చేసే ధ్వనులు కలవరపెడుతున్నపుడు
కాలంగా ప్రవహించే మౌనం కనిపెట్టుకు ఉంటుంది

కాస్త ప్రేమించు, అంతా సర్దుకుంటుందని
కాలం చెప్పకనే చెబుతుంది

ప్రేమ ఉంటే లోపలేదో నిండుతుంది
దూరరేఖపై వాలే సూర్యకాంతి
"జీవితం ఎంత అందమైనదో
ఇవాళైనా అర్థమయిందా" అని
దయగా, లాలనగా అడుగుతుంది

30.5.2025 00.41 రాత్రి
సారంగ 1.7.2025

# ప్రేమ కథ

కొత్తగా మేలుకొన్న స్త్రీ
కొత్తగా మేలుకొన్న పురుషుడిని ఆకర్షించినపుడు

అతను ఆమెతో అన్నాడు
నిన్ను కదా ప్రేమిస్తున్నాను,
ఇకపై జీవితమంతా నీతో గడపాలనుంది,

ఆమె ఏమీ మాట్లాడలేదు,
నవ్విందో, లేదో తెలీదు, ఆమెకి కూడా,
సూటిగా చూసింది
అతని కన్నులలోకి, కలల్లోకి, కాంతిలోకి,
తరాలుగా స్త్రీ పురుషుణ్ణి చూస్తున్న చూపు

అతను వెదికాడు
ఆమె కళ్ళలో ప్రతిఫలించే పురాస్మృతుల్లో
యుగాలుగా పురుషుడు స్త్రీలో వెదుకుతున్నది

ఆమె సరేనన్నదో, లేదో తెలియలేదు,
ఏమనాలో ఆమెకే తెలియనట్లు

సరేనని వినలేని దుఃఖంతో అతను,
అనలేని దుఃఖంతో ఆమె,
కొత్తగా మేలుకున్న భారమైన రోజుల్లోకి ఇద్దరూ

. . .

ఉదయాస్తమయాలు
జీవుల్ని మేల్కొలిపి, జోకొడుతున్నాయి,
చీకటివెలుగుల దాగుడుమూతలాటలోకి
తెలియని ఖాళీలోంచి వచ్చేవారు వస్తున్నారు,
ఖాళీలోకి వెళ్ళేవారు వెళుతున్నారు

. . .

కాలం పండిన
ఒక సాయంసంధ్యవేళ వారు ఎదురయారు
ఆమె చూపులో స్త్రీ లేదు,
అతని చూపులో పురుషుడు లేడు

కాలం, కలలూ రాలిపోయిన శాంతిలో
ఒకరినొకరు చూసినపుడు,
ఒకే జీవనానందంలో
ఎపుడూ కలిసే ఉన్నట్లు కనుగొన్నారు

3.11.2024 10.05 రాత్రి
బ్లాగ్ 20.8.2025

# భయపడతాం

“భయపడ్డాను” అంటుందామె
సినిమా చివర, ప్రేమించానని చెప్పడానికి

భయపడతాం ప్రేమించడానికి,
ప్రేమించినవాళ్ళని తాకడానికి,
వెన్నెలని చూడటానికి,
గాలి వీస్తే ఎండుటాకులా ఎగరటానికి,
ఇది కదా జీవితమనే ఉద్వేగాల్లో తప్పిపోవటానికి,

పిల్లల సంకెళ్ళు విప్పి ఎగరమని చెప్పటానికి,
కరుణ నెడుతున్నా చేతిలోవి ఇచ్చేయటానికి,
అదాటున అన్నీ విడిచి, బాటవెంట నడవటానికి,
తెగిన గాలిపటమై ఎగిరిపోవటానికి,
కీకారణ్యంలోకి ఒంటరి కిరణమై జారటానికి,
దుఃఖితుల్ని మనసారా కౌగలించటానికి

భయపడతాం మరేం చేయాలో తోచక,
మరోలా ఉండలేక,
భయంలో కాపాడేదేదో ఉందనిపించి,

ఊరికే భయపడతాం,
భయం నుండి ద్వేషమై, కపటమై మొలకెత్తుతాం,
భయం ఒంటెపై నిస్సారమైన ఎడారుల్లో తిరుగుతాం,

భయమెందుకు కన్నా,
సముద్రంలో అలలా నువు ఉన్నది నాలోనే
అని జీవితం చెబుతున్నా,

ఎందుకో తెలియకుండా భయపడతాం,
ఎందుకో ప్రేమించటం మరచిపోతాం,
నిండుదనం నుండి వెలితిలోకి
గబగబా నడిచి వెళ్ళిపోతూవుంటాం

28.8.2025 11.50 రాత్రి

# ఇద్దరు

వాంఛ కన్నా లోతుగా,
మోహం కన్నా, స్నేహం కన్నా మరింత లోతుగా
ఆమె అతన్నీ, అతను ఆమెనీ కోరుకుంటారు చూసావా

అపుడు, మబ్బుల్లో చందమామ తెరుచుకొంటుంది,
గాఢాంధకారంలో దీపపుష్పం విచ్చుకొంటుంది,
వేగిపోయే ఎడారిలో చినుకు జారిపడుతుంది,
పొడిబారే హృదయంలో తడి ఏదో ఊరుతుంది

నువ్వే కావాలని రెండు హృదయాలు
ఒకటి కోసమొకటి తొలిసారి కొట్టుకుంటాయి చూసావా

అప్పుడక్కడ తొలి సూర్యోదయం ఫలిస్తుంది,
తొలిగా పూలు గాలిలోకీ, కాంతిలోకీ వికసిస్తాయి,
గాలితెరలు తమని తాము తెలుసుకొని
ఊరికే పిల్లల్లా గంతులేస్తాయి,
కోనేటి కలువలు ఇదంతా మునుపు చూసిందైనా
మళ్ళీ కొత్తగా వుందని ఆశ్చర్యపోతాయి

ప్రేమ; స్నేహాన్ని దాటిన ప్రేమ
తనదైన నిండుదనంలోకి ఇద్దర్ని మేల్కొలుపుతుంది,
రెండునదులు ఒక జీవితంలోకి కలిసి ప్రవహిస్తాయి,
బహుశా, అనంత సాగరంలో ఒకటిగా లీనమౌతారు,
అపుడనంత సాగరమూ వారి ప్రేమలో లీనమౌతుంది

21.3.2025 11.28 రాత్రి, బ్లాగ్ 6.10.2025

# ఆమె నవ్వుని

నీకెందుకో ఆమె నవ్వుని కాపాడాలనిపించింది
గాజుపాత్రని కాపాడినట్లు,
కిటికీలో వాలిన బంగారు కిరణాన్ని కాపాడినట్లు,
పిట్టల కువకువల్లోని జీవితేచ్ఛని  కాపాడినట్లు
ఆమె నవ్వునీ, నవ్వగల సందర్భాలనీ,
నవ్వగల ఆశలనీ కాపాడాలనిపించింది

ఆమె ఎవరో తెలీదు, ఎందుకు మాట్లాడావో తెలీదు
మాటల్లోని ఏ భారమైన నల్లని మేఘాలు,
చూపుల్లోని వాన ముందటి తేమగాలులు,
కదలికల్లోని రాలిపడే ఎండుటాకుల చప్పుడులు

నీలో కనికరాన్ని వెన్నెలదీపంలా వెలిగించాయో తెలీదు,
నీలో, ఆమెలో, అందరిలో అంతర్వాహినిలా ప్రవహించే
ఏకైక జీవనస్పృహకి నిన్ను నడిపించాయో తెలీదు

ఆమెని వెలిగించడం నిన్ను వెలిగించుకోవటమేమో తెలీదు,
ఆమె దుఃఖాన్ని సుతారంగా తప్పించటం
నీ దుఃఖాన్ని తప్పించుకోవటమేమో తెలీదు,
ఆ నవ్వుకాంతిలో తెరుచుకునే సౌందర్యలోకాల్లోంచి
ఏ పసిదనాల్లోకి ప్రయాణిస్తావో తెలీదు

ఎందుకైనా కానీ, ఏమైనా కానీ
ఆమె నవ్వుని కాపాడాలనిపించింది

26.4.2025  9.36 రాత్రి, బ్లాగ్ 24.10.2025

# మనుషుల్లోకి తాను

ఆమె మనుషుల్లోకి చకచకా నడిచేయటం చూసావు
కాస్త నవ్వుతో, కాస్త జీవితమ్మీద ఆశతో, ప్రేమతో
అలాంటి వాళ్ళుంటా రక్కడక్కడ
సరాసరి సూర్యకిరణాల్లోంచి పుట్టినట్లు,
పూలకలల్లోంచి గాలితాకితే రాలినట్లు

ఇంత బరువుగా,
ఊబిలాంటి కాలంలో కూరుకుపోతున్నపుడు
కొమ్మ మీంచి పక్షి రెక్కలు విదుల్చుతూ ఎగిరినట్లు,
పక్షిలోంచి కిలకిలారవం ఆకాశంలో వాలినట్లు
ఇంత భారమైన మనుషుల ముఖాల మధ్యన
ఆమె చకచకా నడవటం చూసావు

ఆమె ఆశల వనదేవత కాకపోవచ్చును,
ఆమె జీవితం పూలనడక కాకపోవచ్చును,
ఇప్పుడామె నేవో వెలిగించి ఉండవచ్చును,
ఏ బంధనాలు తెగిన ఊహలకో,
ఏ భయాలను తెగించిన ఉద్వేగాలకో
ఆమెలో అకస్మాత్తుగా గట్లు తెగి ఉండవచ్చును

ఏమైతేనేమి
ఇప్పుడామె నడుస్తోంది మనుషుల్లోకి,
ఆమె నవ్వులతో తెరుచుకునే హృదయాల్లోకి,
హృదయాల్లోంచి వరదై పారలే ప్రేమల్లోకి

ఇప్పుడామె
వాన వెలిశాక ప్రశాంతంగా పరుగెత్తే వానకాలువపై
కాగితం పడవై, పడవపై ప్రయాణించే సూర్యకాంతై
జీవితాన్ని నిండుగా అనుభవిస్తోంది

18.4.2025 11.58 రాత్రి
బ్లాగ్ 22.10.2025

# బాల్య స్నేహం

జారిపోయే నిక్కరు పైకి లాక్కుంటూ
ఆవేశంగా కబుర్లు చెప్పుకునేటపుడు
మాయమైన అమ్మాయి
అరవై ఏళ్ళకి కనబడి, ఏడుస్తూ అంది
ఇన్నాళ్ళూ ఎక్కడికి పోయావు

అతనన్నాడు
సరే, ఇప్పుడు నేనేం చేయాలి
అప్పటి ఆకాశాన్ని మళ్ళీ పట్టుకురానా,
అప్పటి గాలిని వీచమని బ్రతిమాలనా,
అప్పటి అమాయకత్వాన్ని వెదుకుతూ వెళ్ళనా

తను అంది
వద్దులే, ఇప్పుడు వెళితే, ఎప్పుడు వస్తావో
ఇక్కడే ఉండు కళ్ళముందు, చాలు

అవాళ్టి సూర్యుడు
ముసిముసి నవ్వులు నవ్వుతూ నిద్రపోయాడు,
ఆ రాత్రి నక్షత్రాలు గుప్పున విరబూసాయి,
మళ్ళీ కొత్తగా పుట్టిన ఇద్దరు పిల్లలు
కాలం జారుడుబల్లపై
గాఢమైన శాంతిలోకి జారిపోయారు

4.4.2025 11.29 రాత్రి
బ్లాగ్ 15.10.2025

# పూలలోకి

పూవుల గురించి మాట్లాడుకొంటూ
నడుస్తున్నారు ఆ వృద్ధ దంపతులు
కనిపించే మొక్కల పేర్లు,
వాటి పూల కబుర్లు చెప్పుకొంటూ
గాలిపటాల్లా తేలుతున్నారు,
ఈ లోకం గొడవ పట్టనట్లు
పూల రంగుల్లోకీ, ఆకుపచ్చని సారంలోకీ
మునకలేస్తూ వెళ్ళిపోతున్నారు

ఎన్ని చూసి వుంటారు, కడగండ్లు పడి వుంటారు
ఎన్నిసార్లు ఓడి ఉంటారు, ఒదిగి చీకట్లు దాటి వుంటారు
చివరికిట్లా యుద్ధాలు శమించిన ఒక ఉదయం
పూలలోకి కాసేపు తేలుతున్నారు,
బ్రతకటాన్ని తమకంగా హత్తుకొంటున్నారు

ఏ పసిదనాల్లో బడికెళుతూ
పలకరించారో దారి పక్క పూలని,
ఎన్ని ముళ్ళతీగల మీదుగా
కాపాడుకొంటూ వచ్చారో వాటి జ్ఞాపకాలని,
ఇన్నాళ్ళకు చేరుకుంటున్నారు మళ్ళీ
భార రహిత బాల్యాలలోకి, పచ్చని జీవితేచ్ఛలోకి
తమవైన ఏకాంత లోకాల్లోకి, సాంద్రమైన నిట్టూర్పుల్లోకి..

8.9.2023 4.26 సాయంత్రం
ఉదయిని.కాం 26.1.2024

# సీతాకోకల కథ

రెండు తెల్లటి ప్లాస్టిక్ సీతాకోకల్ని
తలలో తురుముకుంది ఆ అమ్మాయి

చీకటి సెలయేళ్ళ శిరోజాల్ని
జారిపోక పట్టుకొని, కదలక ఎగురుతున్న
సీతాకోకలు ఏం చెప్పాయని తనతో తెచ్చుకొంది

జీవితం కాంతికి కాంతితో బదులిస్తే
రంగులు దాటి తెల్లగా వెలుగుతావనా,
నల్లని జీవితం ముసురుకొన్నపుడు
తెల్లని కాంతిలోకి దారి చూపిస్తామనా
మేం మాట్లాడం, నువ్వూ మాట్లాడకు
మమ్మల్ని ఎగరేస్తే, నిన్నూ మాతో తీసుకుపోతామనా

మాకు రెక్కలున్నాయి, ఊహల్లేవు,
నీకు ఊహలున్నాయి, రెక్కల్లేవు,
నీ ఊహలకి మా రెక్కలు తగిలించి
మాంత్రికనగరం సృష్టించుదామనా

వాళ్ళ మధ్య చేరి, రహస్యాలు పసిగట్టబోతావా,
ఆమెని అటు తిరగనిచ్చి, సీతాకోకలు అంటాయి కదా

కవీ, నీ కింకా పిల్లచేష్టలు పోలేదు,
ఇతర్లచోటులోకి చొరబడనపుడే నీచోటు గుర్తుపడతావు,
నువు నీలో నిలబడినపుడు, మేం నీలోనే చేరుతాము

ఇట్లా ఊహిస్తూనే ఉంటే, మేం వెలుపలనే ఎగురుతాము,
మాతో పాటు సూర్యకాంతినీ, ఆకాశాన్నీ, భూమినీ
అంతటినీ దాచుకునే, పంచిపెట్టే
జీవితం బరువునీ నువు మోస్తూనే ఉండాలి

ఉలికిపడి చూసేసరికి,
సీతాకోకల అమ్మాయి వెళ్ళిపోయిన ఖాళీలో
కంటికి తగలని నీరెండ సీతాకోకలా ఎగురుతోంది

31.10.2024 1.41 మధ్యాహ్నం
ఈమాట.కాం అక్టోబర్ 2025

# పాప వెదుకులాట

దేవాలయంలో ప్రార్థన జరుగుతోంది గంభీరంగా,
లీనం కాలేని చిన్నారి,
తనని లీనం చేసుకునే దృశ్యం కోసం
వెదుకుతోంది తలల మీదుగా

తూనీగ ఎగురుతూ పలకరించకపోతుందా,
కదలక శ్రద్ధగా కూర్చున్న ఏనుగు బొమ్మ
ఏమరుపాటున పిలవకపోతుందా అని

గోడలపై బొమ్మల రంగులు
గతకాలపు పిల్లల్లా శాంతిగా చూస్తున్నాయి,
కిటికీలోంచి తొంగి చూసే ఎండ తెరచాప
రానున్న కాలంలోకి రమ్మని పిలుస్తోంది

గిరగిరా తిరుగుతోంది పాప,
బొంగరాల్లా తేలుతూ పాపలో ఊహలు,
హేమంతఋతువులోని నదిలా మెల్లగా కదులుతూ కాలం

లీనమయా మనుకొన్న పెద్దలు బరువుగా ఊపిరి విడిచి నిలబడ్డారు,
ఇంతసేపూ కాలం తటాకంలో కాళ్ళూ, చేతులూ ఆడించిన పాప
తనను కొనుగొన్న నిద్రలో కరుగుతూ తల్లి భుజంపై తలవాల్చింది

31.1.2025 1.16 మధ్యాహ్నం
బ్లాగ్ 17.9.2025

# వర్తమానం

సుఖముంటుంది, కన్నతల్లి కనుల ముందున్నపుడు,
కన్న ఊరిని పాదాలు తాకినపుడు,
మర్యాదల దుమ్ము దులుపుకొని
చిననాటి నేస్తాలతో నోరారా మాట్లాడినపుడు,

అప్పటి చెట్లపై, చెరువుపై అప్పటి ఎండ కాసినపుడు,
అప్పటి నిద్రలోకి జారుతూ, కప్పల శబ్దాల్లోంచి
అప్పటి వానచప్పుడు వింటున్నపుడు
స్వర్గమెవరికి కావాలనిపిస్తుంది

మారిన ఊర్లు, వయసులు, మారిన మనుషులు, మనసులు
చేరిన బరువులు, గాయాలు
వెన్నెల తెల్లబోవడం, పగలు చీకటి కురియడం చూపించాక,
నరకం ఎక్కడో లేదని తెలియవస్తుంది

భూమిపై దొరికేవి స్వర్గం, నరకమేనా అని తడుముకొంటావు
మెలకువలలో, నిద్రల్లో, ఊహల్లో, కలల్లో రెండిటి విముక్తి కోసం తపిస్తావు

దుఃఖం శిఖరాలు చేరినపుడు,
గగనమూ, లోయలూ ఒకేసారి పిలిచినపుడు
ఉలికిపడతావు శిలలాంటి వర్తమానంలోకి
బహుశా, అపుడు నువ్వుండ వనుకొంటాను,
పగటిలో దీపకాంతిలా వర్తమానంలో నీ ఉనికి లీనం కావచ్చును

22.12.2024 10.30 రాత్రి, బ్లాగ్ 2.9.2025

# ఈ రాత్రి

ఈ రాత్రి బావుంది,
డాబాపై నక్షత్రాలు వెలిగాయి, కొంత వెన్నెల కూడా
ఊరిలో కొన్ని ట్యూబులైట్ల కాంతి,
వీటిని మించి యౌవనోద్రేకాల జ్ఞాపకాల వెలుతురు

ఈ రాత్రి బావుంది ప్రతి రాత్రిలానే,
దుఃఖాల నుండి విజయాల్లోకి ఎలా ఈదగలిగామో,
గర్వంగా, తృప్తిగా తలుచుకోవటం బావుంది

కానీ, ఈ రాత్రి కూడా వేల రాత్రుల్లానే,
నిద్రపట్టక పొర్లుతూ, తెల్లవారకూడదని ప్రార్థిస్తూ,
త్వరగా తెల్లవారాలని ప్రార్థిస్తూ దుఃఖిత హృదయాలు,
వాటిపై బేలగా వెన్నెల నిమురుతూ
జీవితమనే మహాశక్తి నిట్టూర్పులు

అయినా, ఈ రాత్రి బావుంది,
దైవం దైవం కోసం ప్రార్థిస్తున్నట్లు,
వాన వాన కోసం ఎదురుచూస్తున్నట్లు,
ఆనందం ఆనందం కోసం అంగలారుస్తున్నట్లు,
స్వేచ్ఛ స్వేచ్ఛ కోసం తపిస్తున్నట్లు

ఈ వెన్నెల బావుంది, నిశ్శబ్దం బావుంది,
విశాలమైన ఆకాశం బావుంది,
కనుకొలకుల్లో ఆగిన బిందువు బావుంది,
ఎవరూ ఇటు రాని ప్రశాంతత బావుంది

ఈ రాత్రి రాత్రిలా ఉండటం బావుంది,
మనం ఉత్త మనంలా మిగలటం బావుంది,
ఈ అనుభవానికి అర్థం లేకపోవటం బావుంది
రాత్రీ, మనమూ, కాసేపైనా బావుండటం బావుంది

8.10.2025 11.50 రాత్రి

# ఒక మిత్రుడు

ఒక మిత్రుడుండేవాడు
ఉదయపు సూర్యకాంతీ, మధ్యాహ్నపు వేడిమీ,
సాయంత్రపు గాలితెరలూ, నక్షత్రాల గుసగుసలూ కలిపి తయారుచేసినట్లు

వాడుంటే సందడుండేది, సందడుంటే వాడుండేవాడు,
ఒక నిశ్శబ్దమైనరోజు ఇక చాలురా అని వెళిపోయాడు
కాంతీ, వేడిమీ, తెరలూ, గుసగుసలూ పుట్టేచోటికి

వాడిక రాడు, అలాగని నువ్వూ మిగిలేది లేదు,
వాడిలాగా జీవితాన్ని అనుభవించలేదు నువు,
మనుషుల్ని ప్రేమించలేదు, వాడిలాగా బతుకుపండగ చాతకాలేదు
ఇలా ఉంటుంది జీవితం
ఉండవలసినవాళ్ళు ఉండరు, వెళ్ళవలసినవాళ్ళు వెళ్ళరు

వాడిని తలిస్తే దుఃఖం రాదు, ఉన్నట్లుండి తాకే గాలితెరలా
వాడి జ్ఞాపకాలలోంచి రాలే సంతోషం తప్ప,

వాడికి కళలు తెలియవు, గెలుపుపందెంలో పరుగు కోరుకోలేదు,
సామాన్యంగా బ్రతికి, సామాన్యంగా వెళిపోయాడు,
నువు చూడని రోజుల్లో కూడా
ఊరిచుట్టూ నిశ్శబ్దంగా ప్రవహిస్తున్న కాలువలా

(మిత్రుడు చక్కా శ్రీనివాస్ స్మృతిలో)

9.4.2025 00.53 రాత్రి, బ్లాగ్ 18.10.2025

# ఉండాలి..

ఉండగా ప్రేమించటానికి లెక్కలు వేస్తాం
వెళ్ళిపోయాక చెల్లా చెదురవుతాయి,
మనుషుల కన్నా బుద్ధిహీనం ఉంటాయా,
కాస్త ప్రేమిస్తే చాలు ఉదయంలా బ్రతుకుతారు
ఒకరికొకరమని సంతోషపడుతూ

ఏ పగలు ఒకరు రాలిపోతారో తెలీదు,
ఏ రాత్రి ఒంటరితనాన్ని మిగిల్చివెళతారో,
బ్రతికున్నాం కదా, ప్రేమించుకుందామని
ధైర్యం చెప్పుకునే తెలివొస్తుందా ఏనాటికైనా
బ్రతికివెళ్లారు కదా ప్రేమించుదామనే రోజులొస్తాయా

మనుషుల కన్నా అమాయకం ఉన్నాయా,
తమవారిని బలి కోరే తెలివిలేని జీవులుంటాయా,
లేవగానే, నువు ఉన్నావు చాలనే
భరోసాతో ఒకరికొక రుండటం కన్నా,
ఒంటరిలోకం ఎవరి నుండి ఏమాశిస్తుంది
కొంచెం ప్రేమ కోసం ఇదంతా ఇలా పుట్టింది

నవ్వుతావో, ఏడుస్తావో నీ స్వేచ్ఛ, ఇక్కడ ఉండు నచ్చినట్లు,
దగ్గరగానో, దూరంగానో ఉన్నావన్న స్పృహ చాలు,
నేను నిండుగా ఉండటానికి అని
ఎవరితోనైనా, ఎపుడైనా అనగలుగుతామా

16.7.2024 00.17 రాత్రి
బ్లాగ్ 13.8.2025

# జ్ఞాపకం

జ్ఞాపకాల్లోని ఎవరినో కలవాలనిపిస్తుంది,
ఎటు తిరిగినా చీకటి కురిసే ఈ రాత్రి

వాళ్ళు నీ ముందు కూర్చుంటారు,
ఆర్తిగా, ఆత్మీయంగా కదులుతారు,
నిన్ను నిండారా గమనిస్తారు, నువు వాళ్ళని కూడా

కలిసిన రోజుల్లో పంచుకోలేకపోయిన
ఉద్వేగాలు, మాటలు, మౌనాలు,
స్పర్శలు, దుఃఖపు సంతోషాలు,
చేసుకోలేకపోయిన ప్రమాణాలు,
పగటి చివర ఊగే చీకట్లలా,
రేయి చివర ఊగే వెలుతుర్లలా
మీ ముఖాలపై తారాడుతాయి

మీరిపుడు కేవలం ప్రేమలు,
తెరుచుకోబోయే చిరునవ్వులు,
పురి విప్పబోయే హృదయాలు,
ఆగిపోబోయే కాలాలు

ఇంతలో, జ్ఞాపకం ఆగుతుంది ఎందుకో, ఎక్కడో
వారంతా మాయమవుతారు లోపలి తేనెగదుల్లోకి

జ్ఞాపకాల్లోని మనుషులు ఇంత బావుంటారు
నిజబింబాల కన్నా,

జ్ఞాపకాలు ఇంత బావుంటాయి
సూర్యకాంతితో మెరిసే నిజమైన రోజుల కన్నా

అక్కడే ఆగిపోతే అది జీవిత మెందుకవుతుంది,
కలలోంచి రాలిపడకపోతే మెలకువెలా వస్తుంది

ఇవాల్టి రోజుని ఇవాళ లాగే ఈదక తప్పదు,
ఈరోజు ముందు కాలపు జ్ఞాపకం కాక తప్పదు

ఇంతకీ, నీ జ్ఞాపకం ఏం చెబుతోంది
అనుభవంలో వగరయిన జీవితం
జ్ఞాపకంలో తీయగా పండుతుందనా,
జీవితం ఎప్పటికీ తీయనైనదనా..

2.9.2025 11.19 రాత్రి

# ఏకాంతంలో..

స్నేహితులతో గడిపిన తర్వాత
నీదైన ఏకాంతాన్ని చేరుకుంటావు,
అప్పటి వరకూ ఎదురుచూస్తున్న
దుఃఖశాంతి మృదువుగా సమీపిస్తుంది

ఒక్కడిగా ఉన్నపుడు నువ్వేమీ కావు,
మంచివీ, చెడ్డవీ, బలశాలివీ, దుర్బలుడివీ
ఏమీ కావు, కనీసం ఎవరివో తెలీదు

రెండవ మనిషి రాగానే తయారవుతావు
యుద్ధానికి సిద్ధపడే సైనికుడిలా,
పులిని చూసిన జింకలానో, జింకని చూసిన పులిలానో
నిన్ను నువు క్షణంలో తీర్చిదిద్దుకుంటావు

చాలాకాలం గడిపావు ఈ నేలపై
ఈ నక్షత్రాల కింద, సూర్యకాంతి కింద,
రెండవది దుఃఖమని ఇంకా తెలియరాలేదు

ఇతరులతో గడిపాక, నిన్ను పలకరిస్తావు,
సముద్రగర్భంలోని, నీలిగగనాని కావలి
ప్రశాంతగంభీరమైన నీ సన్నిధికి మేలుకుంటావు

ఇప్పుడు చూడు సుమా,
ఇంత ప్రపంచాన్ని పిండితే

నువు మాత్రమే సారాంశమై తగులుతావా
ఇతరమేమైనా మిగులుతుందా

ప్రపంచంలో గడిపాక,
ఈత చాలించిన దేహంలా
పరమ ఏకాంతంలో మునిగినపుడు

ఏది సత్యం, ఏ దసత్యం
ఏది నువ్వు, ఏది నేను
ఏది జీవిత మేది మృత్యువు

5.3.2025 11.29 రాత్రి
ఉదయిని.కాం నవంబర్ 2025

# కలలాంటి బంధాలు

కలవటం ఎంతసేపు, విడిపోవటమెంతసేపు
చిటికె వేసినట్లు కలవొచ్చు, పూలు రాలినట్లు విడిపోవచ్చు,
విడిపోవటం భారమా, తేలిక పడటమా

నిజాయితీ కదా వెలగాలి బంధంలో, విడివడటంలో,
కలిసి ఉండటమా ముఖ్యం, నిండుగా ఉండటం కదా

కాలమింకా చాలా మారాలి మనం ఎదగాలి, పండాలి,
మరింత కాంతిలోకి వికసించాలి
బ్రతికి ఉండటం కన్నా ఏదీ విలువ కాదని తెలియాలి,
తనతో తానుండటం కన్నా అపురూప బంధమేదీ లేదని కూడా

మనుషులతో, విలువలతో కాదు
ఊరికే కలిసి ఉండాలి జీవించటంతో

చెట్లు జీవిస్తున్నాయి నీతో కలిసి
నీరు జీవిస్తోంది, గాలి జీవిస్తోంది,
ఆకాశం జీవిస్తోంది, కాలం జీవిస్తోంది

నీవు కలిసిన వారిలోంచి, విడివడిన వారిలోంచి,
జీవితం తనని తాను జీవిస్తోంది,
కలలాగా నిన్ను తాకుతోంది

16.7.2024 11.10 రాత్రి
బ్లాగ్ 12.8.2025

# అహం..

ఎంత సంతోషం క్షణం విడవలేని ఒకరు నీకుండటం,
ఎంత దుఃఖం ఆ ఒకరు నీకు,
ఎవరు సంతోషమో, వారి ఎడబాటు దుఃఖం
ఎవరు భద్రతో, వారి వియోగం భయం

ఇలా వుంటుంది ఇక్కడంతా,
తోటి చిన్నారులు ఆడుకుందాం రమ్మన్నట్టు,
వాళ్ళతో ఆడితే కాలం మాయమవుతుంది,
వాళ్ళు లేకుంటే కాలం భారమౌతుంది

కాలం వలలో పడినట్లు తెలియని చేపపిల్లవి,
గాలి అందనపుడు విలవిల్లాడుతావు
ఆశావహమైన మాటలేవీ వినిపించవు,
విన్నా, గాలి అందనివేళ వాటికర్థముండదు

ఇదంతా ఆనందమో, బాధనో
తెలీని క్షణాల్లోకి ఇంకిపోతావు చూడు,
అప్పుడెవరో నీ దేహాన్ని తడతారు,
తెల్లవారింది, ఇంకా లేవలేదేమిటని

లేచాక తెలుస్తుంది ప్రేమించాల్సింది వేరే లేదని,
నిన్ను నువు తలమునకలుగా ప్రేమిస్తున్నావని

27.2.2025 00.11 రాత్రి
బ్లాగ్ 26.9.2025

# కొలతలలోకి..

మనుషులు వెళ్ళిపోగానే ఏకాంతం ముసురుతుంది
పగలు వెళ్ళగానే రాత్రి ముసిరినట్లు,
ఉద్వేగం వెళ్ళాక నిర్వేదం కమ్మినట్లు,
నువు వెళ్ళాక చరాచర జగత్తుకీ విశ్రాంతి దొరికినట్లు

అపుడు మొదలవుతుంది
మరొకసారి కొత్తగా జీవితం వికసించడం
వెన్నెల రాలటం, ప్రేమికుల మధ్య ఆర్తి మేలుకోవటం

జీవితం నీ చేతుల్లో లేదు, మరెవరి చేతుల్లో కూడా
జరిగేవి నీ లెక్కలని అనుసరించవు
వేల అవకాశాల లోకంలో నీ లెక్కలెంత, నీవెంత

ఈత మానేస్తే చాలు, కాస్త తల వంచితే చాలు
ఇంత విస్తారమైన జీవితంలో నీ బలమెంత, గర్వమెంత

రాత్రి నిద్రపో, ఉదయం మేలుకో
ఆకలేస్తే తిను, వెదుకు, అడుగు
ఇంతకన్నా ఇక్కడ పనేమీ లేదు

నువు ఉన్నా లేకున్నా గాలి ఇలానే వీస్తుంది,
నక్షత్రాలు వెలుగుతాయి,
తలపై మైదానంలో వెలుతురు బంతులు దొరలుతాయి

మనుషులిట్లానే ఒకరినొకరు
ప్రేమించుకొంటూ, తిట్టుకుంటూ
భయపెడుతూ, జాలిపడుతూ..

మనకి తెలియంది ఏదో జరుగుతోంది
మన లోపలా, వెలుపలా,
మనకి అందని కొలతలలో, కాలాలలో

నువు చీమ కన్నా ఎక్కువ కావని
ఎందుకు తెలుసుకోకూడదు

17.9.2024 11.38 రాత్రి
బ్లాగ్ 14.10.2024

# నశ్వరం

చాలామంది రాలిపోతారు ఎండిన ఆకుల్లా
నావాళ్ళ లోంచి, ఉద్వేగాల్లోంచి, కలల్లోంచి
నిన్ను పంచుకోవటంలోంచి,
ఒకరు చూడగానే ఒకరు వికసించడం లోంచి..
వాళ్ళలోంచి నువ్వూ అలానే..

ఇది దీర్ఘమైన ప్రయాణం అనిపిస్తుంది అపుడు
చాలా నడిచి వచ్చావనీ,
ఇప్పటికే అనేక పగళ్ళు, రాత్రులు చూసావనీ
చాలాసార్లు నీపై ఎండ వాలిందనీ, వాన కురిసిందనీ
మంచు నిన్ను కప్పిందనీ, వెన్నెల నీ కలల్ని పాడిందనీ,
దుఃఖపు ఏకాంతాలెన్నో రుచి చూసావనీ గుర్తొస్తుంది

తెలియని ఇంటివైపుగా నీ చూపు తిరిగిందని
లోపలెక్కడో తోస్తుంది
తెలియకుండా ముగింపుని ప్రేమించటం మొదలవుతుంది

. . .

చాలామంది కలుస్తారు, విడిపోతారు
మళ్ళీ కలుస్తారు జ్ఞాపకాల్లా కొన్నిసార్లు
జ్ఞాపకమూ, ఇవాళ్టి మనిషీ ఒకరు కారని తోస్తుంది
నీకూ, జ్ఞాపకాల్లోని వాళ్ళకీ కూడా

చూసావా, ఇది అద్భుతం
ఇప్పటికిది నిజమని తోస్తుంది
ఎప్పటికీ ఇలా ఉంటుందనిపిస్తుంది

కానీ మారుతుంది, జారిపోతుంది
ఎంత అమాయకమైన ఆట ఇదంతా
ఏదీ నిలబడనిచోట ఏదీ మారదని భ్రమపడటం

ఆ ఎండిన చెట్టుని చూసావా
బాల్యంలో దాని నీడల కిందనే కదా
మిత్రులతో ఆడుకొన్నది
కొమ్మలలోకి, ఆకులలోకి, పళ్ళలోకి, గాలిలోకి
నిన్ను తేలికగా విసిరేసుకున్నది

చెట్టు ఒరిగిపోయాక మిగిలిన ఖాళీ
నిన్ను ఎటు తీసుకుపోవాలని పిలుస్తున్నది
ఎవరు రాగలరు నీతో అక్కడికి

22.10.2024 11.50 రాత్రి
పాలపిట్ట ఏప్రిల్ 2025

# ఏకాంతం

ఎదగాల్సి ఉంది
ఒకరి భుజంపై తలవాల్చడం నుండి,
అపుడనంతమైన ఏకాంతంలోకి
నడక మొదలవుతుంది

ఉదయాస్తమయాలు లేని,
వెన్నెలలూ, వానజల్లులూ
నీనుండి నిన్ను వేరుచేయలేని,
నీతో నువు నిండిపోయే ఏకాంతంలోకి

చాలా వేదన, గాయాలు,
అణచుకున్న రోదన, కాలువల కన్నీరు
రాత్రి కంటే పెద్దవైన దుఃఖాలు
నిన్ను నీ దగ్గరకు చేర్చటానికని
అప్పటి వరకూ తెలియదు

జీవితమేమీ మధురం కాదు, చేదూ కాదు,
దాని మానాన అది ఉంది,
గుమ్మంలోంచి చూస్తుంటే, ఎగురుతూ వెళ్ళిన పక్షిలా
తన మానాన తాను జీవిస్తూవుంది

సూర్యకాంతి అద్దంలా భళ్ళున పగిలినట్లు
అనిపించిందా ఎపుడైనా
బాధలోనో, భయంలోనో, ఏకాకితనంలోనో

అనిపిస్తే, మంచిది
నీదైన ఏకాంతం నిండా నువు
అడవిలో చీకటిలా వ్యాపిస్తావు

కాలేదా, మరీ మంచిది
కాగితంపై ఒలికిన రంగుల్లాంటి
మనుషుల మధ్య జీవితం గడిపేస్తావు

27.12.2024 11.48 రాత్రి
బ్లాగ్ 4.9.2025

# దిగులు

మనుషులు దిగులు పడతారు
ఇతర్లకి కనిపించే ప్రపంచానికి తలుపులు మూసి,
తమకి తాము మిగిలే ప్రపంచంలోకి ప్రవేశించినపుడు

నక్షత్రాలు రాలిపోతాయి,
పాటలు గాలిలోకి చెరిగిపోతాయి,
బంధాలు మరపులో మునిగిపోతాయి,
దిగులు మాత్రం తోడుంటుంది
వదలని కుక్కపిల్లలా తోకాడిస్తూ

ఈ రాత్రి పగటిలో కరుగుతుంది,
పగలు రాత్రిలో కరుగుతుంది
రాత్రీ, పగలూ క్రమం తప్పక కౌగలించుకునే
కాలపు నృత్యరూపకంలో
పగటిగానో, రాత్రిలానో మిగులుతుంటావు,
ఒంటిరెక్కతో ఎగిరే పక్షిలా దుఃఖపడతావు

ఇదంతా ఇలానే ఉంటుంది
జీవితమంటే తెలియనివాళ్ళు
జీవితంలో సుఖపడతారు,
జీవనానందం తెలిసినవాళ్ళు దుఃఖపడతారు

జీవితం ఇలానే ఉంటుంది
తనని ప్రేమించినవాళ్ళని దుఃఖపెడుతుంది,

పట్టించుకోని వాళ్ళని సుఖపెడుతుంది,
భయపడిన వాళ్ళకి ధైర్యం చెబుతుంది

ఏమైనా కానీ, ఒక ఆకు రాలినపుడు,
పూవు రెక్కలు తెరిచినపుడు,
కాంతిరేఖ జీవనగీతం పాడినపుడు,
నిట్టూర్పు జీవితాన్ని నమ్మినపుడు

నువు అక్కడ ఉంటావు
కళ్ళనీ, ముఖాన్నీ పూర్తిగా తెరిచి,
హృదయాన్ని గాలిపటంలానో,
కాగితం పడవలానో వదిలి,
సమస్తాన్నీ ప్రేమిస్తూ, ప్రేమించటాన్ని ప్రేమిస్తూ..

ఈ దిగులు కూడా గడిచిపోతుంది కదా..

4.7.2025 00.11 రాత్రి
బ్లాగ్ 29.10.2025

# విడిపోయినపుడు

ఎవరి నుండన్నా విడిపోయినపుడు
చుట్టూ సీతాకోకలు స్వేచ్ఛగా ఎగురుతాయి,
దూరమైన నక్షత్రాలు చుట్టూ మూగుతాయి,
చిన్న వానజల్లుని తోడు తెచ్చుకొని
ఇంద్రధనువు కావలించుకొంటుంది

ఎవరి నుండన్నా దూరం జరిగినపుడు
గాలి పిల్లకాలువలా ఒంపులు తిరుగుతుంది,
వారిలో మూసుకుపోయిన చిరునవ్వులు
ఉదయకాంతుల్లా పెల్లుబుకుతాయి,
గాలితెర తగిలి పటాలు ఎగరటం మొదలుపెడతాయి

ఒంటరిగా వచ్చి, వెళ్ళవలసిన ప్రాణాలివి,
తోడు దొరికినపుడల్లా ఊపిరాడకపోవడమేదో
లోపల వరదనీరు పెరిగినట్లు వ్యాపిస్తుంది

ఉదయం లేచి అంటాం గదా
ఈ కాంతి ఎంత శాంతిగా ఉంది,
ఈ పిట్టకూత ఎంత నిశ్శబ్దాన్ని తెచ్చింది,
ఈ గాలి ఎన్ని కలలు పోగొట్టి హాయినిచ్చింది అని

వాటి హాయిలోని రహస్యమిది
అవి ఒంటరిగా వస్తాయి, చరిస్తాయి
ఒంటరితనంలోని పరిపూర్ణత బోధించి వెళతాయి

మనం ఒకరి లోపలికి ఒకరం
మరీ ఎక్కువ చొరబడుతున్నామేమో,
మీట నొక్కగానే దీపం వెలిగినపుడైనా
గది నిండే కాంతితో కోల్పోయే శాంతిలో
గమనించగలమా

5.11.2024 11.17 రాత్రి
వీధి అరుగు సంచిక 2/10

# నిర్మోహం

మనుషులతో నీకెలాంటి బంధం లేని క్షణాల్లో
నీ ప్రపంచం తటాలున విశాలమౌతుంది

దారిన పోయే మనుషుల్ని,
బజారులో నడకలో, పనుల్లో, మాటల్లో
మునిగిన మనుషుల్ని ఊరకనే గమనిస్తున్నపుడు
వారిపై వాలే దీపాల వెలుగునీడలు కనిపిస్తాయి

వెలుగునీడల్ని పొదువుకొన్న గాలీ,
గాలిని పొదువుకున్న ఆకాశమూ,
ఆకాశాన్ని పొదువుకున్న జీవితమూ
కనుల ముందు సాక్షాత్కరిస్తాయి

మనుషులు నీకేమీ కాని క్షణాలు
ఎవరూ వారి చేతనలోకి నిన్ను లాగని,
నీ చేతనలోకి చొరబడని క్షణాలు అద్భుతం

ఆ కొండ చుట్టూ నడిచే సమయాల్లో
బాటప్రక్క బైరాగులని చూసినపుడు
నీలో సోదరభావం కలిగేది

వాళ్ళకి మనుషులతో బంధం లేదు,
చూసినా, లేకున్నా, ఇచ్చినా, లేకున్నా పట్టింపులేదు
కొండని చూస్తూ వాళ్ళు, పావనజలాల్లో మునిగినట్లు
కొండలో మునిగి వుంటారు

ఏదీ పట్టని క్షణాలు అద్భుతం,
నీ ఊరిలోనూ, ఇంటిలోనూ
నువ్వొక బైరాగిలా తిరుగాడే సమయాలుంటే,
ఇతరులలోకీ నువ్వూ, నీలోకి వారూ
చొరబడని సమయాలుంటే

నీకు తొలిసారి తెలుస్తుంది
ఇతరుల్ని నువు ఎంతగా ప్రేమిస్తున్నావో,
వారిలోపలి సుతిమెత్తని జీవనానందాన్ని
మృదువుగా తాకుతున్నపుడు తెలుస్తుంది
నీకు జీవితమంటే ఎందుకింత మోహమో

23.3.2025 7.56 రాత్రి
సారంగ 1.7.2025

# నువు వెళ్ళాక

నది ప్రవహిస్తుంది అలల తళతళలతో,
వేకువ పాడుతుంది మరొక ప్రశాంతగీతం,
మధ్యాహ్నపు కాంతి వీధిలో అల్లరి చేస్తుంది,
రాత్రులు గుప్పుమంటాయి విశ్రాంతుల అగరుపొగలతో,

వేనవేల మనుషుల్లో ఒకరిద్దరు నిన్ను తలుస్తారు,
వేల ఉద్వేగాల్లో ఒకటిరెండు నిన్ను తలపిస్తాయి,
నిన్ను ఎరుగనే ఎరుగని ప్రాకే పిల్లలు
రేపటిలోకి చిరునవ్వులు రువ్వుతారు,
ఇవాల్టి గుబుళ్ళలో, దిగుళ్ళలో
నీ మనుషులు నిన్ను గతంలోకి విడుస్తారు

నువు వెళ్ళాక లోకం ఎప్పటిలానే ఉంటుంది,
నువు పుట్టక ముందులానే,
ఉన్నప్పటి నువు లేనట్లుగానే,
లేనప్పటి నువు ఉన్నట్లుగానే

ఈ ఆకాశం ఉంటుంది, గాలి ఉంటుంది,
సవ్వడుంటుంది, సందడుంటుంది,
కాంతి ఉంటుంది, కన్నీరుంటుంది,
ప్రశ్నలుంటాయి, జవాబులుంటాయి,
తెలియనితనాలకి కొత్త ఆకులు తొడుగుతాయి,
తెలివిలోకి కొత్త పూవులు పూస్తాయి

నువు వెళ్ళినా కాలం ప్రవహిస్తుంది నదిలా,
స్థలం నిలుస్తుంది శిఖరంలా
నువు వెళ్ళావో, లేదో, వెళ్ళనే లేవో
నీకు తెలియదనిపించటం మినహా
ఇదంతా నువు ఉన్నప్పటిలానే, లేనపుడు కూడా

14.9.2025 11.28 రాత్రి

# మునుగీత

రంగుల నుండి చూసినపుడు
రంగులు మినహా జీవితం మరేమీ కాదనిపిస్తుంది,
రాగాల నుండి చూసినా అలానే

కాసిని అక్షరాల్లో రూపుతేలే
ఉద్వేగాల నుండి చూసినా
ఉద్వేగాలు మినహా జీవితం మరేమీ కాదనిపిస్తుంది

జీవితం అద్భుతం, జీవించటం అద్భుతం
ఇక్కడి రంగులూ, రాగాలూ,
దీనిలో చేపల్లా ఈదే పగళ్ళూ, రాత్రులూ,
అలల్లా ఊగే ఉద్వేగాలూ అద్భుతం

మన మనుకుంటాం జీవితం దుఃఖదాయిని అని,
ఇంతింత మనసుల్లో, భావాల్లో ఇరుక్కుని

ఆ జనన్మాంతం గాలిపటంలా ఎగిరే ఆకాశాన్ని
కాసేపైనా ఆగి చూడలేం,
జీవితం మన చేతులు పట్టుకు లాగి చూపే
ఆకుల పచ్చని ఆనందాన్ని క్షణం గమనించలేం,
ఎండ సన్నగా పాడే నేపథ్య సంగీతం ఎపుడూ వినలేం

గభాలున, భారమైన జీవిత మనేస్తాము
జీవితాన్ని మనమే మోస్తున్నట్లు,
తానే మనని మోస్తుందని మరిచి

మళ్ళీ చెబుతాడితను, గాయపడ్డాక కూడా
జీవించటం ఆనందదాయకం
ఇంతకన్నా ప్రేమాస్పదం లేదు

ఇంతకీ, నీ బిడ్డని
కడుపారా కావలించుకున్నపుడు గమనించావా
నీకు జీవితమంటే ఎంత మోహమో..

24.1.2025 11.26 రాత్రి
బ్లాగ్ 14.9.2025

# వాంగో

అతనేమిటో తెలీదు ఆ రంగులు చూసే వరకూ,
ముదురు రంగులతో, బలమైన రేఖలతో
తానేం చెప్పదలిచాడో తెలిసినట్టు తోచింది
అతని కుంచె నుండి ఒలికిన బొమ్మలు చూసాక

వాంగో, నీకు కృతజ్ఞతలు,
జీవితం రంగులకి కళ్ళని మరింత తెరిచినందుకు
ఇపుడు మరింత విప్పార్చి చూస్తున్నాను,
మేఘాలరంగుల్లో దాగిన హృదయాల్నీ,
హృదయాల్లో తెరలెత్తిన మేఘాలరంగుల్నీ

నువు జీవితాన్నెంత బలంగా ప్రేమించావో
దశాబ్దాల తర్వాత పుట్టిన ఇతను కూడా
బహుశా, అంతే బలంగా..,
లేకుంటే నీ రంగుల్లో ఇతనెలా మునిగేవాడు

వాంగో, ఎపుడో వచ్చి, వెళ్ళిన సోదరుడా
మన కోసమే కదా సూర్యుడు కిరణాలు చిమ్మాడు,
భూమిపై గడ్డి మొలకెత్తి, గాలికి ఊగింది,
మనల్ని కలగనటానికే కదా ఆకాశం భళ్ళున తెరుచుకుంది

24.1.2025 10.16 రాత్రి
బ్లాగ్ 13.9.2025

# వాళ్ళు

లెక్కల్ని ప్రేమించే లోకంలో
రెక్కల్ని ప్రేమించేవాళ్ళింకా మిగిలుంటారు
వాళ్ళే ఉదయాలలో కాంతి నింపుతారు
ఉదయపు గాలిలో చల్లదనాన్నీ,
పూలరేకుల్లో తాజాదనాన్నీ ఒంపుతారు

వాళ్ళే పక్షుల్ని పాడమనీ,
ఇంద్రధనువుల్ని రంగులు విరజిమ్మమనీ,
పున్నమి చంద్రుణ్ణి నెమ్మదిగా ఎగరమనీ ప్రేమగా ఆజ్ఞాపిస్తారు

కొందరుంటారిక్కడ
భయాలతో, అనుమానాలతో ఎండిపోతున్న లోకంలోకి
ఇది జీవనది అంటూ ప్రేమతో దూకేవాళ్ళు

వాళ్ళని ఆకాశం ప్రసవిస్తుంది
గాలి పెంచుతుంది, కాంతి ఆడిస్తుంది
నిజానికి వాళ్ళంటూ విడిగా లేరు
నీలోనే వాళ్ళుగా వున్నారు

ఇంత విశాలమైన జీవితం
పాలలోంచి వెన్న తీసినట్లు వాళ్ళని నీకు చూపిస్తుంది
జీవితం అందమైనది చూడండంటూ..

27.2.2025 11.36 రాత్రి
మహా పత్రిక 31.3.25

# ఇందుకు వస్తారు

కలలు కనటానికి వస్తారు
కొందరు ఈ మొరటు ప్రపంచంలోకి

పాపం, లోకమేమీ మొరటు కాదు,
సౌకుమార్యంలోకి మేలుకొనేందుకు
తగినంత నిద్రపోతూ వుంది
గూటిలో ముడుచుకున్న గొంగళిపురుగులా

ఎండ కాయటంలోని ఉత్సవ సౌరభం
లోకం గమనిస్తుంది ఒకనాడు,
గాలి వీయటం, చెట్లు చిగురించటం,
స్వచ్ఛ జలాలు సందడిగా పరుగులెత్తటం
శ్రద్ధగా పరిశీలిస్తుంది

జీవులు ఒకటినొకటి తాకటమూ,
ఒకదాని చూపులోకి మరొకటి
లాలనగా ప్రవహించటమూ,
ప్రార్థన గాక మరొకటి కాదని
ఎరుకలోకి తెచ్చుకొంటుంది

స్వర్గం వేరే లేదనీ,
సంతోషం ముందు కాలంలో దాగి లేదనీ,
ఉన్నాం మనం ఒకరి కొకరమని
తలుచుకోవటం కన్నా
పొందవలసిన అనుభవమేమీ లేదని

మొరటు ప్రపంచం రంగుల రెక్కలతో
నీరెండలో హాయిగా ఎగిరే కాలాన్ని
ముందుగా సూచించటానికి
జీవితం కలగంటుంది వారిని

10.12.2024 10.55 రాత్రి
బ్లాగ్ 27.8.2025

# కలల పిల్లలు

లోకం నచ్చకనో, చాలకనో కొందరు కవులవుతారు,
కలలలోకీ, కళలలోకీ జారతారు

మామూలు మానవలోకానికేమి
అన్నిటినీ కలుషితం చేస్తుంది
జ్ఞానాన్నీ, భక్తినీ, కళనీ, కరుణనీ

కొందరు పసివాళ్ళుంటారు ఎదగటం ఇష్టం లేనివారు,
ఎదగటంలో ఏమీ లేదని పసిదనంలోనే పసిగట్టినవాళ్ళు

వాళ్ళకి రంగురంగుల బొమ్మలిష్టం,
రంగురంగుల ఆటలిష్టం, శబ్దాలిష్టం, పదాలిష్టం,
రంగుల్లోకి దుమికే, ఈదే ఊహలిష్టం, కళలిష్టం

లోకం వల్ల వాళ్ళకెంత దుఃఖమో చెప్పలేరు,
ఎంత రాపిడో, భయమో చెప్పుకోలేరు,
వాళ్ళు తడుముకుంటారు
పీడకలలోని బిడ్డ అమ్మ కోసం తడుముకున్నట్లు
కరుణనీ, కళనీ, భక్తినీ, జ్ఞానాన్నీ

వాళ్ళెవరినీ చేరరు, చేరనివ్వరు,
లోకమంటుంది కదా వాళ్ళకెంత గర్వం,
ఎంత ధిక్కారం, ఎంత నిరంకుశత్వం
పాపం, వాళ్ళకవేమీ తెలీదు

పసిదనంలోంచి బయటికి రావటానికి
జంకే వాళ్ళ నైర్మల్యం గురించి
లోకానికి కూడా, పాపం, ఏమీ తెలీదు

8.4.2025 11.27 రాత్రి
మెహఫిల్, మన తెలంగాణ 9.6.2025

# సున్నితం

ఇతరుల స్వేచ్ఛలో అంగుళమైనా ఆక్రమించలేని
అతి సున్నితమైన సమాజాన్ని కలగంటావు

జరుగుతుందీ, జరగదని కాదు,
కలగనటం సున్నితమైన పిలుపు
పూవు లేత ఎండని పిలిచినట్లు,
లేత ఎండలాంటి సీతాకోకని పిలిచినట్లు,
సీతాకోకలాంటి నీ చూపుని పిలిచినట్లు

సున్నితత్వం బోధిస్తే వచ్చేది కాదు,
నిర్బంధించి నేర్పేది కాదు, భయపెట్టి తీర్చిదిద్దేది కాదు
అది లోపలి పొరల్లోకి మెలకువ
చేతన తనని విప్పుకోవటం

నువు సహజంగా సున్నితం
లేత ఎండకన్నా, పూవు వికసించటం కన్నా,
సీతాకోక రెక్కలపై వాలే చూపు కన్నా

నీలోకి నువు మరికాస్త దగ్గరగా జరిగినపుడు,
నిన్ను నువు ముడుచుకొన్నపుడు,
వాన వెలిసాక ముడిచిన గొడుగులో
పొరలు విప్పుకొనే వెచ్చదనంలా
నీలోకి నువు చేరుతున్నపుడు

నీకు తొలిసారి తెలుస్తుంది
నిజానికి నువు చాలా సున్నితమని,
చిరుగాలికి గాయపడేంత లలితమని,
తొలి వేకువ వెలుతురు కూడా
నిను తాకటానికి జంకుతుందని

నువు ఎంత సున్నితమో నీకు తెలిస్తే చాలు
మనిషి కథ సుఖాంతమౌతుంది
ఆ క్షణం కోసం కదా ఇంత విశ్వం
నానమ్మ కథలో సుఖాంతం కోసం
పిల్లలు ఎదురుచూసినట్లు చూస్తోంది

14.1.2025 11.17 రాత్రి
స్నేహ, ప్రజాశక్తి 16.3.2025

# గుంపులు

మనుషులు ఇప్పటికీ తమని
గుంపుల్లో గుర్తుపడుతున్నారు

నిన్ను చూసుకుంటావా
ఏ గుంపుకీ చెందినట్లు తోచదు,
గుంపులు పిల్లల ఆటలనిపిస్తాయి
కానీ, గుంపు జీవలక్షణం గనుక
నీదే గుంపని వెదుకుతావు నీలోపల

ఇచ్చి, పుచ్చుకునే గుంపుల్లో ఉక్కపోస్తుంది,
పరస్పర ప్రదర్శనల గుంపులు డొల్లగా తోస్తాయి,
భయపెట్టే, భయపడే గుంపుల్లో ఇమడలేవు,
నియంతల్ని కలగనే బానిసల గుంపుల్లో నిలబడలేవు

ప్రతిభావంతుల గుంపులిష్టమైనా
వారి పరుగు పందాల్లో పాల్గొనలేవు,
రసోన్మత్తులు, దయాపూర్ణులిష్టమైనా
వారి ఉద్వేగాల చివర్ల వెలితి భయం ,
జీవితంపై వెర్రి మోహంతో గుంపులు కనిపిస్తే
వారిలో దూరిపోవాలని ఉత్సాహపడతావు కానీ
వారిని విడిచాక, వెంటపడే ఏకాకితనం బావుండదు

కానీ, అగాథమైన నిశ్శబ్దముంది చూసావా,
మనుషులు గుంపుగా వెళ్ళలేనిది,

అది లోపలి నుండి చెబుతుంది,
నువు ఎవరికీ చెందవు, ఎవరూ నీకు చెందరు

ఆకాశం నుండి విముక్తి కోసం పక్షి ఎగురుతున్నట్లు
ఏ గుంపూ లేనిచోటికి ఎగరాలి,
నీ లోపలికి ఎగురుతున్నపుడు గానీ తెలుసుకోలేవు

గుంపులూ, ఏకాకితనాలూ లేనేలేవని,
నువు తెలియరాని ఏకాంతానివని,
ఉషఃకాలపు ప్రశాంతిలో తిరుగాడే
పండని, రాలని నారింజవంటివాడివని

26.1.2025 11.08 రాత్రి
బ్లాగ్ 16.9.2025

# బ్రతిమాలటం

జీవితాన్ని అక్షరాల్లో పట్టుకోవాలని ప్రయత్నించావు
చుట్టూ వీచే గాలినైనా పట్టుకోలేకపోయావు,
జీవితం అద్భుతం, తన ముందు అక్షరాలు
ఇలా వాలి మాయమైపోయే కిరణాలైనా కావు

అతి సున్నితమైన ప్రాణిలాంటిది జీవితం
స్వేచ్ఛ మినహా ఏది తాకినా ముడుచుకుపోతుంది,
నిన్ను స్వేచ్ఛలోకి వదులుకొనే సమయం కోసం
దయగా ఎదురుచూస్తుంది

చాలా పలుచని ఉనికి తనది
భయాలు వెలుతుర్లో చీకటిలా రాలిపోవాలి
లేత కోరిక దేనినో ఆసరా చేసుకొని చూడాలి
కోరికలు రాలిపోయి ఖాళీవై మిగలాలి

పగలూ, రాత్రుల నుండి బయటపడాలి
వెలుగూ, చీకట్ల నుండి, రంగులూ, నీడల నుండి కూడా
ఏ రుచీ, రంగూ లేని స్వచ్ఛజలం వంటి
జీవనస్పర్శ తెలియరానట్లు తెలుస్తుంది

మనిషిగా నిన్ను చూసుకొన్నపుడు
ఇదంతా ఏమిటని బాధగా, భయంగా తడుముతావు,
నిన్ను జీవితంగా తెలుసుకొన్నపుడు
ఏమిటిదంతా అని ఆశ్చర్యంతో, ప్రేమతో తాకుతావు

బ్రతుకుతాము, వెళ్ళిపోతాము
మేలుకొని, నిద్రపోయినట్లే

కానీ, రాలే చినుకులు, ఆకులు, శబ్దాలు
రాలే బంధాలు, ఉద్వేగాలు, అనుభవాలు
వీటి వెనుక దాగిన ప్రేమ ఎవరిదో తెలియరాదు
తెలియకపోవటంలోని బాధ కోసమా ఇదంతా

7.8.2024 11.45 రాత్రి
పాలపిట్ట సెప్టెంబర్ 2025

# వాళ్ళూ, నువ్వూ, ఆయనా

ఎవరిని వాళ్ళు, వాళ్ళ నుండే దాచుకోవటం నుండి
సుతారంగానో, బలంగానో తెరవాలని చూస్తావు
తెరిచేటపుడు కరుణతో ఏడుస్తావు, అది నీ అక్షరాలు

ఇంతా చేసి నువు నీటివి, నీటిపై ఒలికే నీడవి,
నీటిలో సేదతీరే బింబానివి
నీ పలుచని ఉనికి నీకు ఇష్టం

నీకింకా పసిదనం పోలేదు, పోదు కూడా
నీ కోసమింకా ద్వారాలు తెరుచుకొని ఉన్నాయి,
ఆయనతో అంటావు
నన్ను ప్రేమించావు సరే, నా వాళ్ళ గతి ఏమిటని

నీకు అక్షరమిచ్చాను వాళ్ళకేం చేయగలవో చేయంటారు
రండి, నా సోదరులారా సమయం మించిపోక ముందు,
కాంతిలోకి వెళ్ళిపోదామని బ్రతిమాలుతావు

వాళ్ళంటారు ఇక్కడ కూడా కాంతిగానే ఉంది,
నువు పిలిచే ఖాళీలోకి ఎందుకు వెళ్ళాలని

ఉన్నదంతా కాంతి కదా,
ఇప్పుడెవరు చీకట్లో ఉన్నట్లు, వాళ్ళా, నువ్వా
నీ సందిగ్ధతవైపు ఆయన దయగా నవ్వుతారు

20.4.2025 00.23 రాత్రి

# ఫలితం

కొన్ని అక్షరాలని
చీకటి ఆకాశంలో నక్షత్రాల్లా విరజిమ్మితే
కొంతసేపటికి గెలాక్సీలుగా మొలకెత్తుతాయా

కొన్ని భయాలని
పరిసరాల్లోకి చీకటిపొగలా పంపిస్తే
కాసేపటికి దయ పాదముద్రలు వినిపిస్తాయా

కొన్ని ఉద్వేగాలని
జీవితంలోకి వలలా విసిరితే
కొన్నాళ్ళకి బంధాలుగా ఫలిస్తాయా

కొన్ని సందేహాలని
కాలంలోకి తెరచాపల్లా వదిలితే
ఒకనాటికి జవాబుల కాంతుల్ని చేరుతాయా

ఇదంతా ఏమీ కాదు

లేకుండాపోయే చిన్ని ప్రార్థనని
అనంతంలోకి చేతులు చాచి వినిపిస్తే
ఏనాటికైనా కల చెదిరి స్వస్థత పొందుతావా

27.10.2024 11.52 రాత్రి
మహా పత్రిక 25.8.2025

# ఏ పనీ లేకుండా

ఏమీ కాకుండా
ఉత్తనే ఖాళీ గాలిలా మొదలుపెట్టగలమా
ఒక పనిని, మాటల అల్లికని
మానవ సంబంధాన్ని, జీవించటాన్ని

లక్ష్యంతో చాలా చేస్తాం కానీ, అదేం లేకుండా
ఊరకనే నవ్వగలమా, ఏడ్వగలమా
భయపడగలమా, ప్రేమించగలమా

యథాలాపంగా ఎండ కాస్తున్నట్లు,
చీకటి పడుతున్నట్లు, వాన కురుస్తున్నట్లు,
జీవులు తిరుగాడుతున్నట్లు
యథాలాపంగా బ్రతకగలమా

నదిలో మునిగి కడవలో నీరు దాచబోయినట్లు,
పూలరంగుల్లో మునిగి వాటిని త్రెంచబోయినట్లు
మనుషులు తనదనే వలలో పడి కొట్టుకుంటారు

ఇంత కాలం, ఇంత స్థలం
మన కోసం విరబూసిన కలువల్లానో,
కురులు విచ్చిన ప్రియాంగనలానో,
ఆమె కన్నుల్లోని లాలనలానో
వికసించి ఎదురుచూస్తున్నపుడు
విశ్వం నాదనకుండా చిన్నభాగంలో ఇరుక్కుంటాం

అమ్మ, నీ లేతచూపుల ప్రార్థనలేవీ కాదనలేనట్లే
ఇంత విశ్వం నువు ఏది అడిగితే వద్దందని,
ఇంత జీవితం నిన్ను ఎపుడు హత్తుకోలేదని

అలా బయటికి వెళ్ళి గాలిపటం ఎగరేద్దాం వస్తావా,
పోనీ మనుషుల్లో చిరునవ్వులు ఎగరేద్దాం,
పోనీ జీవుల కళ్ళల్లో ప్రేమలు ఎగరేద్దాం
అవి కూడా వద్దు గానీ, ఏ పనీ లేకుండా
ఊరికే కాసేపలా బయట తిరుగుదాం, వస్తావా

24.4.2025 11.10 రాత్రి

# జీవనానందం కొసన..

ఏవో పిచ్చిమాటలు మాట్లాడాలనిపిస్తుంది,
మాటలన్నీ పిచ్చివేనేమో తెలీదు

ఇంత అద్భుతంగా, నల్లగా మిలమిలలాడే రాత్రి
నీపై తెరపిలేకుండా కురుస్తున్నపుడు
మాటలేం అవసరమొచ్చాయి
మౌనంలోకీ, జీవితంలోకీ మునిగిపోక

ఊరికే మాట్లాడాలనిపిస్తుంది,
జీవనానందం తట్టుకోలేక
మాటల్లోకి తేలి ఊపిరి పీల్చుదామని

ఆయనన్నారు చూసావా
మనసు బ్రద్దలైన ఆనందం తట్టుకోలేక
ప్రాణం వదిలేశారని,
ఆ మాటకే మనసు బ్రద్దలౌతుంది

జీవనానందం, నువు ఉండటంలో ఉందో,
ఉండీ, లేకుండా పోవటంలో ఉందో తెలీదు,
అదంటూ ఒకటి ఉన్నట్లుంది

మాటలు తయారయే మనసులో
ఎన్ని మెలికలు వుంటాయో చూసావా,
వాటికి ప్రలోభపడకుండా ఉండగలవా

ఈ రాత్రిని రాత్రిలా, గాలిని గాలిలా,
ఈ నక్షత్రాలని నక్షత్రాల్లా
దేహంపై వస్త్రాలు లేనట్లు, దేహమే లేనట్లు
నిన్ను తెరుచుకొని అనుభవించగలవా
పొందుతున్నావో, పొందబడుతున్నావో తెలీని
పారవశ్యంలో మునగగలవా

ఇది జీవిత, మిది కాదని జీవులు చెప్పలేరు,
జీవులకంత తెలివుంటే,
వాటిని కన్న జీవితానికెంత తెలివుండాలి
నువు జీవివి కాదు,
జీవితానివని తెలిసేందుకు ఎంత దుఃఖపడాలి
ఎంత పదునుదేరాలి

7.3.2025 11.36 రాత్రి
బ్లాగ్ 2.10.2025

# వాక్య ప్రవేశం

నీ వాక్యంతో సంభాషణ
ఎటు మళ్ళిస్తావన్నది ముఖ్యం
తెరవబోయే లేదా మూసే ద్వారాలకి

మన చుట్టూ ఎండ, నీడ, చీకటి అలానే ఉంటాయి
మనమేం మాట్లాడబోతున్నామో చూస్తూ

జీవితం కూడా చూస్తూనే వుంటుంది
పదాలు ఎటు మలుపులు తిరుగుతాయోనని,
వాటిని బట్టి తన కాంతి ప్రవేశపెట్టాలి మరి

వాక్యం అంత ముఖ్యం,
వాక్యంతో ప్రవహించే ఉద్వేగం అంతకన్నా ముఖ్యం

దాని స్వచ్ఛత, తీవ్రత తనని హత్తుకుంటాయా,
తన నుండి దూరం జరుపుతాయా అని
జీవితం ఆతృతగా ఎదురుచూస్తుంది
బిడ్డ బాగు కోసం కన్నకడుపు చూసినట్లు

నీ మౌనంతో సంభాషణ
ఎలా ముగిస్తావన్నదీ ముఖ్యమే,
అది చాతనైతే జీవితంలో ప్రవేశించటం తెలిసినట్లు

7.1.2025 10.25 రాత్రి
కవిసంధ్య మే 2025

# వాక్యాల కవతల

నీకు తెలుస్తుంది
వాక్యాలతో పూలమాలలు సృష్టించమెలానో,
ఖడ్గచాలనం చేయటమెలానో,
చిరునవ్వుల్నీ, కన్నీటినీ పుష్పించటమెలానో

నీలాకాశంలో ఇంద్రధనువులు సృజించే జీవితమే,
నీకు శబ్దంలో లోకాలు సృజించటం నేర్పుతుంది

వాక్యంతో చాలా చేస్తావు,
గాయాలకి లేపనం అద్దుతావు,
గర్వాలు గాయపరుస్తావు,
పసిమనసులకి ఊరట నిస్తావు,
కఠినులకి కాంతులు చూపిస్తావు

కానీ, నీకు తెలియకుండాపోతుంది,
వాక్యాల కవతల ఖాళీ ఆకాశం ఉందని,
అక్కడ గాలీ, నీరూ, కాంతీ స్వేచ్ఛగా ఎగురుతాయని

అక్కడ ఎండుటాకుల శబ్దాల్లో
నువు చూడలేని పూలు వికసిస్తాయని,
జీవితం నిండుగా ఫలించి
అనంతాన్ని అనంతం ప్రేమిస్తుందని

16.3.2025 00.30 రాత్రి

# జరగనివ్వాలి..

పూలు రాలుతుంటే రాలనివ్వాలి,
సీతాకోకలని ఎగరనివ్వాలి,
వాటిని కవిత్వం చేయాలనీ,
బొమ్మలుగా తీర్చాలనీ తలచరాదు

నీ లోంచి నవ్వు వస్తే రానివ్వాలి,
భయం పుడితే పుట్టనివ్వాలి
వాటిని తిరిగి తిరిగి దిద్దాలనీ,
కాదనో, ఔననో తేల్చాలనీ చూడరాదు

గాలి వీచినట్లు సహజంగా,
నీరు పారినట్లు సరళంగా
జరగనివ్వాలి, వెళ్ళనివ్వాలి

తేలికగా ఉండాలి, తెలియనట్లుండాలి
ప్రపంచాన్ని తన కల కననివ్వాలి,
అనంతాన్ని తన కౌగిలిలో ఉండనివ్వాలి

పెద్దగా గొడవపడేదేం లేదు ఇక్కడ,
అంతగా నిలబెట్టుకోవలసింది కనరాదు,
కాలం గడిచిందా, లేదా అన్నట్లుండాలి,
స్థలమొకటుందా, లేదా అనుకోవాలి

ఊరికే కదలాలి, మాట్లాడాలి,
అలసటతో హాయిగా నిద్రపోవాలి,

కడపటి బిందువు ఎదురైనపుడు
తృప్తిగా దానిలో లీనం కావాలి

6.11.2024  00.25 రాత్రి
సారంగ 1.9.2025

# కొన్నిసార్లు..

కొన్నిసార్లు రాయాలనిపించదు,
ఊరికే బ్రతకాలనిపిస్తుంది
అపుడు గాలిలో కాక, గాలిలా ఉంటావు
చీకటిలో కాక, చీకటిలా,
దీపకాంతిలో కాక, దీపకాంతిలా

జీవితంలో కాక, జీవితంలా ఉండేవేళల
నీటిలా పలుచగా, గాలిలా తేలికగా, కాంతిలా వికసిస్తూ

ఊహించని శబ్దమై చిట్లిన నిశ్శబ్దం
ఇదంతా నిజమని చెవిలో చెబుతుంది,
శబ్దంలోంచి వికసించే నిశ్శబ్దం
ఇదంతా కల అని కంటిముందు చూపిస్తుంది

కొన్నిసార్లు ప్రపంచాన్ని అనుభవించాలనిపించదు,
ఊరికే ఉండాలనిపిస్తుంది,
వట్టినే నిద్రలోకి జారిపోవాలనిపిస్తుంది

అప్పటివరకూ పరిపరి విధాల పలకరించిన ప్రపంచం
వానలో తడిసే చిత్రపటంలా కరిగిపోతుంది,
అదృశ్య చిత్రకారుడెవరో నిర్వికారంగా, శాంతిగా
నిన్ను నిన్నులా చూస్తున్నట్లుంటుంది

28.2.2025 00.10 రాత్రి
బ్లాగ్ 27.9.2025

# లెక్కలు

లెక్కలు దాటగలవా అంటుంది లోపలి ఖాళీ,
ప్రియమైన వ్యక్తిలానే, నమ్మిన గురువూ, దైవంలానే

సూర్యుడు ఉదయిస్తాడు బంగారుకాంతులతో,
పిల్లలు నవ్వుతారు వెన్నెలలా తెల్లగా, చల్లగా,
పూలు వికసిస్తాయి రంగులు లోకంలో ఒంపుతూ,
చల్లటిగాలి తాకుతుంది తల్లినో, తండ్రినో గుర్తుకుతెస్తూ

బావుంటాయి కొన్ని క్షణాలు
ఎండుటాకులా రాలినవి, కెరటంలా వాలినవి,
నిద్రలోకి మెలకువలా జారినవి

బావుంటాయి, నీకు నువ్వు మిగలనివి,
నిన్ను చెరిపేసుకున్నవి, చెరిపేందుకు అనుమతించినవి
అవి క్షణాలు, క్షణాలలో దాగిన యుగాలు,
యుగాలలో దాగిన కాలం లేని సమయాలు

లెక్కలు దాటగలవా,
అక్కడుంది రహస్యమంటుంది ఖాళీ గాలి,
ఖాళీ ఆకాశం, ఖాళీ ఉద్వేగం, ఉత్త ఖాళీ

ఈ మాటలు ముగిశాయా, లేదా..

22.6.2025 10.18 రాత్రి
సాహిత్యనిధి నవంబర్ 2025

# కొంతదూరం వెళ్ళాక

కొంత దూరం వెళ్ళాక
నీకు మనుషులకీ, రంగులకీ భేదం తెలీదు,
శబ్దాలకీ, ఉద్వేగాలకీ, అనుభవాలకీ కూడా

ఇదంతా ఒకే అనుభవం,
ఒకే మెలకువ, జీవితం
ఒకే వాన, పగలు, వెన్నెల,
ఒకే నక్షత్రాల నిశ్శబ్దం

కొంత దూరం వెళ్ళాక, వెళుతూ ఉండగా
ఒంటరిగా మిగులుతావు,
చుట్టూ ఉన్నవి చెరిగిపోతాయి

విడిగా చెరిగి, ఒకటిగా తేలుతాయి
అలలపై చెదిరిన చందమామ
నిశ్చల తటాకంపై తేలినట్లు

కొంత దూరం వెళ్ళాక
జీవించేవాడిగా కాక జీవితంగా మిగులుతావు

4.5.2025 11.35 రాత్రి
బ్లాగ్ 25.10.2025

# ఖాళీగా..

ఖాళీలోంచి వచ్చావు, ఖాళీలో కలిసిపోతావు
మధ్యలో ఖాళీగా ఉండలేవా
అన్నారాయన టీ కప్పు పెదాలకి తాకిస్తూ

ఈ లోకం కూడా
ఖాళీలోంచి వచ్చింది, ఖాళీలోకి పోతుంది
మధ్యలోవి ఖాళీ పనులే గదా
అన్నాడతను కప్పు కింద పెడుతూ

ఖాళీలని గుర్తిస్తే సరే అన్నారాయన
కప్పులు ప్రక్కకి జరుపుతూ

10.5.2024 10.30 ఉదయం
సారంగ 1.9.2025

# గది బయట

ఆయనన్నది  నిజమనుకుందాం,
నువు గదిలో వున్నపుడు, గోడల కవతల
ఉత్త ఖాళీ మినహా లోకమనేదేమీ లేదు,
గోడల కవతల గతం లేదు, భవిత లేదని,
ఊరికే ఊహించుదాం, నమ్ముదాం

నమ్మకాలు, శబ్దాల గింజలు చల్లితే వాలే పావురాలు
గనక, నమ్మటమేమీ కష్టం కాదనుకుందాం

గది కవతల ఉత్త ఖాళీ మినహా,
ఆకాశం కూడా లేని, ఖాళీ కన్నా లోతైన ఖాళీ మినహా,
ఏమీ లేదనుకుందాం
ఏమైనా ఉందో, లేదో, తెలీదో, తెలుసో చెప్పలేని,
అయోమయంలో ఉన్నామనుకుందాం

భాషని శ్వాసించి బ్రతికే కనరాని ఇంద్రియమొకటి
భాషని దాటలేక,  భాషలో బ్రతికే ఊహని దాటలేక,
చతికిలబడిందనుకుందాం

అపుడు, గది వెలుపలి ఖాళీనే గది లోపల ఉంటుంది,
రెక్కలపై ముసిరిన వల చెరిగిపోయి,
పక్షి గగనంలో తేలుతుంది

ఆయనన్నది కాసేపు నిజమనుకుందాం

గదిలోనే కూర్చుని, గది బయటి ఖాళీ లో
మునుగుదాం లేదా తేలుదాం

ఆయన : ఒక మిస్టిక్, ఒక గురువు

16.3.2025 00.04 రాత్రి
బ్లాగ్ 4.10.2025

# ఏకాంతసమయం

చెట్టు నుండి రాలిన ఆకు
తనదైన ఏకాంతంలో మునిగింది,
ఆకులు రాలిన ఊరు
తన ఏకాంతంలో తాను మునిగివుంది

ఊరు నివసించే భూమి
తన ఏకాంతంలోకి చేరుకొంది,
భూమిని శూన్యంలో తేల్చే విశ్వం
తనదైన ఏకాంతంలోకి మేలుకొంది

ఆకులు రాల్చిన కాలం
తనదైన ఏకాంతంలో
లోలోపలికి మేలుకొంటోంది
నీ లోంచి, నా లోంచి, నవ్వుల్లోంచి, భయాల్లోంచి

కాలంలా ప్రవహించే ఆనందం
ఎప్పుడూ, ఏమీ పట్టక
తనదైన ఏకాంతంలో
తనలోనే మునుగుతూ, తేలుతూ..

5.1.2025 10.01 రాత్రి
బ్లాగ్ 9.9.2025

# వెలుగునీడల దోబూచులాటలో తండ్రీ తానే, బిడ్డా తానే

*1*

కవి రాసిన సృష్టి కావ్యం ఆసాంతం, ఒకటికి రెండుసార్లు చదివాను. కవి ఏం చెబుతున్నాడో కనెక్ట్ కావడానికి ప్రయత్నించాను. ఇది సున్నితమైన, కళాకారుడైన ఓ జీవుడి ఘర్షణ. ఘర్షణ నుండి, ద్వంద్వాల నుండి బయటపడాలని చేస్తున్న తాత్విక ప్రయాణం. ఏది నిజమో, ఏది అబద్ధమో పూర్తిగా తేల్చుకోలేని ఊగిసలాట. దొరికినట్లు, జారినట్లు ఉండే జీవనఫల ప్రయాణం.

**బయటి మనిషికి, లోపలి మనిషికి మధ్య నడుస్తున్న రాయబారం. బయటి ప్రపంచంలో కొడుకు అలసిపోతే, తన లోపలి తానే తండ్రిగా కొడుకు భుజం మీద చెయ్యి వేసి ఓదార్చుతున్న తాత్వికకావ్యం.** ఇక్కడ తండ్రీ తానే, కొడుకూ తానే. బాధా తానే, బోధా తానే. బాహ్యానికి అంతరానికి మధ్యలో సంధి కుదిర్చే ప్రయత్నం. లోకం నుండి పోవాలనుకునే కవికి, ఉండాలనుకునే కవికి మధ్య సయోధ్య ఈ కావ్యం. పొంతన కుదరని ఆంతర, బాహ్యాలకు, చీకటి, వెలుగులకు మధ్య సమన్వయ ప్రయత్నం ఈ కావ్యం. సత్యాసత్యాల సంఘర్షణ ఈ తాత్వికకావ్యం. మనసు పగుళ్ళతో విరక్తి చెంది, మనసులేని ప్రకృతి ఒడిలో సాంత్వన పొందుతున్న కవి అంతరంగప్రయాణం ఈ కావ్యం.

ఇట్లాంటి మనోస్థితిని అనుభవించే సున్నితమైన బుద్ధిజీవులు ఉండవచ్చు. కానీ, దాన్ని ఓ తాత్వికకావ్యంగా మలుచుకుంటూ, దాంట్లోనే విముక్తిని కోరుకునే ఇలాంటి కవులు అరుదుగా ఉంటారు.

**ఇది తనకు తానే రాసుకున్న మ్యూజింగ్స్‌లాంటి కావ్యలేఖ.** ఈ కవిత్వం చదివి, అర్థం చేసుకున్న తరువాత నాలో ఈ విచారధార అప్రయత్నంగా ఇలా వస్తున్నది. ఇది కవిత్వ పరామర్శకు సంబంధించిన విషయమా, కాదా నాకు తెలియదు. కవిత్వాన్ని తూచే కొలతలూ తెలియవు. ఈ కావ్యమంతా కవి జీవితస్వేచ్ఛను,

విముక్తిని కోరుతున్నాడు. ఇది సుస్పష్టం. అయితే విముక్తి దేని నుండి? తన నుండి తనకే! ఇంతకీ ఆ తను ఎవరు? తనువా, ఆలోచనా; రూపమా, మానసిక నిర్మాణమా?

## 2

**సూక్ష్మంగా ఆలోచిస్తే ఇలా ద్యోతకమవుతుంది :** మనం పుట్టామా? పుట్టినట్లు అనుకుంటున్నామా? పుట్టింది తనువా? ఆలోచననా? పుట్టినట్లు మనకు ఏ వయసు నుండి అనుభవంలో ఉంది? మన ఇంట్లో పెరుగుతున్న పిల్లలను జాగ్రత్తగా చూసినా కూడా ఏం అర్థమవుతుంది? నేను పుట్టాను, అందరితోపాటే పెరుగుతున్నాను అనుకుంటూ, నేను వేరు అనే వ్యక్తిత్వభావనను పెంచుకుంటారు. చుట్టూ ఉన్న సమాజం అలానే నేర్పుతుంది. నమ్ముతాడు. అదే అలవాటుగా మారుతుంది. గత సంస్కారం ద్వారానో, జీన్స్ ద్వారానో కొన్ని లక్షణాలను తెచ్చుకుంటాడు. స్థల, కాలాలు మారుతున్నట్లుగా అనుభవంలోకి వస్తుంటాయి. అవి నిజమని నమ్ముతాము.

నామరూపాల మాంత్రిక సముద్రంలో ఈదడం మొదలెడతాము. భాషకు, రూపానికి సంబంధించిన అర్థాలు ఇవే అని బలపడుతుంటాయి. జ్ఞాపకాల బలం పెరుగుతుంది. సమాజం, మతం , సైన్స్ అనేవి కూడా శాస్త్రం, హేతువుల పేరుతో ఈ 'అనుకోడాన్ని' మరింత బలపరుస్తున్నట్లుగా కనిపిస్తాయి. కండిషన్ అవుతాము. ఇలా కండిషనింగ్ గా మారడమే అహంగా మారడం. అహమంటే ఒక్కటిగా కాకుండా భేదంతో చూడడం, భేదమైపోవడం. ఇదే స్ట్రాంగ్, ఫిక్సెడ్ అండ్ రిజిడ్ గా మారి నేను నీవు అనే సపరేషన్‌తో, గొప్ప శక్తిగా విస్తరిస్తుంది. పోలికతో గొప్ప ఆటను సృష్టిస్తుంది. కానీ, తనను తాను మరిచి, పెద్ద సమస్యై కూర్చుంటుంది.

**మనిషి గాయపడడమంటే, దుఃఖపడడమంటే ఈ అహం గాయపడడమే. భయపడడం అంటే అభద్రతతో ఈ అహం భయపడడమే. సుఖసంతోషాలు కూడా ఈ అహానికే.** అహం చుట్టూ నేను, నీవు; నాదీ, నీది; మంచీ, చెడు; ఈర్ష్య, అసూయ; సుఖదుఃఖాల వలయం ఏర్పడుతుంది. అది నైజమై కూర్చుంటుంది. ఈ ఫాల్స్ ఇగో ముదిరి పెద్దదవుతుంది. ఇక దాని నుండి

బయటపడం.

చుట్టూ ఉన్న వాతావరణంలో మనం భౌతికంగా మానసికంగా అలానే పెరుగుతున్నట్లుగా భావిస్తూ, ఆ మనోనిర్మాణానికి అలవాటుపడతాము. తాను శరీరాన్ని మాత్రమే అనే ఆలోచనతో బందీ అవుతాము. **ఆలోచన అంటే కాలమే. కాలం, ఆలోచన పరస్పర ఆశ్రయాలు.** మొదటి ఆలోచన మరెన్నో ఆలోచనలను సృష్టిస్తుంది. ఎన్నో ఆలోచనలు జ్ఞాపకాలుగా, జ్ఞాపకాలు ఆలోచనలుగా మరింత ముదురుతాయి. ఇంద్రియజ్ఞానం దృఢమైన ఓ నమ్మకంగా, నిజంగా మారుతుంది. ఇలా ఈ కంటిన్యూటీ అనే తాడుతో బలంగా కట్టివేయబడి, కొనసాగి అసలైన తనను మర్చిపోతుంటాము. పోలిక, కోరిక, లక్ష్యం, ఐడెంటిటీ, అసూయ, అవసరం, అహంకారం, చర్యా, ప్రతిచర్యలతో భగభగ మండుతుంటాము. ఇక ఈ కంటిన్యూటీ తాడు తెగదు.

వాస్తవానికి మనకు పుట్టిన అనుభవమూ లేదు, మరణించిన అనుభవమూ లేదు. కానీ అందరిలాగే పుట్టినట్లు, మరణిస్తున్నట్లు నమ్ముతుంటాము. ఇతరులను అంటే బాహ్యంలోని మార్పును చూసి, మన మార్పును నమ్ముతాము. మారినట్లుగా ఉన్నది బయటనా, మన లోపలనా? ఈ ఇతరమే పెద్ద మాయ! ఇతరం ఉన్నదా, ఉన్నట్లు కనిపిస్తున్నదా? ఇతరము తనలో ఉన్నదా, బయట ఉన్నదా? ఇది కేవలం తన ఆలోచనలలో మార్పా, సత్యమా? ఆలోచనలు ఎక్కడినుండి ఎందుకు మొదలయ్యాయో, దాని పునాది ఎక్కడుందో తెలియదు. కనీసం రెండు ఆలోచనల మధ్యన ఉన్న ఖాళీని స్పష్టంగా చూడలేని ఆలోచనల వేగపరంపర. ఇక ఆ కంటిన్యూటీ తాడు తెగదు.

**అనుకోవడాలూ, అలవాట్లూ అనే ఈ రెండూ మనల్ని బంధిస్తాయి. తానే వేటగాడై పన్నిన మాయావల ఇది. వల వేసిన వేటగాడూ తానే, చిక్కుకున్న పక్షీ తానే.** అది మనం ఏర్పరుచుకున్న మాయవల అని తెలియకుండానే మన ఒరిజినాలిటీ కోల్పోతాము. భౌతికంగా చూస్తున్నదే నిజమని నమ్ముతాము. ద్వంద్వాల సుడిగుండంలో గిరగిరా తిరుగుతుంటాము.

గాయపడుతుంటాము. పడతాము, లేస్తాము, మళ్ళీ పరుగెడతాము. వాస్తవానికి సత్యం కోసం నిజంగా కలవరించే సతాన్వేషికి దుఃఖం, నొప్పి, కన్నీళ్ళు అనేవి వరమే. గాయాలు తూట్లు పొడుస్తున్నపుడు, బాహ్యం పట్ల భ్రమ తగ్గి, సత్యం కోసం లోపల చూసుకునే తపన తీవ్రమవుతుంది. ఇంద్రియ, ఇంద్రియాతీతమైన అనుభూతుల ఘర్షణలో తన తావును వెతుక్కునే ప్రయత్నం నిరంతరం చేస్తుంటాడు. దాని స్పర్శ ఏ కొంచెం దొరికినా, మళ్ళీ మళ్ళీ దాన్ని పొందాలని ప్రయత్నిస్తుంటాడు.

అయితే అలవాట్లు, అంటే, బలమైన వాసనల వల్ల, అంతర్లీనంగా ఉన్న వ్యక్తిత్వకాంక్షల వల్ల, దొరికిన నిజస్థితి అవగాహన నుండి జారిపోతుంటాడు. ఈ కావ్యంలో కూడా కవి తనకు దొరికినట్లే దొరికి చేజారిపోతున్న స్వస్థితి స్పర్శ కోసం వేదన పడతాడు. తన నిజస్వరూపం కోసం అల్లాడుతుంటాడు. తానే తయారు చేసుకున్న తన మనోనిర్మాణంతోనే నిరంతరం గాయపడుతూ, దాన్ని దాటిన స్వస్థితి కోసం కలలు కంటాడు. అటువంటి తాత్వికకవి మనస్సును, తపనను ఈ కవిత్వం నిండా చూడవచ్చు.

ఏ "అనుకోవడాలు" ద్వారా, ఏ అలవాట్ల ద్వారా, ఆలోచనల ద్వారా ఈ మాయాప్రపంచంతో మానసికబంధం ఏర్పరచుకుని ఓ మనోనిర్మాణపు వలయంలో చిక్కుకున్నాడో కవి, ఆ నిర్మాణాన్ని తొలగించుకునే ప్రయత్నం చేస్తూ, లోకంతో సమన్వయం కోసం, తన శాంతి కోసం, తప్పిపోతున్న తనకు, తానే బోధించుకుంటూ, తిరిగి దారిలో పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తనను తానే ఓదార్చుకుంటూ అమృతఘడియల వైపు ప్రయాణిస్తున్నాడు. తన జీవనయాత్రలో ఎన్నిసార్లు దారి తప్పి దుఃఖపువలలో చిక్కుకున్నా, తిరిగి మళ్ళీ మళ్ళీ లేస్తూ, ఏ మానసికఛాయలు లేని అమ్మలాంటి సహజప్రకృతి ఒడిలో సేద తీరుతూ, తనదైన రాగంలో పాటలు అల్లుకుంటున్నాడు కవి.

## 3

ఈ కావ్యమంతా తనే గురువు, తనే శిష్యుడు. తనే తండ్రి, తనే

బిడ్డా. వేదన తానే, ఓదార్పు తానే. కవి అత్యంత సున్నితత్వం గలవారు. ఆ సున్నితత్వంలోంచే తన్ను తాను ఆవిష్కరించుకుంటున్నారు. తన సంతోషాల్ని, దుఃఖాల్ని, గాయాలను, ఆత్మానందాన్ని, భయాల్ని, ఓదార్పుల్ని , కన్‌ఫెషన్స్ ని, తాను శాంతిని పొందుతున్న తావులని కవితలుగా మలిచారు. ఎవరికో ఏదో చెప్పడం కాకుండా తనకు తాను లోపలి టోన్‌లో చేసుకుంటున్న ఆత్మావిష్కరణ. ఇది ఓ రకంగా భిన్న ప్రయోగం. తన కవితాశక్తి ద్వారా కవి తన మనోభూమికపై ఎగసిపడుతున్న అలల సముద్రానికి పటం కట్టి తనను తాను చూసుకుంటున్నాడు. మనల్ని మనకూ చూపిస్తున్నాడు. ఐడెంటిఫై చేసుకునే వాళ్ళకు కవి చాలా దగ్గరగా తోస్తాడు. దిస్ ఈజ్ ఎ వెరీ యూనిక్ అండ్ సెన్సిబిల్ టోన్.

జననం, మృత్యువు, మనస్సు, విముక్తి, సత్యం, అసత్యం, స్వర్గం, కల, మెలకువ, గాయాలు, నవ్వులు, ఏడుపులు, సుఖం, ప్రేమ, దయ, శాంతి, అసూయ, దిగులు, వేదన, ఆనందం, కలత, లాలస, స్పర్శ, దుఃఖం, వెలితి, గాయం, క్షమా, స్నేహం, ఏకాంతం, నిట్టూర్పు, పోలిక, కోరిక, ఓదార్పు, భయం, బాధా, ఆశ్చర్యం, మంచీ, చెడూ, అనుమానం, అనంతం, జ్ఞానం అనే ఈ జీవనకోణాలన్నిటి వెంట కవి పదేపదే ప్రయాణించి తన నిశ్శబ్ద ఏకాంతానికి చేరుకునే ప్రయత్నం చేస్తుంటాడు.

ఈ కావ్యంలో వాడిన సింబాలిక్ ఇమేజెస్ మొత్తం చూస్తే, కవి రాగ ద్వేషాలు అంటని స్వచ్ఛప్రకృతి ముందు తనను తాను హృదయార్పితం చేసుకోవడం వలన, తన త్రోవ ఏమిటో స్పష్టపరుస్తున్నాడు. ఆ ఇమేజెస్ : ఆకాశం, నక్షత్రాలు, మేఘాలు, చంద్రుడు, సూర్యుడు, పగలు, రాత్రి, కాంతి, గాలి, నీరు, వెలుతురు, పూలు, కాలం, సూర్యాస్తమయాలు, వాన, మబ్బులు, ఇంద్రధనస్సు, మంచుబిందువు, రంగులు, పిట్టలు, సీతాకోకలు.

ఇలా మనసు సోకని బాహ్యప్రకృతిని కవి పదేపదే వాడడంలో ఆ నిర్మలప్రకృతిని ఆలింగనం చేసుకుంటున్న తీరును గమనిస్తే, లోకం, మనుషుల తీరుకన్నా, తనను గాయపరచని, దుఃఖపరచని ప్రకృతి జాడలే తనకు సుఖమని సింబాలిక్‌గా నమ్ముతున్నాడు. అంతేకాకుండా మనోమాలిన్యం లేని, తన లోపలి

సత్ వస్తువు పట్ల ఎట్లా తపించిపోతున్నాడో కూడా ఈ సింబాలిక్ ఇమేజెస్ వల్ల అర్థమవుతున్నది. మనస్సు లేని అటువంటి తావుల్లో తన శాంతిని కాంక్షిస్తున్నాడు. ఈ ఇమేజెస్ అన్నీ బయటి వస్తువులుగా కనబడుతున్నా, మనస్సు అంతమయ్యే లోపలిచూపుకు దారిగా కవిని అవి గట్టిగా పట్టుకుంటున్నాయి.

కవి ఎక్కడ ఉన్నాడని చూస్తే, కవితల్లో ద్వంద్వాల మధ్య మానసికయుద్ధం చేస్తున్నాడు. వీటిలో లోకంతో పొసగక అశాంతితో, ఇక వెళ్ళిపోతాను అన్న కవితలూ ఉంటాయి. జీవితేచ్ఛతో సమన్వయాన్ని పొందుతూ, హాయిగా బతికిన క్షణాలను గుర్తుకు తెచ్చుకుని శాంతిని పొందిన కవితలూ ఉంటాయి. తనకు తానే గురువై బోధించుకుని ఓదార్చుకుంటున్న కవితలూ ఉన్నాయి. **ఒక కవిత నుండి మరో కవితకు కాంట్రడిక్షన్‌లా అటూ ఇటూ ఊగిసలాడడం ఉంటుంది.** ఒక కవితలో జీవితామృతం దొరికిందని జీవితేచ్ఛను వ్యక్తం చేస్తారు, మరో కవితలో జీవితం దుఃఖమయమని నిరాశను వ్యక్తం చేస్తారు. ఇవి ఆయా సందర్భాల్లో కవి మూడ్స్‌ని రిఫ్లెక్ట్ చేస్తాయి.

రచయిత, సత్యాన్వేషి చలంగారు కూడా తన నలభై ఏళ్ళవయసులో జీవితం చాలా నిరాశగా ఉంది అన్నారట. ఏభై ఏళ్ళ వయసులో ఇక జీవితంలోంచి వెళ్ళిపోవాలనుకున్నారట. అరవై ఏళ్ళు వచ్చేసరికి అసలైన జీవితం ఇప్పుడే మొదలైంది అన్నారట! ఇక్కడ అరవై ఏళ్లకు చేరుకుంటున్న కవి మనోభావాలు కూడా ఆశనిరాశలవలయంలో చలిస్తూ ఉంటాయి. గ్రౌండ్‌లెవల్‌లో ఉండి తనను తాను ఆవిష్కరించుకుంటున్నారు. రోజువారీ డైరీ రాసినట్లు, సందర్భాలను బట్టి ఈ కవితాశిల్పాలను మనసుపెట్టి చెక్కారు. అందుకే కవిని చదువుతూ మనల్ని కూడా అందులో చూసుకోవచ్చు.

## *4*

కవి మనోరీతిని ఈ కవితల్లో చూడవచ్చు :

"ఈ లోకంలో ఏమన్నా బ్రతికితే, చిన్నపుడు బ్రతుకుతాం, మిగిలిన

జీవితమంతా బదులు చెల్లిస్తాం, కాసిని శైశవక్షణాలు అనుభవించినందుకు ఇంత బదులుతీర్చడం అవసరమా అని అడుగుతావు దేవుడిని, ఉండీ, లేనివాడిని, లేకుండడంలో దాగినవాడిని, జవాబురాదు, బ్రతికావు కదా కాసిని రోజుల్లో, నిమిషాలో, శుభ్రమైన పసిదనంలో, స్వేచ్ఛలో, భయరహిత క్షణాల్లో, ఏదీ గుర్తుండని కాంతిలో, చెల్లించి వెళిపోవా మిగిలిన బరువైన రోజుల్ని''. ఇలా కవే తనను బ్రతిమాలుకుంటూ, సంవేదనను అనుభవిస్తూ, భారమైనా సరే మిగతా జీవితం గడపాలి అంటాడు. ఇదంతా భయావహ ప్రపంచం అంటాడు.

"జీవించడం అసౌకర్యమైన అనుభవం, పీడకలలవేళ దేహం కూడా కదిలినట్లు, జీవితం నుండి మరణంలోకి నిన్ను నీవు బ్రతిమాలుకుంటావు'' అని తనను మరణంలోకి లాక్కొంటాడు. మనుష్యులతో తనకు సంబంధం లేని క్షణాల్లో ప్రపంచం తటాలున విశాలమవుతుంది అంటాడు. మనుషులు తనకేమీ కాని క్షణాలు, వారు తన చేతనలోకి చొరబడని క్షణాలు అద్భుతం అంటాడు. ఉన్నచోటును విడిచి లోపలికి వెళ్ళకుండా, బయటకి రాకుండా తనలోని భయమే తనను అడ్డుకుందని వాపోతాడు. దుఃఖపు తేనెపట్టు పిండి, జీవితం చప్పరించాలని చూశారట, కానీ చివరకు విషాదమే మిగిలింది అని వేదన చెందుతారు.

తెలియకపోవడంలోని హాయిని పసిపాప తేలికగా అనుభవిస్తుంది, తెలియటం కదా ఇంత దుఃఖానికి మొదలు అని విచారం వ్యక్తం చేస్తారు. రాత్రులు నిదురించే ముందు దైవాన్ని ఇది కడపటి నిద్ర కావాలని ప్రార్థిస్తారు కవి. "విసుగుపుట్టే రోజున తెలివిలేని సినిమాకు వెళ్ళినట్లు తీరికగా చేరుతావు ఈ లోకంలోకి, ఇది బాలేదు, అయినా వెళ్ళలేవు, అట్లాగని ఉండాలన్న ఉబలాటం లేదు'' అని తన మనోస్థితిని ఆవిష్కరించుకుంటారు.

కవి బ్రతికి ఉన్న క్షణాలు, తన జీవితంలో తనకు హాయిని, ఆశ్చర్యాలను ఇచ్చిన అద్భుతాలని కూడా ఇలా పట్టుకుంటాడు :

పున్నమి చంద్రుడు నెమ్మదిగా ఎగురుతున్నపుడు, ఇంద్రధనువులు రంగులని విరజిమ్ముతున్నపుడు, ఉదయపు వెలుగు, పిట్టలు పాడడం, లేళ్ళు

గెంతడం, పిల్లలు నవ్వడం, యవ్వనం ప్రేమించుకోవడం, సెలయేళ్ళు ప్రవహించడం, సూర్యుడు కాంతిని విరజిమ్మడం, అమ్మ బిడ్డతో దోబూచులాడడం, తనతో తాను హాయిగా నవ్వుకున్నపుడు, తన బిడ్డను కడుపారా కావలించుకున్నపుడు, ఆజన్మాంతం గాలిపటంలా ఎగిరే ఆకాశాన్ని చూసినపుడు, ఎండ పాడుకునే సన్నటి నేపథ్య సంగీతం విన్నపుడు, చేపల్లా ఈదే రాత్రులను, పగళ్ళను చూసినపుడు, ఇట్లాంటపుడు తాను మృత్యువును దాటాను అంటాడు.

వాన కురిసినప్పుడు తనకు తాను దక్కుతారట! ఎడతెగని వాన తనను కాగితపు పడవ చేసి ఎటైనా తీసుకపోతే బాగుంటుందని ఎదురుచూస్తాడు. ఉదయాలు బంగారాన్ని వెదజల్లింది తన ప్రశాంతమైన చూపు కోసమే కావచ్చు అంటాడు. ఉదయం గడ్డిపరకపై వాలిన మంచుబిందువు, దానిలో ఆడుకుంటున్న రంగులు, ఏవీ పట్టకుండా ఓ బైరాగిలా ఊరిలో, తన ఇంట్లో తిరుగాడే క్షణాలుంటే అద్భుతమంటారు. ఇలాంటివి తాను బతికున్న క్షణాలకు గుర్తులుగా ఉన్నాయంటాడు.

**కవి తనను తాను ఓదార్చుకుంటున్న క్షణాలు :**

నీలోంచి నవ్వు వస్తే రానివ్వాలి, భయం పుడితే పుట్టనివ్వాలి, పూలు రాలుతుంటే రాలనివ్వాలి, సీతాకోకలని ఎగరనివ్వాలి, గాలి వీచినట్లు సహజంగా, నీరు పారినట్టు సరళంగా జరగనివ్వాలి, వెళ్ళనివ్వాలి. తేలికగా ఉండాలి, తెలియనట్లు ఉండాలి, ప్రపంచాన్ని తన కల కననివ్వాలి, పెద్దగా గొడవపడేదేం లేదు ఇక్కడ, అంతగా నిలబెట్టుకోవాల్సింది కనరాదు, కాలం గడిచిందా లేదా అన్నట్లుండాలి, స్థలమొకటుందా లేదా అనుకోవాలి, ఊరికే కదలాలి, మాట్లాడాలి, అలసటతో హాయిగా నిద్రపోవాలి, కడపటిబిందువు ఎదురైనపుడు తృప్తిగా దానిలో లీనం కావాలి.

అనుకునేంత భయావహం కాదు, ఊరికే ఉండు కాలువలో నిశ్శబ్దంగా పారే నీటిలా, బ్రతకాలని చూడకు, పోవాలని కూడా, ఉండటమే చాలు, అంతకన్నా నీ నుండి ఈ గాలి కోరేదేమీ లేదు అని ఓదార్చుకుంటారు. మనమా బ్రతికేది, వెళ్లిపోయేది, జీవితం తనను తాను చూసుకుంటుంది, నమ్మకం లేకపోతే నీలాకాశం కిందికి వెళ్ళి చూడు విస్ఫారిత నేత్రంతో నిన్ను చూస్తూ నీకు నమ్మకాన్ని ఇస్తుంది అని తనకు

తాను ఓదార్చుకుంటూ తేలిక పడతారు .

మృత్యువు గురించి ఇలా వివరిస్తారు :

"చూస్తూ ఉండగా కాలం చివరికొస్తుంది, పలుసంధ్యలు పూలలా రాలిపోతాయి, పలు చందమామలు ఉదయాల్లో కరిగిపోతాయి, ప్రేమ నిండిన నవ్వులు తడి నిండిన బంధాలు, చూస్తూ ఉండగా పొడిబారిపోతాయి, కాలం చివరికొస్తుంది, కలలు చివరికొస్తాయి, దుఃఖాలు చివరికొస్తాయి, బ్రతుకు భయం చివరికొస్తుంది, స్వర్గమో నరకమో తెలీని ప్రపంచానుభవం ముగింపుకొస్తుంది, చూస్తూ ఉండగా గాఢమైన దిగులులోంచి కాంతివంతమైన మృత్యుపుష్పం నీ ముందు దయగా విచ్చుకుంటుంది". ఇంకోచోట "ఈ మృత్యువు ఇంత విశాలమైనది, శబ్దాల పక్షులూ, రంగుల చేపలూ సంచరించే జాడైనా లేని పరమ చల్లనిశాంతి గుండెలకి హత్తుకుంటుంది" మృత్యువుని ఇలా కాంతిగా, శాంతిగా వర్ణించడంలో కవి వైరాగ్యాన్ని కొత్త టోన్ లో ప్రకటిస్తున్నారు.

ఈ కావ్యంలోని కవితలన్నీ చదివాక, కవి తాను నిర్మించుకున్న ప్రత్యేకలోకంలోకి మనల్ని తన వెంట తీసుకెళ్లి, తన దుఃఖాన్ని, భయాల్ని, తన సంతోషాన్నీ, తాను బతికిన క్షణాలను, తన ప్రేమగీతాలను, తన ఆత్మను మనకి నిర్మొహమాటంగా విప్పి చెప్పి మనల్ని సహానుభూతికి లోను చేస్తారు .

5

కవి తనను తాను ఆవిష్కరించుకున్న కావ్యం ఇది. ఒకరకంగా ఇది కన్ఫెషన్ స్టేట్మెంట్. ఎన్నిసార్లు కింద పడ్డా మళ్ళీ జీవితేచ్ఛతో లేచే ప్రయత్నం. మనుష్యులు, మనసులేని మరోలోకంలో విహరించాలని కవికి బలంగా ఉంది. ఊగిసలాట నుండి స్థిరత్వానికి వెళ్ళిపోవాలనే కాంక్ష అంతర్లీనంగా బలంగా ఉంది. సాధారణంగా కవిత్వంలో తాత్వికత ఉంది అంటారు. కానీ, ఈ కవిలోని తాత్వికకాంక్షనే ఈ కవిత్వాన్ని ఓ నెపంగా ఎన్నుకుని కావ్యమై ప్రవహిస్తున్నది.

అందుకే ఈ కవిత్వం మొత్తం ఈ కొస నుండి ఆ కొస వరకు ఏదో అశాంతి. ఆ అలజడిని తిరిగి శాంతిలోకి తీసుకువెళ్లాలనే తపన, ప్రయత్నం కనిపిస్తుంది. మళ్ళీ అశాంతి. ఇది పరంపరగా కొనసాగుతుంది. ఎప్పుడికప్పుడు ఇలా తన మూడ్స్ రికార్డ్ చేయడం కవి నిజాయితీని చెబుతుంది.

ఎందుకు జారిపోతుంటాము?

లోపల ఉన్న వాసనలు (లేటెంట్ టెండెన్సీస్), అలవాట్లు, భయాలు, ఐడెంటిటీ, ఆలోచనలు, వ్యక్తిత్వకాంక్ష, కొనసాగాలనే ఇచ్ఛ ఇవన్నీ స్వేచ్ఛలోకి, విముక్తిలోకి దూకాలనే కాంక్షను అడ్డుకుంటాయి. స్వస్థితిని మరుపుకు లోను చేస్తాయి. కేవలం ఇక్కడ కవికే కాదు, అనేకానేక మహాసాధకులకి కూడా ఆ అనుభవం దొరికినట్లే దొరికి జారిపోతుంటుంది.

ఎందుకంటే, కన్స్ట్రక్టెడ్ ఇగో దట్ ఈస్ ద అప్పారెంట్ ఐ, విచ్ ఆల్వేస్ ట్రైస్ టు లివ్ ఇన్ సెపరేషన్, యాజ్ సపరేట్‌నెస్ ఈస్ ఇట్స్ డియరెస్ట్ ఫుడ్. ఇన్ సెపరేట్‌నెస్, ద ఫాల్స్ ఇగో ఎంజాయ్స్ ద టేస్ట్ ఆఫ్ డిఫరెన్స్ టు కంటిన్యూ ఇట్స్ ఎగ్జిస్టెన్స్. నీవు, నేను; చావు, పుట్టుక; అహం, భయం; రాగద్వేషాలు; బంధం, విముక్తి. ఇలా పరంపర కొనసాగుతుంది. అయితే తపన, ఆర్తి కలిగినవాళ్ళు రెడీనెస్‌తో ఉన్నవాళ్ళు ఎన్నిసార్లు జారిపోయినా, కింద పడ్డా పట్టు వదలరు. తనలోని మలినాన్ని తొలగించుకోవడానికి, పదేపదే ప్రయత్నిస్తారు. తనను తాను లోలోపలికి చూసుకుంటారు. తనలోని శాంతిని అడ్డుకున్న తెరలను తొలగించుకుంటారు.

తనకు తాను తయారుచేసుకున్న ఈ నేను (ఇగో) అనే మనోనిర్మాణాన్ని కరిగించుకోవడం ఓ మహాతపస్సు. అది కరగడానికి ఇష్టపడదు. పోవడానికి అసలే ఇష్టపడదు. భయాన్ని, అభద్రతను ఎగదోస్తుంది. కళ్ళకు గంతలు కడుతుంది. మన అసలు తావును మరపులోకి తీసుకెళ్తుంది.

విముక్తి అంటే ఉన్నది ఉన్నట్లుగా చూడడం. కన్ఫ్యూషన్ క్లారిటీగా మారడం. అహం మాయమవడం. దుఃఖానికి లోను కాకపోవడం. భయం నుండి విముక్తి చెందడం. ఎరుకతో ఆ అనుభవంలో ఉండడం. సదా వర్తమానం

అనుభవంలోకి రావడం. విముక్తి అనేది ఎక్కడో లేదు, అది ఇపుడు ఇక్కడే నాలోనే ఉందని, నేనై ఉందని తెలుసుకోవడం.

ఇక అప్పుడు ఆలోచనలుండవా? ప్రపంచం ఉండదా? కుటుంబం ఉండదా? ఉన్నదంతా సత్యమే. ఎప్పటిలాగే అన్నీ ఉన్నట్లు ఉంటాయి. అందరూ ఉన్నట్లు ఉంటారు. కానీ ఏదీ నిన్ను అంటదు. చేయాల్సినవి అన్నీ చేస్తావు, కానీ నీవు చేసినట్లుగా ఉండవు. లేస్తావు, పొలానికెళ్తావు, పంట పండిస్తావు, తింటావు, పడుకుంటావు. ఎప్పటిలాగే కుటుంబంతో ఉంటావు, నవ్వుతావు, ఏడుస్తావు, **అన్నీ చేసినట్లుగా ఉంటావు, కానీ ఏమీ చేయవు.** పాత్రోచితధర్మం నిన్ను నడిపిస్తుంది. పాత్రోచిత రియాక్షన్ ఉంటుంది.

**భేదం కేవలం ఉన్నట్లుగా ఉంటుంది, కానీ ఆ భేదం వల్ల దుఃఖం ఉండదు.** ఎందుకంటే ఆ భేదం నాటకీయమైనది, ఏకత్వం అనే తెరమీద నటించే పాత్ర అది. కంటిన్యూటీ తాడు తెగిపోతుంది. కంటిన్యూటీ ఉన్నట్లుగా ఉంటుంది, కానీ కలలాగా ఉంటుంది. ఉన్నది నీవే, జరుగుతున్నట్లు అనిపిస్తున్నదంతా నీలోనే అని తెలుస్తుంది. మేలుకున్న తరువాత కల నిన్ను అంటనట్లుగా, ఏవీ నీకు అంటవు. ఎప్పుడూ ఏమీ జరగలేదు అనే అనుభవంలో ఉంటావు.

**ఇది ఆలోచననో, ఊహనో కాదు, వాటి ప్రమేయం ఏమాత్రం లేని నీ ఉనికి.** శరీరంలో నేను ఉన్నాను అన్న స్థితి నుండి నాలో శరీరం ఉంది అనే షిఫ్ట్ జరిగి శరీరానికి ఎడంగా అవుతావు. శరీరం మనస్సును సృష్టించదు, మనస్సే శరీరాన్ని సృష్టిస్తుంది అని అర్థమవుతుంది. ప్రపంచంలో నేను ఉన్నాను అనే స్థితి నుండి ప్రపంచం నాలో ఉంది అనే షిఫ్ట్ ను చూస్తావు. గతం కలలాగా ఉంటుంది. మూడు కాలాలు, స్థలాలు 'నేను' అనే తెర మీద వచ్చి పోతున్నట్లుగా ఉంటాయి. కలగా ఉంటుంది. తేలిక. బరువు ఉండదు. ఇది నీకు మాత్రమే తెలుస్తుంది. దాన్ని వివరించడానికి అవసరానికి పదాలు వాడుతావు గానీ, పదాలలో అది ఇమడదు అని తెలుస్తుంది. అందుకే నీలో నీవు నవ్వుకుంటావు.

నీవు ఎరుకతో ఉండడం కాదు, ఎరుక నీతో ఉంటుంది, నీవై ఉంటుంది. నీలో పొంగే కరుణ, ప్రేమ నీ ప్రయత్నం లేకుండానే విప్పుకోవడం చూస్తావు. విముక్తి అంటే ఏదో కొత్తగా సాధించేది కాదు, అంతవరకు నిన్ను కప్పివేసిన మాలిన్యతెరలు ఏవో తొలగిపోవడం, హృదయం శాంతితో నిండడం. నీవు సదా మార్పు లేకుండా ఒక్కలాగే ఉన్నావని, మార్పు అంతా నీ మీద వచ్చి, పోతున్నది కానీ అది నీవు కాదని తెలుస్తుంది.

తన పైన ప్రవహిస్తున్న ప్రసాద్ అనే వ్యక్తిని తొలగించుకోవడానికి అనేక ఎత్తుపల్లాలను, దుఃఖాలను, అనుభవాలను చూసిన కవి చివరకు "బోనులో సింహం ఆకలితో లొంగినట్టు, జీవితానికి లొంగి చూడు" అంటాడు. "సమస్తాన్ని దేవుడినీడలా ప్రేమిస్తున్నావు" అంటాడు. ఈ భావన గొప్పది. టోటల్ యాక్సెప్టెన్స్ అండ్ సరెండర్ అనేది గొప్పయోగం. అది జారకుండా ఉండాలని, ఆ కాన్‌స్టాంట్ అవేర్‌నెస్‌తో కవి ప్రయత్నం, జీవితం, సాధన సఫలం కావాలని, ఆ నిర్మలశాంతి తీరంలో ఆయన నిరంతరం సేద తీరాలని మనసార కాంక్షిస్తూ!

**11.11.2025** ఏ . గంగారెడ్డి
హైదరాబాద్

# నిండైన శూన్యం

"ఈ కవితలు మీరు రాస్తున్నవి కావు, మీ ద్వారా రాయబడుతున్నవి" అని గతంలో ప్రసాద్ గారితో కొన్నిసార్లు అన్నాను. ఈ పుస్తకానికి సంబంధించి ఆ మాటలు పూర్తిగా నిజం అనిపిస్తుంది.

రాత్రింబవళ్ళకి, వెలుగునీడలకి మధ్యలో స్పష్టమైన విభజనరేఖ లేనట్టుగానే – మనిషితనంలోని మధనకి, కవిసమయంలోని కరుణకి మధ్య పరచుకున్న సాయంకాలపు నీరెండలాంటిది ఈ కవిత్వం.

ఇక్కడ కవి తనను మించిన, తను ఊహించిన, అనుభవించిన లేదా అనుభూతికి అతీతమైన ఒక మహాశక్తికి పూర్తిగా తనని తాను అర్పించుకోవడం కనపడుతుంది. దీనిలో రహస్యం ఏమీ లేదు, అన్నీ మనందరి కళ్ళ ముందర తేటతెల్లంగా కనబడే సంగతులే. ఇవి కేవలం దిగుళ్ళో, ప్రశ్నలో, బాధలో, భయాలో కాదు. అలా అని సంతోషపు కేరింతలో, పరవశత్వపు పలవరింతలో మాత్రమే కూడా కాదు. నిమిత్తమాత్రంగా, నిర్మోహంగా, నిరామయంగా తనతో సహా సమస్త ప్రపంచాన్ని చూసుకునే చూపు, లేదా కొత్తగా చూడాల్సిందేమీ లేదనే గుర్తింపు.

ఇంతా కలిసి మాటల్లో చెప్పలేని దాన్ని మాటలు గానే ప్రత్యక్షం చేసుకున్న కవి కఠోరతపస్సు. మౌనంగా మోయవలసిన బరువుని మౌనంలోకే దింపుకున్న ఒక మామూలు మనిషి తేలికపాటి మనసు. తెలియనంత వరకు చిక్కుముడిగానే ఉన్నదాన్ని, తెలుసుకోవడం అంటే "ఇది ఎప్పటికీ చిక్కుముడి అనే ఎరుకతో మసలడం" మాత్రమే అనే గమనింపు.

అదే కాలం
అదే కవిత్వం
అదే ఈ సృష్టి

**12.11.25** — స్వాతి కుమారి

బెంగుళూరు

## బయోడేటా

| | |
|---|---|
| పూర్తిపేరు | : బొల్లిన వీర వెంకట ప్రసాద్ |
| పుట్టినతేదీ | : 21. 11. 1966 |
| పితామహులు | : బొల్లిన వీరన్న, సత్యనారాయణమ్మ-ముక్కామల, ప.గో.జిల్లా |
| మాతామహులు | : భోగవల్లి సుబ్బారావు, సూర్యకాంతం-సూర్యారావుపాలెం, ప.గో.జిల్లా |
| తల్లిదండ్రులు | : విజయలక్ష్మి, అచ్యుతం |
| తోబుట్టువులు | : నాగేంద్రకుమార్, శ్రీ భవాని |
| భార్యాపిల్లలు | : మాలతీదేవి, గాయత్రి, భార్గవి |
| రచనలు | : 1. ఆరాధన (వచన కవిత్వం) 1989 |
| | 2. దృశ్యాదృశ్యం (హైకూలు) 1995 |
| | 3. హైకూ (హైకూలు) 1997 |
| | 4. పూలురాలాయి (హైకూలు) 1999 |
| | 5. నేనే ఈ క్షణం (వచన కవిత్వం) 2006 |
| | 6. ఆకాశం (వచన కవిత్వం) 2011 |
| | 7. నీలో కొన్నిసార్లు (వచన కవిత్వం) 2015 |
| | 8. ఊరికే జీవితమై (వచన కవిత్వం) 2023 |
| | 9. సృష్టి (వచన కవిత్వం) 2025 |
| పురస్కారాలు | : ఆంధ్ర సారస్వత సమితి అవార్డు, మచిలీపట్నం 2004 |
| | స్నేహనిధి పురస్కారం; విశ్వకళాపీఠం, హైదరాబాద్ 2012 |
| | ఇస్మాయిల్ కవితా పురస్కారం, కాకినాడ 2011 |
| | గుంటూరుజిల్లా రచయితలసంఘం అవార్డు, గుంటూరు 2011 |
| | నూతలపాటి కవితా సత్కారం, తిరుపతి 2011 |
| | కె.వి.ఎస్. ఉగాది సాహిత్య పురస్కారం, ఏలూరు 2015 |
| | తిలక్ అవార్డు, తణుకు 2016 |


చిరునామా : బివివి ప్రసాద్, # 23-12-21, సజ్జాపురం, తణుకు,
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ 534 211

ఫోన్ : 90320 75415, ఈ మెయిల్ : prasadbvv1@gmail.com

బ్లాగ్ : bvvprasad.blogspot.com,

పుస్తకాల డౌన్‌లోడ్‌కి : archive.org/details/@bvv_prasad



## నాలుగో కన్ను

కవులకే కాదు, అందరికీ వుండే మూడోకన్ను మనసు. ఆ మనసును కూడా చూడగలిగే నాలుగోకన్ను నిజకవుల సొంతం. వాళ్లు చర్మం అవతల కాంతిసంవత్సరాల దూరాల్లోకే కాదు, చర్మం లోపలి విశ్వమూలాల్లోకీ పయనించగలరు. ఆ అనుభవాన్ని తమ అసాధారణ ప్రతిభతో పాఠకులక్కూడా అందించగలరు.

ఆ అంతరంగ పయనానికి పచ్చని మైదానాల మీద వీచే అవగాహన కావాలి. వృక్షాల్లో ప్రవహించే నదుల ఆవాహన జరగాలి. 'నేను' కరిగిన మమేకత మిగలాలి. లోపలికి వికసించే పుష్పపు నిశ్శబ్దం మెత్తగా తాకాలి.

ఇక ఆ స్పర్శలో-

ఇలాటి కవిత్వం కాక ఏం వుదయిస్తుంది? సీతాకోకలు చేసిన ఖాళీలకి అద్దిన పరిమళాలేనా., ఏకాంతాన్ని తేజోమయం చేసే నక్షత్రజల్లులేనా., దుఖ్ఖాల్ని పటాపంచలు చేసే ఆనంద సాగరాలేనా.!

ఆ అమూర్త అనుభవాల్ని కంటిముందు శిల్పించే పదాల పరుసవేదం ఇదంతా! గూడుకట్టుకున్న జీవితభారాన్నంతా చిటికెలో తుడిచేసే మంత్రలోకపు మార్మికపవనం కదా ఇది. మొత్తంగా గోడలన్నిట్నీ కూల్చేసి స్వేచ్ఛావరణలోకి ఎగరేసే అంతూదరీ లేని మాంజా, సృష్టికి ప్రతిసృష్టిగా నిలిచే ఈ సృష్టి!

-రమణజీవి